# స్మృతి సుమాలు

# Smriti Sumalu

## *Flowers Of Remembrance*

SAIPATHAM PUBLICATIONS
SHIRDI CHENNAI HYDERABAD

Title: *Smriti Sumalu - Flowers of Remembrance*
స్మృతి సుమాలు

Edition: *Guru Purnima, July 2011*
గురుపూర్ణిమ, జూలై 2011

Published by: *Saipatham Publications*
*Saipatham, Shirdi - 423109*
*publications@saimail.com*
సాయిపథం పబ్లికేషన్స్
సాయిపథం, శిరిడీ - 423109

ISBN: *978-81-88560-05-9*

Processing: *Sai Mudra, Shirdi*
సాయిముద్ర, శిరిడీ

Printed at: *Saibonds Print Systems*
*Chennai -106*
సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్
చెన్నై -106

Website: *www.saibaba.com*

# ప్రకాశకుల ముందుమాట

## స్మృతి సుమాలు

“*ఎవరైతే నిరంతరం నా విషయాలే వింటూ, మాట్లాడుతూ, స్మరిస్తూ, నన్నే అనన్యంగా నమ్ముకొని ఉంటారో వారు ఇహపరాల గురించి భయపడవలసిన పనిలేదు*”, “*నిరంతరం నన్నే స్మరిస్తూ నా లీలలను మననం చేసేవారు నేనుగా మారిపోతారు*” అని అభయాన్నిచ్చారు- శ్రీసాయిబాబా. శ్రీసాయి వాక్కే శృతి ప్రమాణంగా సదా సాయి స్మరణ, స్ఫురణతో సాయిపైనే ఆధారపడి జీవించి, సాయిపట్ల అనన్య ప్రేమతో తన ప్రతి స్పందనను సాయిలో లయించి, తాదాత్మ్యం చెందిన మహితాత్ములు- పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ.

సాయి ప్రేమ, ప్రబోధం, అనుగ్రహమే ఆలంబనగా ఎందరో జీవితాల్లోని వెలితిని ఆనందంతో నింపిన పూజ్యశ్రీ బాబూజీ సమాధి అనంతరం భక్తులు పొందిన అనుభవ సుమాల సమాహారం- ఈ ‘స్మృతి సుమాలు’. శ్రీబాబూజీకి భక్తులు తమ అనుభవ జ్యోతులను ఆరతిగా చేసి అర్పిస్తున్న అక్షర నీరాజనం- ఈ ‘స్మృతి సుమాలు’.

తమ జీవితాలను అర్థవంతంగా తీర్చిదిద్ది, దివ్యానుగ్రహంతో ఆనందమయం చేసిన పూజ్యశ్రీ బాబూజీతో తమకు గల అనుబంధాన్ని, పొందిన అనుభవాలను, అనుభూతులను అసంఖ్యాకంగా భక్తులు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ‘శ్రీబాబూజీ మనకిక లేరు’ అని దిగాలుపడ్డ హృదయాలకు, సమాధి అనంతరం కూడా తాను అప్రమత్తుడనై ఉన్నానని దివ్యానుభవాల ద్వారా శ్రీబాబూజీ అభయమిస్తున్నారు. భౌతికంగా వారు లేని లోటు తీర్చలేనిదైనా, సమాధి అనంతరం వారి మహిమ మరింత విస్తృతంగా ప్రకటమవుతుందనడానికి భక్తులు పొందుతున్న అనుభవాలే నిదర్శనం.

శ్రీబాబూజీ మహాసమాధి అనంతరం- భక్తులకు అనుగ్రహిస్తున్న అనుభవాలను సంకలనం చేసి, శ్రీబాబూజీ స్మృతిగా ఆరాధనోత్సవాల సందర్భంలో ‘సావనీర్’ ముద్రితం చేయాలని గురుబంధువులు భావించడం జరిగింది. అసంఖ్యాకంగా భక్తులు తమ అనుభవాలను పంపడంతో, ఆ సమయంలో వెనువెంటనే ముద్రించడం వీలుపడలేదు. ఆ అనుభవాలన్నింటినీ ఒక పుస్తకరూపంలో గురుపూర్ణిమ 2011 నాటికి ముద్రించడం జరిగింది. ప్రతి భక్తుని అనుభవం, సద్గురువుతో గల అనుబంధం అత్యున్నతమైనవి, అంచనాలకు అందనివి. ఒకరి అనుభవం గొప్పది, మరొకరిది తక్కువ అని బేరీజు వేయడం వృధా శ్రమ, వ్యర్థ ప్రయత్నమే అవుతుంది. అసంఖ్యాకంగా ఉన్న అనుభవాలన్నింటినీ ఒకేసారి ప్రచురించడం పరిధికి మించినది. సద్గురు అనుగ్రహానికి పరిమితులెక్కడ? అనుభవసాగరానికి అవధులెక్కడ? అందువలన ఇప్పటివరకు అందిన అనుభవాలలో కొన్నింటిని మాత్రమే ప్రథమ ప్రయత్నంగా ‘సావనీర్’లో ప్రచురించడం జరిగింది.

సద్గురుపథంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు, మరెన్నో మధుర స్మృతులు. సద్గురు స్మృతి, అనుభవాల సమాహారమైన ఈ ‘స్మృతి సుమాలు’ వెదజల్లే సద్గురు ప్రేమ సౌరభాలు మనలో ఒక దివ్య భావావేశాన్ని, ఉద్వేగానందాన్ని కల్గిస్తాయి. దివ్యానుభూతికి లోనుచేస్తాయి. సద్గురు ప్రేమామృత వాహినిలో ఓలలాడిస్తాయి. సద్గురు హృదయానికి చేరువ చేస్తాయి. ప్రతి అనుభవ నేపథ్యంలో ఉన్న సద్గురు ప్రేమ మనస్సును హత్తుకొంటుంది, అగాధతత్త్వం ఆలోచింపజేస్తుంది, అభయతత్త్వం ముగ్ధుల్ని చేస్తుంది.

ఈ అనుభవ స్మృతులు చదువుతున్నప్పుడు శ్రీబాబూజీ మనతో ఉండి, మనలో ఉండి మాట్లాడుతున్నట్లు వారి దివ్య సాన్నిధ్యం అనుభవమవుతుంది. మనస్సుకు ఎంతో సాంత్వన చేకూరుతుంది. ప్రశాంతతతో నిండుతుంది. ఈ స్మృతి సంకలనంలోని ప్రతి పదం, ప్రతి అక్షరం ఆ మహాత్ముని మహత్తుని, సర్వవ్యాపకత్వాన్ని తమ గుండె చప్పుడుగా వినిపిస్తాయి. సద్గురు అమరత్వాన్ని కీర్తిస్తాయి. వారి అభయం, అనుగ్రహం ఎల్లవేళలా మనల్ని వెన్నంటి ఉంటాయన్న ఎరుకను క్రమంగా స్థిరం చేస్తాయి.

తమకు ప్రసాదితమైన దివ్య అనుభవాలను గుర్తించి, మరపులోనికి నెట్టకుండా గుర్తుంచుకొని, అందరితో పంచుకోవడం ద్వారా – భక్తులు ప్రియతమ గురుదేవులైన శ్రీబాబూజీ పట్ల తమకున్న ప్రేమను, అభిమానాన్ని వ్యక్తం చేసుకొన్నారు. వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతాభివందనాలు. ఆ అనుభవాలన్నింటినీ సేకరించి సకాలంలో పంపడం, ఆ అనుభవ వ్రాతప్రతులను టైప్ చేయడం, తప్పులను సరిదిద్దడం, 'సావనీర్'ని చక్కగా తీర్చిదిద్దడం, అందంగా ముద్రణ చేయడం– ఇలా ప్రతి విషయాన్ని ఒక బృహత్ యజ్ఞంలా భావించి, సమిధలు చేకూర్చి, ఈ 'సావనీర్'ను రూపొందించడంలో పాలుపంచుకొన్న గురుబంధువులందరిపై సద్గురు కృపావర్షం నిరంతరం కురవాలని ప్రార్థిస్తూ, 'సాయిపథం' కృతజ్ఞతాభినందనలు తెలుపుతోంది.

"సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!!" అని ఎలుగెత్తి చాటి, మనలో సాయి రూపాన్ని ప్రతిష్ఠించి, మనందరికి సాయితత్త్వాన్ని, ప్రబోధాన్ని పంచి, సాయి మార్గాన్ని చూపి, సాయి ప్రేమను చవిచూపించిన– ఆ మహాత్ముని మహోన్నత ఆశయాల సాధనకై అంకితభావంతో కృషిచేసి, వారు నెలకొల్పిన అత్యున్నత ఆదర్శాలను పాటించి – సాయి ప్రబోధించినట్లుగా 'తండ్రికి తగ్గ బిడ్డలం' అవుదాం. ఆ తండ్రి ప్రేమకు పాత్రులమవుదాం. వారు ప్రసాదించిన, ప్రసాదిస్తున్న అనుభవాలను మన హృదయ ఫలకంలో భద్రంగా దాచుకుందాం. సద్గురు స్మృతి సౌరభాలను ఆస్వాదిస్తూ ఆ అనుభవామృతాన్ని, ప్రబోధసారాన్ని అందరికీ పంచుదాం. మన ఈ 'స్మృతి సుమాలు'తో సద్గురు చరణారవిందాలను భక్తిప్రపత్తులతో అర్చిద్దాం.

-సాయి సీకర్స్

SAI SEEKERS

# విషయసూచిక


**ముందుమాట** 3

**మనస్సుమాంజలి - కృతజ్ఞతా కుసుమాంజలి** 7

**సాయి వినీలాకాశంలో సద్గురుచంద్రుడు** 11

అనుభవాల సేకరణకు వెల్లువెత్తిన అనుగ్రహం 19

ఇక దర్శనం ఇలానే ఇస్తారు 20

సాయి స్ఫురణ 21

సాయి బృందావనం 22

ధృవతార 23

సద్గురు స్మృతిపథంలో జీవిత'యాత్ర' 23

అందరి దగ్గర ఉన్నా 26

నేనున్నాను- ఏదైనా నన్నడుగు 26

పసి హృదయాన్ని సైతం స్పందింపజేసే దర్శనం 27

దేహానంతరం అప్రమత్తులే 28

తలచినంతనే అనుగ్రహం 29

అనునిత్యం అనుగ్రహం 30

మహద్భాగ్యం 30

మా ఇంటికి వచ్చారు 32

వ్యధ తీర్చిన స్వప్నదర్శనం 32

ఆ చూపు వెతలను బాపు 33

ఎవరు ముందు వెళ్ళాలి 34

ఉత్తరం వ్రాయి 34

నన్ను కాపాడారు 35

మనతోనే ఉన్నారు 36

సాక్షాత్తూ భగవంతుడు 36

ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి 37

గమ్యానికి చేరుస్తాను 38

చెప్పినట్లు నడుచుకోవడం లేదు 39

అద్భుతం 39

ని'దర్శనం' 40

విడదీయరాని సద్గురు బంధం 40

మాట నిలుపుకొన్న మహిమాన్వితులు 41

సమాధి అనంతర లీలలు 42

సదా సద్గురు ఆశీస్సులు 43

అడిగినంతనే అనుభవం 43

తీర్చిదిద్దారు 44

అపారమైన ప్రేమ 45

| | |
|---|---|
| అద్భుతవాణి | 46 |
| స్వప్నదర్శనం | 47 |
| మరువలేని అనుభవం | 47 |
| మనం ఆనందంగా ఉంటే ఆయన ఆనందిస్తారు | 48 |
| నా దగ్గరే ఉన్నావు | 49 |
| సర్వత్రా ఉన్నాను | 50 |
| సమాధి మాట్లాడుతుంది | 50 |
| మనతో ఉండి కాపాడుతున్నారు | 51 |
| మళ్ళీ మళ్ళీ దర్శించాలనిపించే సుందరరూపం | 52 |
| తక్షణ రక్షణ | 53 |
| శిష్యురాలిగా స్వీకరించారు | 53 |
| సద్గురు లీలానుగ్రహం | 54 |
| మహాత్ములకు మరణమెక్కడిది? | 55 |
| అడిగినవన్నీ నెరవేర్చే వేల్పు | 56 |
| దేహత్యాగం ముందే సూచన | 57 |
| అనుదినం నిదర్శనం | 57 |
| ప్రార్థన మన్నించారు | 58 |
| అనుగ్రహ వీక్షణం | 58 |
| సాయి'ధన్య'మైన జీవితం | 59 |
| ఇతరుల బాధ స్వీకరించా | 60 |
| సమాధి నుండే సమాధానం | 61 |
| సద్గురు దర్శనం | 61 |
| నవ్వుతో బాధంతా మటుమాయం | 62 |
| కలలో జరిగినదంతా నేను చెప్పకుండానే చెప్పారు | 62 |
| రక్షణ | 63 |
| సర్వవ్యాపకత, రక్షణ | 63 |
| అనుగ్రహ కుసుమం | 64 |
| బాబా పాదాల చెంత బాబూజీ | 65 |
| ఎక్కడకీ వెళ్ళలేదు - ఇక్కడే ఉన్నా | 65 |
| వెన్నంటి ఉన్న సద్గురు రక్షణ | 66 |
| శిరిడీలో ఉన్నాను - ఎప్పుడైనా దర్శించుకో | 66 |
| రూపాతీతులు | 67 |
| కంటికి రెప్పలా కాపాడే గురువు | 67 |
| వీడ్కోలు | 68 |
| నిరంతరం వర్షిస్తున్న అనుగ్రహం | 68 |
| కనుమరుగుగాని దర్శనం | 69 |
| ఎక్కడకీ వెళ్ళలేదు, మీతోనే ఉన్నా | 69 |
| గురువుగారు మనతోనే ఉన్నారు | 70 |
| ఆంగ్లానువాదం, Smriti Sumalu – English Translation | 71 |



# *మనస్సుమాంజలి – కృతజ్ఞతా కుసుమాంజలి*

**సా**యిని అనన్యంగా ప్రేమించిన మహాత్ములు పూజ్యగురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ, సాయి చూపిన మార్గంలో జీవిస్తూ, తమను ఆశ్రయించిన వారికి ఆ సాయిపథాన్ని చూపించారు. బాబాపై తప్ప దేనిపైనా, మరెవరిపైనా ఆధారపడకూడదన్నది శ్రీబాబూజీ వ్యక్తిగత నియమం. శ్రీబాబూజీ జన్మించిన మంగళకరమైన శుభదినం శ్రీసాయిబాబాతో శ్రీబాబూజీకి ఉన్న దివ్యబంధాన్ని సూచిస్తుంది. 1954వ సంవత్సరం విజయదశమి పర్వదినాన, శ్రీసాయి 36వ మహాసమాధి మహోత్సవ శుభతరుణంలో, సమాధిమందిరంలో సజీవ కళ ఉట్టిపడే శ్రీసాయిబాబా విగ్రహానికి ప్రతిష్ట జరిగిన అదే రోజున శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ ఈ పుడమిపై ప్రభవించారు.

శ్రీబాబూజీ తమను ఒక గురువుగా ఏనాడూ చెప్పుకోలేదు. ఇంకా, తాను గురువును కాదని విస్పష్టంగా తెలిపారు. అయితే, ప్రేమ, శక్తి, జ్ఞానం –ఈ మూడు దివ్య లక్షణాలు కలబోసిన సమర్థ సద్గురువు– శ్రీబాబూజీ అని మనందరి అనుభవం. “*సద్గురువంటే, భక్తులకు అందనంత ఎత్తులో, దివ్య లోకంలో ఉండేవాడు కాదని, మన స్థాయికి దిగివచ్చి, మన చేయి పట్టుకొని నడిపించి, క్రమంగా మనలో పరిణతి కలిగించి, ఉన్నతిని ప్రసాదించే వారే నిజమైన సద్గురువ*’ని శ్రీబాబూజీ అంటారు.

శ్రీబాబూజీ కురిపించిన ప్రేమ ఆయనను ఆశ్రయించిన ప్రతి ఒక్కరి జీవితాలను ఆనందమయం చేసింది. శ్రీబాబూజీ మనలను తల్లిలా లాలించి, ప్రేమించారు. నిగూఢ శక్తితో మనకు రక్షణ ప్రసాదించారు. వారి జ్ఞానం మనకు దారి చూపింది. మనకు సంబంధించిన ఏ విషయమూ శ్రీబాబూజీకి అల్పంగా తోచదు. తనను అడిగిందే తడవుగా ఎవరికైనా, ఎంతైనా ఇవ్వడమేగాని తిరిగి ఏమీ ఆశించడం, స్వీకరించడం శ్రీబాబూజీ ఎరుగరు. నిజానికి మనం గురువుగారికి ఏదైనా సమర్పించడమనేది అసంభవం. కారణం, శ్రీబాబూజీ అత్యంత నిష్ఠగా ఆచరించే నియమం– అపరిగ్రహం. (శ్రీసాయిబాబా సెంట్రల్ స్కూల్ వ్యవస్థాపకులుగా వారికి గౌరవ భృతి లభిస్తుంది)

శ్రీబాబూజీ తమ వద్దకు వచ్చిన వారి పట్ల అవ్యాజమైన ప్రేమతో వారి స్థాయికి దిగివచ్చి, వారి వారి అవసరాలకు స్పందించి, కోరికలను తీర్చుతారు. అయితే, ఆ ప్రతిభంతా ‘సాయి అనుగ్రహమే’నని అంటారు. చిన్న పాప చాక్లెట్ అడిగితే నవ్వుతూ ఇస్తారు. చదువులో ఇబ్బంది పడే కాలేజీ విద్యార్థికి పరీక్షలను ఎదుర్కొనే ధైర్యాన్ని, సానుకూల ఫలితాన్ని ప్రసాదిస్తారు.

సాధనలో తొలి అడుగులు వేస్తున్న వారికి అద్భుత, నిగూఢ అనుభవాలనిస్తారు. శ్రీబాబూజీ అనుగ్రహంచేత ఎందరికో అనారోగ్యం కుదిరి స్వస్థత కలిగింది. దిక్కులేక దిగాలుపడ్డ జీవితాలకు సాంత్వన చేకూరింది. ఎందరో వ్యాపారస్థులు అభివృద్ధి సాధించారు. ఎందరో మేధావులు ఊహకందని ఆయన మేధస్సుకు, అపార జ్ఞానానికి అచ్చెరువొందారు, ఆ జ్ఞానసాగరంలో ఓలలాడారు. ఇక పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాల విషయానికివస్తే– శ్రీబాబూజీ చదువని విషయం లేదు, ఉదహరించని పుస్తకం లేదు, వివరించలేని తత్త్వం లేదు. అంత అధ్యయనం చేసినా శ్రీబాబూజీ ఆలోచనా విధానం వారికే సొంతమైన ఒక ప్రత్యేక శైలిలో సహజసిద్ధంగా ఉండేది. పాత సాంప్రదాయాలను, పద్ధతులను కూడా నూతన దృక్పథంతో చూస్తారు శ్రీబాబూజీ. వాటిలోని ప్రాముఖ్యతను వివరించి మనలను ఆ వైపు ఉత్తేజితులను చేస్తారు.

సాహిత్యానికి, పుస్తకాలకు శ్రీబాబూజీ గొప్ప విలువనిస్తారు. చాలా సంవత్సరాలపాటు – తెలుగు, ఆంగ్లం, సంస్కృతం, హిందీ, మరాఠీ భాషల్లో ఉన్న అరుదైన, ప్రత్యేకమైన పుస్తకాలతో కూడిన విశిష్ఠమైన వ్యక్తిగత గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసుకొన్నారు. శ్రీబాబూజీ పుస్తకపఠనంపట్ల మంచి అభిరుచిగల దార్శనికులు. అంతేగాకుండా గొప్ప రచయిత, గ్రంథకర్తగా విఖ్యాతిచెందారు. అత్యంత ప్రామాణికమైన అనేక పరిశోధనా గ్రంథాలను వ్రాశారు. అయితే వీటన్నింటికి ఆధారం, మూలాంశం – సాయిబాబానే. తెలుగు, ఆంగ్లభాషల్లో వారికి అసాధారణమైన సాధికారత ఉండేది. తమకే సొంతమైన కవితాత్మకమైన భావప్రకటనకు, ప్రత్యేకమైన శైలికి వారికి వారే సాటి. పాశ్చాత్యులు శ్రీబాబూజీ దగ్గరకు రావడం ఆరంభించిన తర్వాత వాళ్ళ వాళ్ళ సంస్కృతి, సాహిత్యం, చరిత్ర పట్ల శ్రీబాబూజీకి ఉన్న పరిజ్ఞానం, అవగాహన చూసి వాళ్ళెంతో ఆశ్చర్యపడేవారు. శ్రీబాబూజీ ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడడం, తమకంటే వారికే తమ భాషపై పట్టు ఉండడంచూసి పాశ్చాత్యులు అమితాశ్చర్యానికి లోనయ్యేవారు.

భారతదేశ సాంప్రదాయాలపట్ల, ఆధ్యాత్మిక చరిత్రపట్ల శ్రీబాబూజీకి ఎంతో గౌరవం ఉంది. అయితే, ఇతర దేశాల గురించి, ఆధునిక ప్రపంచంలోని నూతన ఆవిష్కరణల గురించి అధ్యయనం చేయడానికి అది అడ్డంకి కాలేదు. "*మనకు తెలిసిన పాత విషయాలనే పట్టుకొని వేళ్ళాడటం ఎందుకు? నూతన విషయాలను అన్వేషిద్దాం..పరిశోధిద్దాం..పరిశీలిద్దాం.. మనకు ఉపయోగపడేది ఉంటే గ్రహిద్దాం*" అంటారు శ్రీబాబూజీ. అదే స్ఫూర్తితో శ్రీబాబూజీ కంప్యూటర్ టెక్నాలజీని నేర్చుకొన్నారు. అతి తక్కువ సమయంలో అటు హార్డ్‌వేర్ లోనూ ఇటు సాఫ్ట్‌వేర్ లోనూ నిష్ణాతులయ్యారు. ఆ ప్రజ్ఞ అంతా తమ ఇష్టదైవమైన శ్రీసాయిబాబాను ఇంకా ఇంకా ఆరాధించేందుకు... అంటే, అవిశ్రాంతంగా శ్రమించి, సాయిచరిత్రకు సంబంధించిన అంశాల పరిశోధనకో లేక సాయిబాబా ఒరిజినల్ ఫొటోని ఫోటోషాప్‌లో పునరుద్ధరించడానికో, మరేదైనా బాబాకు సంబంధించిన అంశాలకో ఉపయోగించారు.

విద్యానగర్ కాలేజీలో విద్యార్థిగా ఉన్నప్పుడు వారి ఇంగ్లీషు లెక్చరర్ అయిన మాష్టర్ భరద్వాజగారు శ్రీబాబూజీకి సాయిబాబాను తొలిసారిగా పరిచయం చేశారు. అప్పటి నుండి జీవితపు నిగూఢతత్త్వాన్ని అన్వేషిస్తూ... దీక్షా సంకల్పాలతో శ్రీబాబూజీ సాధన సాగించారు. వారి పట్టుదల, ఏకాగ్రత, నిబద్ధత వారి చుట్టూ వున్నవారిని ఆశ్చర్యానికి గురిచేసేవి.

శ్రీరమణమహర్షి జీవిత చరిత్ర శ్రీబాబూజీని అత్యంత ప్రభావితం చేసి, 'ఈ జీవితకాలంలో సాక్షాత్కారం సాధ్యమే' అన్న స్ఫూర్తిని ప్రసాదించింది. శ్రీబాబూజీ సాగించిన కఠోర సాధన, తమ 20వ యేట శ్రీసాయిబాబా అనుగ్రహ విశేషంగా శ్రీపూండీస్వామి సన్నిధిలో ఫలప్రదమైంది.

శ్రీసాయిబాబాకు సంబంధించిన విషయాల్లో శ్రీబాబూజీ పూర్తిగా నిమగ్నమై ఉండేవారు. జనవరి 1, 1988న శ్రీబాబూజీ 'సాయిపథం' పత్రిక స్థాపించి, అందుకవసరమైన రచన మరియు ఎడిటింగ్ స్వయంగా చేసేవారు. వారి పరిశోధన పరిపూర్ణం, లోపరహితం. అప్పటివరకు ఎవరికీ తెలియని సాయిబాబా చరిత్ర విశేషాలు, ఒరిజినల్ ఫొటోలను వెలుగులోకి తెచ్చారు శ్రీబాబూజీ.

శ్రీబాబూజీ ప్రబోధం సాయిబాబా పరంగా.. అత్యంత సహజంగా.. ఆచరణయోగ్యంగా ఉంటుంది. శ్రీబాబూజీ, ఎన్నో అపోహలను, మూఢనమ్మకాలను పోగొట్టి, సంకుచిత భావాలను ఎండగట్టి, కులమత, ఛాందస భావాలను ఖండించారు. శ్రీబాబూజీ ఉన్నత సిద్ధాంతాలు, అపారమైన మేధస్సు, అత్యంత సునిశిత పరిశీలన, పరిశోధన– వారి నిబద్ధతను, క్రమశిక్షణను, శ్రద్ధను సూచిస్తాయి.

ఆధ్యాత్మికత విషయమై శ్రీబాబూజీ మనను అనుసరింపజేసే విధానం చాలా ఆచరణాత్మకంగా, సహజంగా ఉంటుంది. మానవత్వం యొక్క ప్రాముఖ్యత గురించి, మన జీవితంలో దానిని వ్యక్తపరచవలసిన అవసరం గురించి నొక్కిచెప్పేవారు. క్రియాశీలత, సామాజిక స్పృహ లేని శుష్కమైన ఆధ్యాత్మికతను శ్రీబాబూజీ సమర్థించరు. స్వయంగా హోమియోపతిని అభ్యసించి, శిరిడీలో అనేకమందికి ఉచితంగా వైద్యసహాయం అందించి 'డాక్టర్ బాబు'గా మన్ననలను పొందారు. వారి స్ఫూర్తితో అనేకమంది 'సాయిపథం' ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ, దేశంలోని అనేక ప్రాంతాల్లోనూ రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, వైద్యశాలలు, అన్నప్రసాద వినియోగం మొదలైన కార్యక్రమాలెన్నో నిర్వహించారు.

శ్రీబాబూజీలో వ్యక్తమయ్యే ఉల్లాసం, వారి చుట్టూ ఉండే ఆహ్లాదకరమైన వాతావరణం.. వారి మాటల్లోంచి జాలువారే సునిశిత హాస్యం... శ్రీబాబూజీకే సొంతం. వారి సాన్నిధ్యంలో అనునిత్యం ఆనందపు చిరునవ్వుల జల్లు కురుస్తుంది. తమ చుట్టూ ఉన్నవారిని ఆటపట్టిస్తూ.. దానిలో భాగంగా వారిలోని చిన్న లోపాలను, వారి ప్రవర్తనను సరిదిద్దుతూ సాగే శ్రీబాబూజీ వ్యవహారిక సంభాషణ కూడా పరమ సత్యాలను తెలిపే సద్గురు ప్రబోధమనే చెప్పాలి.

*"ఏదైతే మనలను అన్ని రకాలుగా ఉత్తేజపరుస్తుందో అదే ఆధ్యాత్మికత"* అంటారు శ్రీబాబూజీ. నిత్యనూతనంగా ఉండే శ్రీబాబూజీ జీవితం ఆ మాటకు నిలువెత్తు నిదర్శనం.

తమ గురువు అభీష్టం మేరకు శ్రీబాబూజీ, అనసూయమ్మగారిని వివాహమాడారు. ఆమె ఎవరో కాదు, తమ గురుపత్నికి స్వయానా సోదరి. అత్యంత భక్తి, ఆచారం గల కుటుంబనేపథ్యం.. మరియు స్వయంగా సాయి భక్తురాలైన ఆమె– శ్రీబాబూజీ జీవన విధానానికి, జీవిత లక్ష్యానికి సరైన జోడిగా నిలిచారు. వారి గారాల కుమార్తె శృతి ఆ దివ్య దంపతుల అసాధారణ ప్రతిభకు, మార్గదర్శకానికి ప్రతీక.

తమ లక్ష్యసాధనకై శ్రీబాబూజీ ఏళ్ళ తరబడి ఏకాగ్రతతో కఠోర సాధన చేశారు. ఆ సమయంలో వారి దేహం అలక్ష్యానికి గురయ్యింది. ఇటీవల కాలంలో శ్రీబాబూజీ తరచూ అనారోగ్యానికి గురయ్యేవారు. ఈ మధ్య హృదయ సంబంధిత అనారోగ్యానికి గురై ఆరోగ్యం క్షీణించింది. శ్రీబాబూజీ నవంబర్ 13, 2010న మహాసమాధి చెందారు. శ్రీసాయిబాబా సన్నిధానమైన శిరిడీని శ్రీబాబూజీ తమ అంతిమ విశ్రాంతి ప్రదేశంగా సూచించారు. శ్రీబాబూజీ మహాసమాధి చెందిన తర్వాత వారి దేహాన్ని సాయిపథం సత్సంగహాలులో ఉంచారు. ఆ రోజున దేశ, విదేశాల నుండి అసంఖ్యాకంగా తరలివచ్చిన భక్తులు శ్రీబాబూజీ పార్థివదేహాన్ని, ఆ రూపాన్ని కడసారిగా దర్శించుకొన్నారు. శ్రీబాబూజీ సతీమణి శ్రీమతి అనసూయమ్మగారు, వారి కుమార్తె శృతి చేతుల మీదుగా సమాధి కార్యక్రమాలు నిర్వహింపబడ్డాయి. శ్రీబాబూజీ సన్నిధానం వద్ద డిసెంబర్ 31, 2010 నుండి జనవరి 2, 2011 వరకు ఆరాధనోత్సవాలు జరిగాయి.

ఆధ్యాత్మికతను సంక్షిప్తంగా వర్ణించాలంటే– *"ప్రేమను అనుభవించడం... ప్రేమను వ్యక్తపరచడం"* అని తెలిపారు పూజ్యశ్రీ బాబూజీ. శ్రీబాబూజీని తమకు చెందినవారుగా, తాము శ్రీబాబూజీకి చెందినవారుగా భావించే ప్రతి ఒక్కరికీ – జీవితమంటే ఈ రెండే. ఒకటి, సద్గురువు ఎన్నోరకాలుగా కురిపిస్తున్న అవ్యాజ ప్రేమను తనివితీరా అనుభవించడం... ఆస్వాదించడం... ఆనందించడం. రెండవది, సద్గురువు పట్ల మనకున్న ప్రేమను మనం చేసే ప్రతి పనిలోనూ సాధ్యమైనంతగా వ్యక్తపరచడం.

అసలైన అందం, ఆనందం యొక్క ప్రాముఖ్యత తెలిసిన శ్రీబాబూజీ ఎక్కడున్నా తమ చుట్టూ ఆధ్యాత్మిక అందాన్ని, ఆనందాన్ని వికసింపజేసారు. జీవితంలో రసానుభూతి యొక్క ప్రాముఖ్యతను తిరిగి తిరిగి మనకు తెలిసేలా చేశారు. మహాత్ములలో ఆణిముత్యం శ్రీబాబూజీ. శ్రీబాబూజీ గొప్ప సద్గురువు. తమ వద్దకు వచ్చిన కఠిన శిలలవంటి వారిని కుసుమకోమలంగా మలచిన మహోన్నత శిల్పి. జీవితాలను సుందరంగా తీర్చిదిద్దిన అద్భుత చిత్రకారుడు.

జీవితంలోని అసలైన మాధుర్యాన్ని రుచిచూపి, జీవితపు అసలు అర్థం– ప్రేమ అని శ్రీబాబూజీ తెలియజేశారు..చేస్తున్నారు. శ్రీబాబూజీ తమ దివ్యప్రేమ, ప్రబోధంతో మనందరిని అనుగ్రహించుగాక!





# సాయి వినీలాకాశంలో సద్గురుచంద్రుడు

కష్టాలతో, సమస్యలతో దిగాలుపడ్డ దీనులకు సాయిమహిమను తెలిపి,
సాయిదరికి చేర్చి, సాయిప్రబోధాన్ని పంచి, సాయి ప్రేమానుగ్రహాన్ని చవిచూపించి,
వారి జీవితాలను ఆనంద'సాయి'మయం జేసిన మహాత్ములు,
ఆర్తుల కోరికలను, ఆశలను, ఆశయాలను 'సాయి'పరంగా తీర్చిదిద్దిన సాయిఅనుగ్రహశిల్పి,
గతితప్పిన సాధన ప్రయాణంలో గమ్యం తెలియని సాధకులకు సాయిమార్గాన్ని చూపిన సన్మార్గదర్శి,
మూఢాచారాలు, మెట్టవేదాంతమత్తులో జోగాడేవారిని మేల్కొలిపి సంస్కరణాపథంలో పయనింపజేసిన సంస్కర్త,
అహం, అజ్ఞానం నిండిన ఇరుకు హృదయాల కరుకుదనాన్ని సాయి కరుణామృతధారల్లో కరిగించిన ప్రేమమూర్తి,
సమన్వయపడని భావాలతో, చిక్కుప్రశ్నలతో దిక్కుతోచని జిజ్ఞాసువుల హృదయాల్లో
జ్ఞానజ్యోతులు వెలిగించిన సాయిసుజ్ఞానదీప్తి,
ఆశ్రయించిన వారందరికి తల్లి, తండ్రి, సద్గురువు, సర్వం తానేయైన మహామహితాత్ములు

***పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ.***

**సాయి స్మరణ మననలే శ్వాసగా, సాయిపైనే ఆధారపడి జీవించి, సాయిని ఆరాధించి, ప్రేమించి,
తన ప్రతి స్పందనను సాయిలో లయించి, సాయితో ఇక ఎడబాటు భరించలేకేమో -
సాయిలో ఐక్యమయ్యారు. 13 నవంబర్ 2010, శనివారం మధ్యాహ్నం 1గం.51నిమిషాలకు
పూజ్యగురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ మహాసమాధి చెందారు.**

చైతన్యం ప్రకృతిలో లీనమైపోయింది. సాయితత్త్వ అంబరంలో అనన్య ప్రేమ వెన్నెల కురిపించిన 'శరశ్చంద్రుడు' కాలమబ్బుల చాటుకు వెళ్ళిపోయాడు. సాయిభక్త అంబరం కాంతి విహీనమయ్యింది. అంతవరకు వెన్నెల్లో ఆనందంగా నర్తిస్తున్న భక్తతారకలు దిగాలుపడి కూలిపోయాయి.

పూజ్యశ్రీ బాబూజీ మహాసమాధి చెందారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా వున్న గురుబంధువులకు క్షణాల్లో చేరిపోయింది. భక్తుల గుండెచప్పుడు లయ తప్పింది. భక్తులందరూ హతాశులయ్యారు. నమ్మలేకపోయారు, దిగ్భ్రమకు లోనయ్యారు. ఎన్నో జీవితాలకు ఊపిరిలూదిన ఆ రూపం, దర్శనాలకే ఆదర్శమైన రూపం ఇక కనుమరుగవుతుందనేసరికి ఒక్కసారిగా తీవ్రవేదనతో మనస్సులు బరువెక్కాయి. సాయిభక్తలోకం కన్నీటిసంద్రంలో మునిగిపోయింది. తాము అనాథలైపోయామన్న భావం కలిగింది. జీవితాల్లో అకస్మాత్తుగా అంధకారం అలుముకున్నట్లు కుదిపివేసింది. ఇది కలా నిజమా అని అనుకున్నారు. తమను ఎంతగానో ప్రేమించి, తమ శ్రేయోభివృద్ధికై తపించి, తమను సాయిదరికి చేర్చడానికి పరితపించిన ఆ మహనీయులు లేని ఈ లోకంలో ఇంక ఉండగలమా అనిపించింది. శ్రీబాబూజీ తమకు చేసిన మేలు, వారితో తమకు గల అనుబంధం, ప్రసాదించిన అనుభవాలు, మధుర జ్ఞాపకాలు గుర్తుకువచ్చి దుఃఖం కట్టలు తెంచుకుంది. ఆకాశం బ్రద్దలై ప్రకృతి రోదిస్తున్నదా అన్నట్లు అదేరోజు రాత్రి శిరిడీలో విపరీతమైన గాలివానతో అకాలవర్షం పడింది.

జర్మనీలో ముర్నావ్‌లో విదేహులైన శ్రీబాబూజీని కడసారిగా దర్శించుకోవాలని తలచి శ్రీబాబూజీని ఎప్పుడు, ఎక్కడకు తీసుకువస్తారని భక్తులు వాకబు చేయనారంభించారు. నవంబరు 16న శ్రీబాబూజీ పార్థివదేహాన్ని శిరిడీకి తీసుకుని వస్తారని తెలిసి అన్ని దారులు శిరిడీ వైపుకు పయనమయ్యాయి. బాగా రద్దీగావున్న ఆ సమయంలో అప్పటికప్పుడు శిరిడీకి బయలు దేరడానికి ఎక్కడా, ఏ ప్రయాణ సౌకర్యాలలోనూ ఖాళీలులేవు. కానీ అవేమీ భక్తులు శిరిడీ వెళ్ళడానికి అడ్డుకాలేదు. కొన్ని గంటల వ్యవధిలోనే కొందరు భక్తులు ప్రత్యేకంగా బస్సులు మాట్లాడుకున్నారు. మరికొందరు రిజర్వేషన్ లేకపోయినా, బాగా రద్దీగా వున్నప్పటికీ రైలులో పయనమయ్యారు. పాస్‌పోర్టు, వీసాలకు సంబంధించిన ఎన్నో అవరోధాలు, మరెంతో వ్యయప్రయాసలతో కూడుకున్నా అవన్నీ సాయినాథుని అనుగ్రహవిశేషంగా అధిగమించి విదేశాల నుండి కూడా భక్తులు బయలుదేరారు. అందరికీ ప్రయాణం చేసేంతసేపు శ్రీబాబూజీకి సంబంధించిన ఆలోచనలే, వారి జ్ఞాపకాలే, వారిని గురించిన మాటలే.

చాలాకాలం ముందు నుండే శ్రీబాబూజీ తమ దేహ పరిసమాప్తి గురించి సూచనాప్రాయంగా చెబుతున్నప్పటికీ అది ఎవరికీ ఆ కోణంలో అర్థంకాలేదు. ఈ సంవత్సరం జనవరి 1 అనంతరం శ్రీబాబూజీ దర్శనాలు, వారి సమక్షంలో వివాహాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు ఉండవని అది శ్రీబాబూజీ అభీష్టమని తెలిసి, వారు ఏకాంతంలో ఉండాలనుకుంటున్నారనే భక్తులు భావించారు. భక్తులు శ్రీబాబూజీని తమకు వారి దర్శనం ఎప్పటిలాగే కావాలని, తమను వదలివెళ్ళవద్దని ప్రాధేయ పడినపుడు *"నేను మిమ్మల్ని ఎక్కడ వదులుతున్నాను, బాబా చేతుల్లోనే కదా!"* అన్నారు. *"నేను ఉన్నా లేకపోయినా ఎప్పటిలాగే గురుపూర్ణిమ, విజయదశమి వేడుకలు సాయిపథంలో జరుగుతాయని, అలాగే జరగాల"*ని అన్నారు. శ్రీబాబూజీ అన్న మాదిరిగానే వారు భౌతికంగా వున్నపుడే 2010లో గురుపూర్ణిమ, విజయదశమి సమయాల్లో తాము శిరిడీకి రానప్పటికీ యథాప్రకారం వేడుకలు జరిగేటట్లు చేసారు.

గురుపూర్ణిమ అనంతరం శ్రీబాబూజీ శిరిడీకి వచ్చి కొన్నిరోజులు గడిపారు. మహాసమాధికి ముందు అక్టోబరు మాసంలో వరుసగా తమకు పసిప్రాయంలో జటాఝూటధారియైన మహాత్ముని దివ్యదర్శనం ప్రసాదించిన తిరుమల క్షేత్రంలో, అనంతరం తమ సాధన ఫలప్రదమైన పూండీస్వామి దివ్యసన్నిధిలో, చివరలో సమర్థ సద్గురు క్షేత్రం శిరిడీలో గడిపారు. అక్టోబరు 27న శ్రీసాయి సమాధిని దర్శించుకుని, బాబా సమాధి మందిరంలో సాయిబాబా విగ్రహం ప్రక్కన గదిలో కొంతసమయం కూర్చున్నారు. అప్పటినుండి శ్రీబాబూజీ ధ్యానస్థితిలోనో లేక భిన్నమైన మనఃస్థితిలోనే ఉన్నట్లుగానో దగ్గరగా గమనించిన వారికి అనిపించింది. జర్మనీకి బయలుదేరడానికి కొన్ని రోజుల ముందు శ్రీబాబూజీ ఇంటిదగ్గర పనిచేసుకునే పిల్లలను పిలిపించి, నాలుగుసంవత్సరాల నుండి మీతో మాట్లాడదామని అనుకుంటున్నానని, ఇప్పటికి వీలయిందని చెప్పి, వారితో మాట్లాడారు. తన చిరకాల మిత్రుడిని పిలిపించి, జర్మనీ వెళ్ళే రోజు మాట్లాడారు. మహాసమాధికి ముందు, ఆ తరువాత కొంతమంది భక్తులకు స్వప్నాలలో శ్రీబాబూజీ దివ్యదర్శనం కలిగింది. మహాసమాధికి కొద్దిరోజుల ముందే తమ అంతిమ విశ్రాంతి ప్రదేశాన్ని గురించి

శ్రీబాబూజీ సేవకురాలు శ్రీమతి ఇవాన్ వయార్‌తో ప్రస్తావించారు. ఇలా అనేక విషయాలు క్రోడీకరించుకుని చూసిన భక్తులకు శ్రీబాబూజీ తమ మహాసమాధిని ముందే నిర్ణయించుకున్నారని అనిపించింది.

శ్రీబాబూజీని ఎప్పుడెప్పుడు దర్శించుకుంటామా అన్న ధ్యాసలో క్షణాలు భారంగా గడిచాయి. నవంబరు 14 ఆదివారం ఉదయం నుండే భక్తులు శిరిడీ సాయిపథానికి రావడం ఆరంభించారు. తమ సమాధిస్థానాన్ని శ్రీబాబూజీ ముందే సూచించారని తెలిసి భక్తులు శ్రీబాబూజీ సర్వజ్ఞతకు అబ్బురపడ్డారు. సాయియానా ఆవరణలో సత్సంగహాలు ప్రక్కన శ్రీబాబూజీ తమ సమాధిస్థానాన్ని సూచించిన ప్రదేశంలోనే అప్పట్లో మొట్టమొదట శ్రీసాయిబాబా చిత్రపటాన్ని ఉంచి సాయిపథం నిర్మాణానికి పునాదిరాయి వేసారు. 1995లో శ్రీబాబూజీ అభీష్టానుసారం అమ్మగారు రోజుకు రెండుసార్లు, ఆ ప్రదేశంలో దీపారాధన చేయడం ఆరంభించారు. 2007 విజయదశమి పర్వదినాన సత్సంగహాలులో శ్రీబాబూజీ అఖండజ్యోతి ప్రజ్వలన చేసేంతవరకు నిరంతరంగా పన్నెండు సంవత్సరాలు అదే ప్రదేశంలో దీపారాధన జరిగింది. సరిగ్గా ఆ స్థలాన్ని శ్రీబాబూజీ తమ అంతిమ విశ్రాంతి ప్రదేశంగా సూచించడం ఆ మహితాత్ముని త్రికాలజ్ఞతకు నిదర్శనంగా భక్తులు భావించారు.

సాయిపథం ప్రాంగణంలోని ఆ స్థలంలోనే నవంబర్ 15 సోమవారం ఉదయం శ్రీసాయిబాబా చిత్రపటాన్ని ఉంచి పూజించారు. సత్సంగహాలులో సాయినామాన్ని ఆర్తిగా ఆలపిస్తుండగా, శ్రీబాబూజీ మహాసమాధి పవిత్రకార్యానికి ఏర్పాట్లు మొదలుపెట్టారు. మహాసమాధి స్థలంలో మట్టిని త్రవ్వడం ప్రారంభించారు. శ్రీబాబూజీకి అంతిమంగా చేసుకునే అవకాశం వున్న ఏకైకసేవగా భావించి, అంతకుముందు పలుగు, పారలు పట్టని వారు సైతం ఆ సేవలో పాల్గొన్నారు. చిన్న, పెద్ద, ధనిక, పేద తారతమ్యాలు లేకుండా, అందరూ సేవచేసుకునేందుకు వీలుగా ఒకరికొకరు సహకరించుకున్నారు. సుదూరప్రాంతాల నుండి వచ్చినవారు వచ్చినట్లు అంతిమసేవలో పాల్గొన్నారు. ఆ సేవలో పాల్గొంటున్నపుడు మనస్సు లోతుల్లో పేరుకుపోయిన మలిన ఆలోచనల మట్టిని తీసి, శ్రీబాబూజీ నివాసానికి అనుగుణంగా తమ హృదయాలు తీర్చిదిద్దుకుంటున్నామన్న దివ్యానుభూతికి భక్తులు లోనయ్యారు. సుమారు 6×6×6 అడుగుల విస్తీర్ణంలో సమాధికోసం అర్థరాత్రి వరకు ఆ ప్రదేశాన్ని త్రవ్వారు. కొందరు భక్తులు సిమెంట్, గులక, ఇసుకతో డ్రైమిక్స్‌ను కలిపారు. మరికొందరు సాయినామస్మరణ చేస్తూ సాయియానా ప్రాంగణం బయట నుండి సమాధి నిర్మాణ ప్రదేశం వరకు రెండు వరుసల్లో నిలుచుని, తమ ప్రేమనంతా దోసిలిగా పట్టి నిర్మాణానికి అవసరమైన ఇటుకలు, డ్రైమిక్స్, సిమెంట్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను అందించారు. ఇంకొందరు డ్రైమిక్స్‌తో సమాధి అడుగుభాగంలో ఒకటిన్నర అడుగులు ఎత్తువరకు కప్పి చదునుచేసారు. సమాధి అడుగుభాగం నుండి పైవరకు 'సత్' అని ముద్ర వున్న ఇటుకరాళ్ళను పేర్చారు. సాయి పాదధూళిగా భావించే సాయిబాబా ఊదీని, సిమెంట్‌తో కలిపి తమ ప్రేమే పునాదిగా సమాధి నిర్మాణం కట్టారు. చెట్ల వేర్ల వల్ల ఆ సమాధి కట్టడానికి భవిష్యత్తులో ఇబ్బందులు కలుగరాదని భావించి, సమాధి లోపల చుట్టూ గ్రానైట్ రాయిని పరిచారు. మొదట శ్రీబాబూజీ పవిత్రదేహాన్ని ఉంచే ప్రదేశాన్ని 2×6×2 అడుగుల విస్తీర్ణంలో గ్రానైట్‌తో నిర్మించారు. ఆ తరువాత శ్రీబాబూజీ దేహాన్ని ఉంచే ప్రదేశం శిరిడీ నేల తాకాలని భావించి ఆ ప్రదేశంలో అంతకుముందు పరచిన గ్రానైట్‌ని క్రిందభాగం మాత్రం పగులగొట్టి శిరిడీ నేల తాకేంతవరకు త్రవ్వారు. సమాధి ప్రాంగణాన్ని కప్పుతూ షెడ్ ఏర్పాటుచేసారు. నవంబరు 15 సోమవారం ఉదయం నుండి మొదలైన సమాధి నిర్మాణ కార్యక్రమం మంగళవారం వరకు కొనసాగింది. తమ జీవితమంతా సాయిసేవలో గడిపి, సాయిభక్తుల శ్రేయోభివృద్ధికై అవిశ్రాంతంగా పరితపించిన ఆ మహాత్ముని తన పొత్తిళ్ళలో చేర్చుకుని విశ్రాంతి కల్పించే భాగ్యం కలిగినందుకు పుడమితల్లి పులకించి వుంటుంది.

శ్రీబాబూజీ పార్థివదేహం జర్మనీ నుండి ముంబాయికి సోమవారం అర్థరాత్రి (తెల్లవారితే మంగళవారం) ఒంటిగంట రెండుగంటల మధ్య చేరుకుంది. నవంబరు 16 మంగళవారం మధ్యాహ్నానికి శ్రీబాబూజీని శిరిడీకి తీసుకువస్తారని తెలిసి, భక్తుల సందర్శనార్థం ఉంచడానికి వీలుగా సత్సంగహాలులో తగిన ఏర్పాట్లు చేసారు. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో భక్తులు రెండు వరుసల్లో నిలబడి, సాయినామం ఆలపిస్తూ, శ్రీసాయి నడచిన బాటలో ఊరేగింపుగా శ్రీబాబూజీని

ఆహ్వానించేందుకు శిరిడీ – కోపర్‌గాం దారిలో శిరిడీ పొలిమేరల వరకు వెళ్ళారు. శ్రీబాబూజీ పవిత్రకాయాన్ని తీసుకొని వచ్చే వాహనాన్ని అలంకరించేందుకు పూలు తీసుకుని మరికొందరు భక్తులు కోపర్‌గాం – నాసిక్ రహదారికి ముందే చేరుకున్నారు. శిరిడీ పొలిమేర వద్ద పోలీస్‌స్టేషన్ కూడలి దగ్గరవున్న ఖాళీ ప్రాంగణంలో అందరూ కలసి 'సాయిబాబా, సాయిబాబా' అని ఎలుగెత్తి పిలుస్తూ, తమలోని వేదనను సాయినామంగా ఆలపిస్తూ, శ్రీబాబూజీ రాకకోసం వేయికళ్ళతో ఎదురుచూడసాగారు. శ్రీబాబూజీ వచ్చే ముందుగా అదే సమయంలో సాయిభక్తుల పాదయాత్రాబృందాలు అనేకం ఒకదాని వెంట మరొకటి అదే మార్గంలో వచ్చాయి. సాయిని పల్లకీలో ఊరేగిస్తూ, బ్యాండ్ మేళాలు వాయిస్తూ, భిన్న వస్త్రధారణతో నృత్యం చేస్తూ భక్తబృందాలు వస్తుంటే ఎంతో మనోహరంగా వుంది. అది చూసినవారికి, శ్రీబాబూజీని ఎంత శోభాయమానంగా బాబా తమ సన్నిధికి ఆహ్వానిస్తున్నారా! అనిపించింది. మధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో శ్రీబాబూజీ పార్థివదేహం శిరిడీ పొలిమేర చేరగానే భక్తుల హృదయరోదన మిన్నునంటింది. పెద్దగా ఒక్కపెట్టున భక్తులు విలపించారు. ఆ గద్గదస్వరాలతోనే శక్తినంతా కూడగట్టుకుని 'సాయినాథ్ మహరాజ్‌కీ జై, సద్గురు సాయినాథుని శరత్‌బాబూజీకి జై' అని నినదించారు. అసంఖ్యాక భక్తులతో శిరిడీ పురవీధులు భక్తజనసంద్రమయ్యాయి. ఆ భక్తజనసంద్రం మధ్య శ్రీబాబూజీ పవిత్ర భౌతికకాయం వున్న అంబులెన్స్ వాహనం ఓ పుష్పకవిమానంలా అనిపించింది. కనుచూపు మేర ఎక్కడ చూసినా భక్తజనం. అడుగుతీసి అడుగు వేయడానికి వీలులేనంతగా భక్తులతో ఆ వాహనానికి ఇరువైపులా దారంతా క్రిక్కిరిసిపోయింది. శ్రీబాబూజీని దర్శించుకోవాలని వాహనం కిటికీల గుండా చూసేందుకు భక్తులు ప్రయత్నిస్తున్నారు. కనీసం వాహనమైనా తాకి నమస్కరించుకోవాలని విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. పూలతో, పూలమాలలతో ఆ వాహనాన్ని ముంచెత్తుతున్నారు. శ్రీబాబూజీ వెంట శిరిడీ రహదారుల్లో భక్తులందరూ కలసి పయనించే మొదటి, చివరియాత్ర అది. ఆ అంతిమయాత్ర బాబా మందిరం ప్రధానద్వారం (ఒకటో నెంబర్ గేట్), గురుస్థాన్ వద్ద నున్న మరో ద్వారం మీదుగా కదిలి సమాధిమందిరం దగ్గరకు చేరింది. బాబా సమాధికి కుడివైపున వున్న ఐరన్ మెష్ దగ్గర శ్రీబాబూజీ వున్న వాహనాన్ని కొన్ని క్షణాలు నిలిపారు. బాబా తనలో కలుపుకున్న ముద్దుబిడ్డను ప్రేమలోగిలికి తీసుకున్నట్లనిపించింది. నెమ్మదిగా ఆ వాహనం మరలా మసీదుమాయి (ద్వారకామాయి) దగ్గర ఆగింది. మసీదుమాయి తన బిడ్డను అక్కున చేర్చుకున్నట్లు అనిపించింది. బాబా–బాబూజీల సమాగమానికి ఆ అంతిమయాత్రే వేదికయింది. ద్వారకామాయి బాబా దగ్గర సెలవు తీసుకుని ముందుకు సాగిన ఆ యాత్ర చావడి, హనుమాన్ మందిరం, ముఖదర్శనం గేట్ మీదుగా పింపుల్‌వాడి రోడ్‌కు చేరుకుంది. శిరిడీ పురజనులు, శిరిడీకి వచ్చిన భక్తులు సైతం ఆ మహాత్ముని చూడాలని ఆతురతపడ్డారు. వారు బాబా కోసమని తెచ్చుకున్న గులాబీపూలను ఆ వాహనం పైకి విసిరారు. శిరిడీ పురవాసులు శ్రీబాబూజీ పట్ల వారికున్న ప్రేమకు కదిలిపోయారు. సాయి నడిచిన మార్గం 'సాయిపథాన్ని' చూపి, భక్తులను ఆ పవిత్రమార్గంలో పయనింపచేయాలని పరితపించిన ఆ మహితాత్ముని వెంటసాగిన ఆ అంతిమయాత్ర సాయిపథం ప్రాంగణానికి చేరుకుంది.

వాహనాన్ని సత్సంగహాలు ప్రక్కనే ఆపారు. ఆ వాహనం నుండి శ్రీబాబూజీ పవిత్రదేహం వున్న పేటికను తీసి, అప్పటికే వేసిన బల్లలపై జరుపుకుంటూ సత్సంగహాలు మధ్య శ్రీబాబూజీ తలభాగం సమాధిమందిరం వైపు వుండే విధంగా ఉంచారు. అప్పటివరకు పేటిక వాహనం లోపలే వుండడంవల్ల శ్రీబాబూజీ పార్థివదేహాన్ని అందరూ దర్శించుకునే అవకాశం సత్సంగహాలులోనే కలిగింది. 'సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీకీ జై' అని ఆ ప్రాంతమంతా మార్మోగింది. శ్రీబాబూజీని దర్శించుకోకుండా ఇక ఒక్క క్షణం కూడా వేచి ఉండలేమని భక్తులకు అనిపించింది. సత్సంగహాలు ప్రాంగణం క్రిక్కిరిసింది. క్లోజ్డ్ సర్క్యూట్ టివిలు అమర్చడంతో వాటి ముందు పెద్ద సంఖ్యలో భక్తులు గుమిగూడారు. పేటికలో వున్న శ్రీబాబూజీని అలా దర్శించుకోగానే దుఃఖం పొంగిపొర్లింది. దివ్యతేజస్సుతో నిండిన శ్రీబాబూజీ వదనాన్ని దర్శించాలని కన్నీటితో నిండుతున్న కళ్ళను పదేపదే తుడుచుకుంటూ భక్తులు చూస్తున్నారు. శ్రీబాబూజీ తల కొంచెం ప్రక్కకు వాల్చినట్లుగా వుంది. తల ప్రక్కన శ్రీసాయిబాబా ఫోటో వుంది. శ్రీబాబూజీ దీర్ఘనిద్రలో ఉన్నట్లనిపించింది. ప్రశాంతంగా వున్న శ్రీబాబూజీ వదనాన్ని చూస్తుంటే ముగ్ధమైన సౌందర్యాన్ని, సమ్మోహనరూపాన్ని చూస్తున్న అనుభూతి కలిగింది. శ్రీబాబూజీ విదేహులై అప్పటికే మూడురోజులు కావస్తున్నప్పటికి

శరీరధర్మాన్ని అనుసరించి జరిగే మార్పులేవీ ఆ పవిత్రకాయంలో కనపడలేదు. మశీదుమాయి (ద్వారకామాయి) నుండి పూలమాలను బాబా ప్రసాదంగా శ్రీబాబూజీ భౌతికకాయానికి అలంకరించడానికి పంపారు. పూలమాలను వేసి శ్రీబాబూజీ కుమార్తె నమస్కరించుకున్నారు. శ్రీబాబూజీ తల్లిదండ్రులు శ్రీసురేంద్రబాబు, వెంకటరత్నమ్మ పుణ్యదంపతులు, రక్తసంబంధీకులు శ్రీబాబూజీని దర్శించుకుంటుంటే అది చూసి భక్తులకు దుఃఖమాగలేదు. శ్రీబాబూజీని దగ్గరగా దర్శించుకోవడానికి భక్తులు సత్సంగహాలు నుండి గురుచరణ్ వరకు బారులు తీరారు. ఒకవైపు భక్తులు ప్రేమతో పూలు, పూమాలలు తెచ్చి, ఆ మహాత్ముని ఉంచిన పేటికను అలంకరించుకుంటున్నారు. మరోవైపు శ్రీబాబూజీని స్పష్టంగా దర్శించుకోవడానికి వీలుగా ఆ పూలమాలలను తీసి, పేటికపై గ్లాసును తుడుస్తున్నారు. భక్తప్రభంజనం ఎంతగా వుందంటే ఒక్కొక్కరికి శ్రీబాబూజీని దర్శించుకోవడానికి 4 నుండి 5 గంటలకు పైగా సమయం పట్టింది. శ్రీబాబూజీ ప్రసాదించిన అనుభవాలను, మిగిల్చిన జ్ఞాపకాలను తలచుకొని, తలచుకొని భక్తులు విలపించారు. ఆ మహాత్ముని, ఆ దివ్యసన్నిధిని సరిగా వినియోగించుకోలేకపోయామని చాలామంది భక్తులు చింతించారు. ఆ మహాత్ముడు చెప్పిన విధంగా తాము సరిగా నడచుకోనందుకు, ప్రవర్తన మారనందుకు బాధపడ్డారు. ఎన్నో దివ్య అనుభవాలను ప్రసాదించి, వెతలు, వేదనలను తీర్చిన ఆ రూపాన్ని ఇక దర్శించుకోలేమని దుఃఖిస్తూ, చివరిసారి దగ్గరగా శ్రీబాబూజీని మరలా మరలా చూసుకుంటూ, వదలలేక వదలలేక వెళుతున్నారు. జీవిత చరమాంకం వరకు తోడుగా మీరే ఉండాలి. జన్మజన్మలకు మీరే మా సద్గురువై నడిపించాలని ప్రార్థిస్తూ శ్రీబాబూజీని వేడుకుంటున్నారు. అంతరంగం నుండి పొంగిన ప్రేమ, మరోవైపు వేదన కంటి సరిహద్దు దాటి కన్నీరై ఉప్పొంగుతున్నాయి. కన్నీటితెరల మాటున గతకాలపు స్మృతులు గుర్తుకువచ్చి మనస్సులు మూగబోయాయి. ఆ మహితాత్ముని సన్నిధిలో భక్తుల అంతరంగ దృశ్యం వర్ణనాతీతంగా వుంది. శిరిడీలోనే వుండి సాధన చేసుకునే సంత్‌లు, శిరిడీ పురప్రముఖులు, సంస్థాన్ వారు ఇలా చాలామంది స్థానికులు శ్రీబాబూజీని దర్శించుకుని నివాళులర్పించారు. అర్ధరాత్రి మూడుగంటలు దాటినా క్యూ ఏమాత్రం తగ్గలేదు. రాత్రంతా భక్తులు సాయినామస్మరణ చేసుకుంటూ శ్రీబాబూజీ పవిత్రసన్నిధిలో గడిపారు. ఆ రోజు అర్ధరాత్రి నుండి తెల్లవారుఝాము వరకు చంద్రునిలో కొందరు శిరిడీవాసులకు ద్వారకామాయిలో వున్న బాబా చిత్రపటంలో మాదిరిగా ద్వారకామాయి బాబా కనిపించారు. అది చూసి శిరిడీ స్థానికులు శ్రీబాబూజీ గొప్ప మహాత్ములని, శ్రీబాబూజీ మహాసమాధి దగ్గర మరెన్నో అనుభవాలు కలుగుతాయని అనుకున్నారు.

నవంబరు 17 బుధవారం ఉదయమైనా భక్తసందోహం తగ్గకపోవడంతో రెండు లైన్లలో శ్రీబాబూజీని దర్శించుకునే ఏర్పాటుచేసారు. బుధవారం ఉదయం 10.30గంటల వరకు భక్తులు దర్శించుకుంటూనే వున్నారు. చివరలో శ్రీబాబూజీ తల్లిదండ్రులు, బంధువులు ఆ భౌతికకాయానికి ప్రదక్షిణ చేసి నమస్కరించుకున్నారు. 11గంటల నుండి సమాధి వద్ద ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. శ్రీబాబూజీ నిలువెత్తు చిత్రపటాన్ని సమాధి వెనుక పూలతో అందంగా అలంకరించారు. ఎవరు చేయగలిగిన పనిలో వారు నిమగ్నమయ్యారు. 12గంటల ప్రాంతంలో శ్రీబాబూజీ కుమార్తె సాయినాథుని శృతి సమాధి ప్రాంగణానికి వచ్చారు. సమాధి ఎడమవైపున ఏర్పాటు చేసిన మెట్లద్వారా లోపలికి దిగి సమాధికి ముందు అవసరమైన వాటిని సమకూర్చడం ప్రారంభించారు. శ్రీబాబూజీ సేవకురాలు శ్రీమతి ఇవాన్ వయార్ సాయినాథుని శృతికి సహకరించారు. మొదట ఊదీ, కర్పూరం, ఉప్పు కలిపిన మిశ్రమాన్ని పవిత్రదేహాన్ని ఉంచే ప్రదేశపు అడుగుభాగాన పరిచారు. దానిపై గురుస్థాన్ దగ్గరవున్న వేపచెట్టు నుండి రాలిపడిన సమిధలను అన్ని ప్రక్కలా వుంచారు. గంధపు చెక్కలను రెండుప్రక్కలా పెట్టారు. శ్రీబాబూజీ దేహాన్ని ఉంచినపుడు క్రింద మెత్తగా వుండడానికి దూదితో అక్కడంతా కప్పారు. అనంతరం సాయిబాబా సంస్థాన్ వారు శ్రీబాబూజీకి బాబా ప్రసాదంగా ఇచ్చిన శాలువాను పరిచారు. దాని మీద ధవళవస్త్రాన్ని కప్పారు. తలవైపు శ్రీసాయిబాబా చిత్రపటాన్ని ఉంచారు. సాయిబాబా పాదాల దగ్గర తలగడ వుంచారు. శ్రీసాయిబాబా సశరీరులై ఉన్నపుడు సన్నిహిత భక్తులకు స్వయంగా ఇచ్చిన ఊదీకి, ధుని నుండి వచ్చిన ఊదీతో కలిపి పంచగా, ఆ ఊదీని శ్రీబాబూజీకి బాబా ప్రసాదంగా సమర్పించారు. అలా బాబా స్వయంగా ఇచ్చిన ఊదీని సమాధిలో ఉంచారు.

12.30 గంటలకు శ్రీబాబూజీ సతీమణి శ్రీమతి అనసూయమ్మగారు(అమ్మగారు) శ్రీబాబూజీని దర్శించుకున్నారు. అంతటి వేదనలోను కన్నీళ్ళను దిగమింగి, శక్తిని కూడదీసుకుని ఆ తల్లీతనయలు శ్రీబాబూజీ మహాసమాధికి అవసరమైన ఏర్పాట్లను చూసుకున్నారు. అనంతరం భక్తుల సాయినామాలాపన మిన్నునంటగా శ్రీబాబూజీ దేహాన్ని పేటికపై నుండి తీసి ప్రక్కనే ఏర్పాటు చేసిన బల్లపై వుంచారు. ఊదీ, పన్నీరు కలిపిన నీరు భక్తులు అందించగా ఆ పార్థివదేహానికి అమ్మగారు, శృతిపాప మంగళస్నానం చేయించారు. మెత్తటి తువాలుతో శ్రీబాబూజీ దేహాన్ని, తలను అమ్మగారు తుడిచారు. ఆపై శాలువా, మెత్తని వస్త్రం కప్పారు. భక్తులు గద్గదస్వరంతో సాయిబాబా నామాన్ని ఆలపిస్తూ జయజయధ్వానాలు చేస్తూవుండగా, శ్రీబాబూజీ దేహాన్ని అక్కడున్న భక్తులు సమాధిలో ఉంచారు. శ్రీబాబూజీకి తమ సాధనాప్రస్థానంలో పూండీస్వామి తదితర మహాత్ములు ప్రసాదించిన వస్తువులను, జపమాలను అమ్మగారు అందిస్తుండగా, శృతిపాప వాటిని శ్రీబాబూజీ దేహానికి ఓ ప్రక్కగా ఉంచారు. కేదారనాథ్ వద్ద ఒక పూజారి, దైవానికి నివేదించిన బ్రహ్మకమలాన్ని శ్రీబాబూజీకి భక్తితో సమర్పించారు. ఆ పుష్పాన్ని శ్రీబాబూజీ హృదయంపై శృతిపాప ఉంచి నమస్కరించుకున్నారు. కడసారిగా అందరూ శ్రీబాబూజీని దర్శించుకున్నారు. అమ్మగారు, శృతిపాప శ్రీబాబూజీకి నమస్కరించుకుని ధవళవస్త్రాన్ని శ్రీబాబూజీ తలవరకు నిండుగా కప్పారు. ఊదీ కలిపిన మిశ్రమాన్ని విడిచి నమస్కరించుకున్నారు. భక్తుల మనోవేదనలను బాపిన రూపం, జీవితాల్లో ఆనందాన్ని నింపిన రూపం, సాయిమార్గాన్ని చూపిన రూపం, సాయి నిజతత్త్వాన్ని దర్శింపచేసిన రూపం, వ్యథార్తులకు కొండంత అండగా నిలిచిన రూపం, సాయి అనుగ్రహానికి ప్రత్యక్ష సాక్ష్యమై నిలిచిన రూపం, సాయి ప్రేమకు నిలువెత్తు నిదర్శనమై నిలిచిన రూపం... ఇక కనుమరుగైపోయింది. ఆనందసాయిలో లయమై, ప్రేమించే ప్రతి భక్తుని హృదయంలో నిలిచిపోయింది.

మొదట శ్రీబాబూజీ మహాసమాధి కార్యక్రమాన్ని నవంబరు 16, మంగళవారం సాయంత్రమే చేయాలని నిర్ణయించినా, భక్తుల రద్దీవల్ల అందరూ దర్శించుకోవాలనే ఉద్దేశ్యంతో నవంబరు 17, బుధవారం వరకు వేచి వుండవలసి వచ్చింది. కాకతాళీయంగా శ్రీబాబూజీ పవిత్రదేహాన్ని శిరిడీలో సమాధి చేసిన రోజు కార్తీకమాసం ఏకాదశి పర్వదినం, అదే రోజు ముస్లింలకు పవిత్రమైన బక్రీద్ కావడం విశేషం. ఇంకో ఆసక్తిగొలిపే విశేషమేమంటే- శ్రీబాబూజీ మహాసమాధి చెందిన రోజు (నవంబర్ 13, 2010) మాస్టర్ ఎక్కిరాల భరద్వాజగారి జన్మదినం (తిథుల ప్రకారం) కావడం. అంతేగాకుండా ఆ రోజు 'కోటిసోమవార' పర్వదినం. (కార్తీకమాసంలో కార్తీకపౌర్ణమి ముందు వచ్చే శ్రవణ నక్షత్రం రోజును పవిత్రమైన 'కోటి సోమవారం'గా పరిగణిస్తారు. కోటి కార్తీక సోమవారాల్లో పూజ చేస్తే వచ్చే ఫలితం ఆ ఒక్క 'కోటిసోమవారం'నాడు పూజ చేస్తే వస్తుందని పురాణాల్లో చెప్పబడి ఉంది. ఈసారి - శైవులకు అత్యంత పవిత్రమైన 'కోటిసోమవారం' వైష్ణవులకు ముఖ్యమైన శనివారంనాడు రావడంతో ఆ రోజు ప్రాముఖ్యత ఇనుమడించింది. ఇలా చాలా అరుదుగా మాత్రమే సంభవిస్తుంది)

సూర్యాస్తమయం అయింది. ఆ సాయంసంధ్య వేళ సాయంత్రం 6.30 గంటలకు అమ్మగారు శ్రీబాబూజీ మహాసమాధికి ప్రప్రథమంగా హారతినిచ్చారు. అమ్మగారు తమ పంచప్రాణాలను జ్యోతులుగా చేసి, శ్రీబాబూజీకి మంగళనీరాజనాలర్పించారు. ఆ మహాసమాధి దేదీప్యమానంగా దివ్యమైన శోభతో ప్రకాశిస్తోంది. ఆ సన్నిధిలో మానసిక ప్రశాంతత అప్రయత్నంగా అనుభవమవుతోంది. మహాసమాధి చెంత నిత్యప్రార్థన, సాయినామ ఆలాపన, అనంతరం సత్సంగం జరిగాయి. తల్లడిల్లిన ప్రకృతి భోరున విలపిస్తుందా అన్నట్లు ఆ రోజు రాత్రి విపరీతంగా వర్షం కురిసింది.

మరుసటిరోజు నవంబరు 18 గురువారం. శ్రీబాబూజీ సశరీరులుగా కనిపించని మొదటిరోజు. భానుని నునులేత కిరణాలు సాయి సమాధి మందిరాన్ని తాకి, సాయిని దర్శించుకుని, శ్రీబాబూజీ సమాధిపై పరావర్తనం చెందుతున్నట్లు ఆ సమాధి శోభాయమానంగా వెలిగిపోతోంది. ఉదయం 8.30గంటలకు అమ్మగారు శ్రీబాబూజీ మహాసమాధికి హారతినిచ్చారు. ఆ రోజు కొందరు భక్తులు శ్రీబాబూజీ సమాధి మందిర నిర్మాణం గురించి చర్చించుకుని, ప్రస్తుతానికి సమాధిని కొంచెం ఎత్తువరకు పెంచాలని భావించి, అదే రోజు రాత్రి దానికి తగిన ఏర్పాట్లు చేసారు. భక్తులందరూ సాయినామాన్ని ఆలపిస్తూ, సమాధి

నిర్మాణ సేవలో పాల్గొన్నారు. ఆ సేవ చేసుకుంటున్నంతసేపు భక్తులకు శ్రీబాబూజీ సశరీరులుగా లేరన్న భావన మరుపులోకి నెట్టబడి, ఓ దివ్య అనుభూతికి లోనయ్యారు.

మహాత్ములు దేహాతీతులు. వారు దేహాన్ని త్యజించిన అనంతరం వారి మహిమ ఇంకా విస్తృతంగా ప్రకటమవుతుంది. ఎందుకంటే దేహానికి పరిమితులుంటాయి. ఆ పరిమితులు దాటితే వారు అపరిమితులు. అనంతులు. వారు చూపిన సన్మార్గంలో పయనించే ప్రతి ఒక్కరికి వారి దివ్యసన్నిధి అనుభవమవుతూనే వుంటుంది. అందుకు రమణీయమైన శోభతో అలరారుతున్న శ్రీబాబూజీ మహాసమాధిని దర్శించుకుంటున్న భక్తులు పొందిన, పొందుతున్న అనుభవాలే నిదర్శనం. పూజ్య గురుదేవులు శ్రీబాబూజీ అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికీ మనతోనే వున్నారు, ఉంటారన్నది భక్తుల అనుభవం.

*ఓ సద్గురూ! మీ ఎడబాటును భరించలేక జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్న మాకు*
*మీ ప్రత్యక్ష సాన్నిధ్యాన్ని ప్రతిక్షణం ప్రసాదించు.*
*మీ ప్రేమను నిత్యం మాపై కురిపించు. మీ కరుణాదృక్కులను నిరంతరం ప్రసరించు.*
*మీ సన్నిధానాన్ని అందరికీ అనుక్షణం అనుగ్రహించు.*

శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!!
సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీకీ జై!!



శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!!
సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీకీ జై!!

## గురుదేవా!

అనంతశూన్యాన్ని మాకొదిలి
అత్యున్నత శిఖరాలవైపు మీరు సాగిపోయారు
మీ స్మృతులవనంలో బాటసారులమై
మీ అనుగ్రహ వికసిత అనుభవ సుమాల జ్ఞానసౌరభాల వెంట
పదం పదం కలుపుతూ సాయినామం పలుకుతూ పయనిస్తున్నాం
మీ అడుగుల చప్పుడు మా వీనులను చేరుతూనే ఉంది
మీ ఉచ్ఛ్వాసనిశ్వాసాల పరిమళం మమ్మల్ని స్పృశిస్తూనే ఉంది
మీ మృదుమధుర స్వర గాంభీర్యం
మా హృదయసీమల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది
కనుచూపుమేర వరకు మీ పదముద్రలు పథంగా మారి
మీ దరికి దారిచూపుతూనే వున్నాయి
అడుగడుగునా మా అనుభవాలు
మీరు మా ప్రక్కనే ఉన్నారన్న అభయాన్నిస్తూనే ఉన్నాయి
తన చుట్టూ తాను తిరిగే భూమి పరిమితత్వం
సూర్యాస్తమయమైందని భ్రమింపజేసినట్టు
అంతటా మిమ్మల్ని దర్శించలేని మా అల్పత్వం
మీరు లేరని నమ్మించాలని చూస్తోంది
అఖండ తేజోవిరాజమానమైన సద్గురుభాస్కరునికి
అస్తమయమంటూ ఉంటుందా?
సకలాన్ని ప్రకాశింపజేసే సుజ్ఞానకాంతులను కప్పివేయడం
కాలమేఘాలకు సాధ్యమవుతుందా?

మీ అనుగ్రహం వర్షిస్తూనే ఉంది!
మీ తేజోకృపాకిరణాలు ప్రసరిస్తూనే ఉన్నాయి!
మా జీవితాలే మీ స్మృతిసుమాలుగా విరిసి
సాయినాథుని పదార్చనలో పునీతమవుతున్నాయి!



## అనుభవాల సేకరణకు వెల్లువెత్తిన అనుగ్రహం

నంబూరి శేఖర్, హైదరాబాద్.

గురువుగారు భౌతికంగా ఉన్నప్పుడు వారి కరుణాకటాక్షం వల్ల నేను పొందిన రక్షణ, ఆ అనుభూతి అనూహ్యం. సమాధి అనంతరం కూడా నాకు గురువుగారి రక్షణ అనుభవమవుతూనే ఉన్నది.

శిరిడీలో నేను, మా అక్క ఝాన్సీ బాబా మందిరానికి బయలుదేరాము. అప్పుడు అక్క నాతో– కొంతమందికి గురువుగారితో చాలా మంచి అనుభవాలు వస్తున్న విషయం శృతిపాప తనతో అన్నారని చెప్పింది. అలాగైతే మనం అందరి దగ్గర నుండి అనుభవాలు సేకరిద్దామన్నాను. అప్పుడే అటు వస్తున్న మా బావగారు శివరామ్‌తో ఆ విషయాన్ని ప్రస్తావిస్తే, 'ఇప్పుడే అమ్మగారితో గురువుగారు ప్రసాదించిన అనుభవాల సేకరణ గురించి మాట్లాడి వస్తున్నా'నని చెప్పారు. ఇలా అందరిలో – అనుభవాలు సేకరించాలన్న ప్రేరణ ఒకేసారి కలగడంతో అది బాబా, గురువుగారి సంకల్పంగా భావించాము. అందరం కలసి అనుభవాలను సేకరిద్దామని నిర్ణయించుకొన్నాము. నాకు గురువుగారికి సంబంధించి ఏదైనా చేయాలనే తపన బాగా ఉంది. అందుకని వెంటనే బాబా మందిరానికి వెళ్ళి ఆశీస్సులు తీసుకొని మొదలుపెడదామని– నేను, ఝాన్సీ అక్క బుక్స్, పేపర్లు, ఫోటోలు తీసుకొని వెళ్ళాము. మందిరంలో బాబా సమాధికి నమస్కారం చేసుకోగానే అక్కడున్న పూజారి బాబా సమాధిపై ఉన్న పువ్వు తీసి ఇచ్చారు. నాకు బాబా ఆశీస్సులు ఇచ్చారనిపించింది. తర్వాత ద్వారకామాయి దగ్గరకు వెళ్ళాము. అక్కడ చాలా పెద్ద 'క్యూ' ఉంది. నేను అడగకుండానే సెక్యూరిటీ గార్డ్ గేట్ తీసి ద్వారకామాయి లోనికి పంపించాడు. మేము లోపలికి వెళ్ళిన తర్వాత వేరే సెక్యూరిటీ గార్డ్ మమ్మల్ని ఆపివేశాడు. మేము అక్కడే నిలుచొని ఉంటే, వెంటనే మరో సెక్యూరిటీ గార్డ్ వచ్చి ఆ ఆపిన సెక్యూరిటీ గార్డ్‌ని కోప్పడి, నా చేతుల్లో ఉన్న బుక్స్, పేపర్లు, ఫోటోలు తీసుకొని, ద్వారకామాయి లోపల బాబా దగ్గర పెట్టి, కొబ్బరికాయ, గులాబీ పూలగుత్తి తెచ్చి వాటితోపాటు నాకు ఇచ్చాడు. అవి తీసుకొన్న నా ఆనందానికి అవధులు లేవు. గురువుగారు ప్రసాదించిన అనుభవాలు సేకరిద్దామనుకొన్న ఆలోచనకి బాబా అలా ఆశీస్సులు ఇచ్చారని అనిపించింది.

1995 నుండి 1998 వరకు నేనెక్కువగా గురువుగారి దగ్గర ఉండేవాణ్ణి. ఒక సంవత్సరం అయితే పూర్తిగా గురువుగారి సన్నిధిలోనే గడిపాను. ఆ సమయంలో గురువుగారి ఆశీస్సులు తీసుకొని శివ(గుంటూరు), పెద్ద గుప్తాగారు, నేను, ఇంకొంతమంది గురుబంధువులు కలసి అరుదైన బాబా ఫోటోలు, అనుభవాలు సేకరించే నిమిత్తం బాబాను సశరీరంతో దర్శించిన నానాసాహెబ్ చందోర్కర్ (పూనే), కాకాసాహెబ్ దీక్షిత్ (విలేపార్లే), దభోల్కర్ (బొంబాయి), ధూమల్, రాస్నే మొదలైన వారి ఇళ్ళకు వెళ్ళడం జరిగింది. అది ఒక మధురమైన జ్ఞాపకం. ఆ విధంగానే గురువుగారివి కూడా సేకరిద్దామని దృఢంగా నిశ్చయించుకొన్నాను. ఆ సద్గురుకార్యానికి బాబా అనుగ్రహం అంతగా లభించినందుకు చాలా సంతోషంగా ఉంది.



గురువుగారు మహాసమాధి చెందడానికి నాలుగురోజుల ముందు నాకు కలలో "నువ్వు, హరి బొంబాయి రండి" అన్న గురువుగారి మాటలు వినిపించాయి. కాని ఎక్కడకు వెళ్ళాలి, ఎప్పుడు వెళ్ళాలి అనేది నాకు అర్థం కాలేదు. జర్మనీ నుండి గురువుగారి పార్థివదేహం బొంబాయి వచ్చాక గురువుగారు అలా ఎందుకన్నారో అర్థమయింది.

గురువుగారు సమాధి చెందిన తర్వాత నాకొక కల వచ్చింది. ఆ కలలో గురువుగారు సత్సంగం చేస్తున్నారు. ఆ సత్సంగంలో అందరం ఉన్నాము. నేను చక్రాల డిజైన్ ఉన్న షర్ట్ వేసుకొని వున్నాను. సత్సంగం మధ్యలో గురువుగారు నా చొక్కాని చూస్తూ పెద్దగా నవ్వారు. నవ్వుతూనే "ఆ షర్ట్ చూడు అనసూయ. అది కర్టెన్ క్లాత్‌లాగా ఉంది కదూ" అన్నారు. అమ్మగారు, గురువుగారు ఇద్దరూ ఇంకా బాగా నవ్వుకొన్నారు. తరువాత గురువుగారు రూమ్‌లోకి వెళ్ళిపోయారు. నేను బయటకు వచ్చాను. అమ్మగారు బయటకు వచ్చి నాకు పెద్ద కాడ్బరీ మిల్క్ చాక్లెట్ ఇస్తూ 'శేఖర్, ఈ రోజు నీ బర్త్‌డే కదా' అన్నారు. నేను వెక్కివెక్కి ఏడుస్తూ అమ్మగారి పాదాలకు నమస్కారం చేసుకొని, 'అమ్మా, నా బర్త్‌డే అన్న విషయం నాకే గుర్తులేదు' అన్నాను. గురువుగారు, అమ్మగారు నామీద చూపించిన ప్రేమకు ఎంతో ఆనందించాను. నిద్ర నుండి లేచిన తర్వాత, నా పుట్టినరోజు ఇంకా పదిరోజుల్లో ఉందన్న విషయం గుర్తుకు వచ్చింది. ప్రతి పుట్టినరోజుకు నేను గురువుగారి దగ్గరకు వెళ్తుంటాను. ఈసారి గురువుగారు సమాధి చెందినప్పటికీ నాకు దర్శనమివ్వడాన్ని నేను మహద్భాగ్యంగా భావిస్తున్నాను. వారికి మా కుటుంబంపై ఉన్న ప్రేమ ఎనలేనిది.

చివరిసారిగా నేను చెన్నైలో గురువుగారు శిరిడీ నుండి తిరిగి వస్తున్నప్పుడు దర్శనం చేసుకొన్నాను. ఆ రోజు గురువుగారిని 'నాకు ఫారిన్ బిజినెస్‌లో చాలా పెద్ద మొత్తంగా డబ్బు రావలసి ఉంది. త్వరగా వచ్చేట్లు అనుగ్రహించండి' అని అడిగాను. గురువుగారు నేను చెప్పినదంతా విన్నారు. నాకు చాలా ఆనందం వేసింది. నాకు ఆ నిమిషంలో చెన్నై వచ్చి గురువుగారి దగ్గర ఉండిపోవాలనిపించింది. ఆ దర్శనం ఎందుకో నా మనస్సులో నిలిచిపోయింది. అడిగిన వెంటనే గురువుగారు అనుగ్రహిస్తారు అన్నదానికి నిదర్శనంగా రెండు సంవత్సరాలుగా డబ్బు ఇవ్వని ఫారిన్ కంపెనీవాళ్ళు ఫోన్ చేసి 'మీకు ఇవ్వవలసిన డబ్బును వచ్చి తీసుకువెళ్ళండి' అని అన్నారు. అది విన్న వెంటనే గురువుగారు నాతోనే ఎప్పటికీ ఉన్నారన్న అనుభూతి కలిగి ఎంతో ఆనందించాను. ఆనాడు బాబా లీలలు సేకరించడంలోను, ఈనాడు గురువుగారు ప్రసాదించిన అనుభవాలు సేకరించడంలో నేను పాల్గొనడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.

## ఇక దర్శనం ఇలానే ఇస్తారు

భార్గవి, నార్త్‌కరోలినా, యు.ఎస్.ఎ.

గురువుగారు మహాసమాధి అయిన కొన్నిరోజులకు నాకు స్వప్నదర్శనం ప్రసాదించారు. ఆ స్వప్నంలో- ఒకచోట చాలామంది గురుబంధువులు గురువుగారి దర్శనానికి ఎదురుచూస్తున్నారు. అది ఒక హిల్ స్టేషన్‌లా వుంది. చెట్లు, కొండలు, ఒక ప్రక్క క్రొత్త ఇల్లు నిర్మాణం జరుగుతోంది. అంతా బాబా నామం చెబుతూ గురువుగారి కోసం ఎదురుచూస్తుండగా, కారులో నుండి గురుబంధువు ద్వారక్‌గారు గురువుగారి తలవైపు, మరో గురుబంధువు సుబ్బరాజాగారు గురువుగారి కాళ్ళవైపు పట్టుకొని తీసుకుని వస్తున్నారు. నేను అది చూసి, గురువుగారు ఎప్పుడూ నడచి వచ్చి మనకి దర్శనం ఇస్తారు కదా! ఎందుకు ఇలా తీసుకుని వస్తున్నారు? అని గట్టిగా అరుస్తూ ఏడుస్తున్నాను. అప్పుడు ద్వారక్‌గారు 'మనకి గురువుగారు ఇక నుండి ఇలానే దర్శనం ఇస్తారట. కనుక మనం ఇలాగే దర్శనం చేసుకోవాలి' అని అంటూ గురువుగారిని చెట్టుక్రింద పడుకోబెట్టారు.



అంతా వెళ్ళి అక్కడ గురువుగారి పాదాలకు నమస్కారం చేసుకుంటున్నారు. నేను కూడా వెళ్ళి గురువుగారికి పాదనమస్కారం చేసుకుని లేచేసరికి ప్రక్కన నిర్మాణంలో వున్న బిల్డింగ్ పైన గురువుగారు నవ్వుతూ కనిపించారు. అందరం గురువుగారిని చూసి, 'గురువుగారు అక్కడ వున్నారు' అని అంటుండగా, గురువుగారు నిచ్చెనమీద నుంచి స్టెప్స్ దిగి క్రిందకి వచ్చి, గురువుగారిని పడుకోబెట్టి వున్న ప్లేస్ ప్రక్కనుండి నడుస్తూ, బిల్డింగ్ వెనుక వైపుకి వెళ్ళారు. మేము కూడా గురువుగారి వెంట నడుస్తూ వున్నాము. అక్కడ అమ్మగారు, శృతిపాప, ఇంకా కొంతమంది పిల్లలు వున్నారు. పిల్లలు గురువుగారికి ఏదో చెబితే గురువుగారు ఏదో జోక్ చేసి గట్టిగా నవ్వుతున్నారు. నాకు మెలకువ వచ్చేసింది. 'గురువుగారు మనందరిని వదలి ఎక్కడికీ వెళ్ళలేదు. మనతోనే వున్నారు' అని చాలా సంతోషంగా అనిపించింది.

## సాయి స్ఫురణ

డా॥ వై. రాజశేఖర్, కర్నూలు.

మా చిన్నపాప జనవరి 20, 2010న జన్మించింది. మా పాపకు గురువుగారి చేత నామకరణం చేయించుకోవాలనే కోరిక చాలా బలంగా వుంది. కానీ, జనవరి 2010 నుండి 'దర్శనాలు, నామకరణాలు, అన్నప్రాసనలు ఇక మీదట ఉండవు' అని అనౌన్స్ చేసినందువల్ల నాకు ఏంచేయాలో తోచలేదు. మనస్సులో మాత్రం 'సద్గురువు దొరకడమే కష్టం, ఉన్నా గుర్తించడం చాలా కష్టం, అలాంటిది నాకు దొరికారు. అలాంటప్పుడు నేనెందుకు అవకాశాన్ని వదులుకోవాలి' అని అనుకొన్నాను. అమ్మగారు ఒంగోలు వచ్చినప్పుడు కలిసి అమ్మగారిని అడిగాను. అమ్మగారు 'గురువుగారు ఇప్పుడు పేర్లు పెట్టడంలేదు కదయ్యా' అన్నారు. నా పరిస్థితి అయోమయంగా తయారయ్యింది. ఒకప్రక్క ఇంట్లోవాళ్ళు, బంధువులు ఎప్పుడు పేరు పెడతావు అని తొందరపెడుతున్నారు. వాళ్ళ ఒత్తిడికి లొంగి 'త్వరలో పెట్టుకుందాంలే' అని అన్నాను. ఆ రోజు సాయంత్రం సత్సంగానికి వెళ్ళాను. ఎందుకో, నా మనస్సు పేరు పెట్టడానికి ఒప్పుకోక, ద్వారక అంకుల్‌తో ఒకసారి మాట్లాడి చూద్దాం అనిపించి కాల్ చేసాను. 'గురువుగారితో మాట్లాడే అవకాశం వస్తే గురువుగారికి చెప్తాను, నీవు వెయిట్ చేస్తే' అన్నారు. సరే అని మళ్ళీ వాయిదా వేసాను. నెలలు గడిచాయి. అయినా మెసేజ్ ఏమీ రాలేదు. తిరువణ్ణామలైలో గురువుగారి దర్శనం కోసం వెళ్ళినప్పుడు, ఒక సన్నిహిత గురుబంధువు 'వెయిట్ చెయ్యి, గురువుగారు పేరు పెట్టకుండా ఎక్కడికీ వెళ్ళరు. నీకు దృఢమైన నమ్మకం వుంటే ఆయన ఖచ్చితంగా పేరు పెడతారని' అన్నారు. దాంతో ఇంకా వెయిట్ చేద్దామని అనిపించింది. కొన్నాళ్ళు గడిచాయి. అక్టోబర్ 31వ తేదీన చెన్నైలో గురువుగారి దర్శనం చేసుకున్నప్పుడు 'మా చిన్నపాపకు పేరు పెట్టండి గురువుగారూ' అని అడిగాను. గురువుగారు అది విన్నట్లు తల ఊపారు. మళ్ళీ రెండవసారి గురువుగారిని 'పర్సనల్ దర్శనం కావాలి' అని అడగబోయి, ఎందుకో ఆగిపోయి, 'మీ ఆశీస్సులు కావాలి' అని అడిగాను.

నవంబర్ 13న గురువుగారు మహాసమాధి చెందారని తెలిసింది. ఆ తర్వాత నుంచి ఇంట్లోవాళ్ళు, బంధువులు పేరు ఎప్పుడు పెడుతున్నావని అడుగసాగారు. నేను మౌనంగా ఉండిపోయేవాడిని. మా పాపకు జనవరి 20కి ఒక సంవత్సరం నిండుతుంది. ఒక సంవత్సరం నిండితే బర్త్ సర్టిఫికేట్ తీసుకోవడం కష్టమని చెప్పారు. నేను, ఇన్నిరోజులు వెయిట్ చెయ్యడం వృథా అయ్యిందా? గురువుగారితో డైరెక్ట్‌గా కూడా చెప్పుకున్నాను, నేను ఎలాంటి వాడినైనా, ఆయన మాట తప్పేవారు కాదు కదా అని- ఎవరితో ఏం చెప్పుకోలేక ఆలోచిస్తూ ఉండేవాడిని. సత్సంగంలో చాలాసార్లు గురువుగారిని ప్రార్థించాను. గురువుగారు



మహాసమాధి చెందిన కొన్నిరోజుల తరువాత, మా కర్నూలు గురుబంధువుకి గురువుగారి వాయిస్ వినపడిందట. రాజశేఖర్ కూతురుకి 'ఈ పేరు పెట్టమని చెప్పు' అని. కానీ అతను, తరువాత చెబుదామని అనుకునే లోపల అతనికి ఆ పేరు గుర్తులేదు. ఆ విషయం చెప్పినప్పుడు చాలా బాధనిపించింది. దిగులు ఇంకా ఎక్కువైంది. డిసెంబర్ 27, 2010న క్లినిక్ నుండి వెళ్తుండగా, చెన్నై నుండి గురుబంధువు డా॥ బి. రాజశేఖర్‌గారి భార్య శ్యామల నాకు ఫోన్ చేసి, 'అన్నయ్యా, మీ పాపకు గురువుగారు పేరు పెట్టారు' అని చెప్పేసరికి ఆశ్చర్యపోయి, అది ఎలా జరిగింది? అని అడిగాను. తను ఆ రోజు మధ్యాహ్నం అలసటగా నిద్రిస్తున్నప్పుడు కల వచ్చిందట. ఆ కలలో, గురువుగారు పర్సనల్ ఇంటర్వ్యూలు ఇస్తున్నట్లు- నేను, నా ఫ్యామిలీతో వెయిట్ చేస్తున్నట్లు, తరువాత నా వంతు వచ్చినప్పుడు, నేను 'మొదట పాప పేరు గురించి గురువుగారిని అడగాలి' అని అనుకుంటూ లోపలికి వెళ్ళేసరికి గురువుగారు నేను మాట్లాడకముందే *"నా స్ఫురణను ఇటు ఇవ్వు"* అన్నారట. అది నాకు అర్థంకాక 'ఏంటి గురువుగారూ?' అని అడిగానట. *"పేరు పెట్టు, పేరు పెట్టు అని అన్నిసార్లు అడిగావు. పేరుతో పిలుస్తుంటే గుర్తుపట్టలేక పోతున్నావు"* అని, *"సాయి స్ఫురణ- ఈ పాప పేరు"* అని గురువుగారు చెప్తూ, చిన్నపాపను చేతుల్లోకి తీసుకొన్నారట. అంతలో *'స్ఫురణ అంటే ఏంటి గురువుగారు?'* అని అడిగానట. *"పదే పదే బాబాను గుర్తింపచేసేది"* అని గురువుగారు నాతో చెప్పారట.

ఆ కల విషయం విన్నవెంటనే నా సంతోషానికి అంతులేదు. కొన్ని గంటలపాటు, నాకు తెలిసిన గురుబంధువులందరికీ ఫోన్ చేసి ఆ సంతోషాన్ని పంచుకున్నాను. కొంతమంది బంధువులకు, పేరు పెట్టనందుకు 'మీ పాపకు ఊహ తెలిసాక తనే పేరు పెట్టుకుంటుందిలే' అని హాస్యం చేసిన వాళ్ళకు కూడా ఫోన్ చేసి గర్వంగా చెప్పాను. గురువుగారు నా మీద చూపించిన ప్రేమకు ఎంతో కృతజ్ఞుణ్ణి. సమాధి చెందినా కూడా మిమ్మల్ని గమనిస్తూ ఉన్నాను అనడానికి ఇంతకు మించి నిదర్శనం ఏం కావాలి? సమాధి ముందు, సమాధి తరువాత అన్న భేదం నా మనస్సులో సమసిపోయింది.

## సాయి బృందావనం

*నాగలక్ష్మి, సంతనూతలపాడు.*

నేను ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో పని చేస్తున్నాను. గురువుగారు మహాసమాధి చెందారని తెలిసి నవంబర్ 14న మా ఊరు గురుబంధువులతో కలసి శిరిడీకి బయలుదేరాను. రైలుప్రయాణంలో, నేను నిద్రపోతున్నప్పుడు నాకొక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో గురువుగారు ఒక గిన్నెలో తెల్లని పిండిని తీసుకొని మొక్కలకు చల్లుతున్నారు. నేను గురువుగారి దగ్గరకు వెళ్ళి 'అందరూ మీరు సమాధి చెందారని అంటున్నారు! మరి మీరు ఇక్కడే ఉన్నారే! ఏమి చేస్తున్నారు?' అని అడిగాను. *"లేదమ్మా! నేను ఇక్కడే ఉన్నాను"* అని నా చేయి పట్టుకొని ఎక్కడికో తీసుకెళ్ళి చూపిస్తూ *"ఇదిగో ఇది నా సాయి బృందావనం. మీరంతా నా సాయి వారసులు"* అని అన్నారు. నాకు అమితమైన ఆనందం కలిగింది. ఆ స్వప్నదర్శనం నా గురువు నాతోనే ఉన్నారని, నా చేయిపట్టుకొని సాయి చెంతకు చేర్చుతారనే భావనతో నా హృదయాన్ని నింపింది.

నేను ప్రతి రాత్రి గురువుగారి ఫోటోని నా ప్రక్కనే పెట్టుకొని నిద్రపోతాను. గురువుగారి మహాసమాధి అనంతరం, శిరిడీ నుండి వచ్చిన తర్వాత గురువుగారి ఫోటో చూస్తే చాలా అలజడిగా ఉండేది. అందువల్ల ఒకరాత్రి గురువుగారి ఫోటో ప్రక్కన లేకుండానే పడుకొన్నాను. ఆ రాత్రి గురువుగారు నాకు స్వప్నంలో దర్శనమిచ్చారు. ఆ స్వప్నంలో- ఒక ప్రదేశంలో సాయినామం జరుగుతోంది. ఒకవైపు పూలమాలలు కడుతున్నారు. నేను, నా ఫ్రెండ్ ఏదో పనిమీద ఒక రూమ్‌లోకి వెళ్ళాము.



మరొక రూమ్‌లో అమెరికా సత్సంగకేంద్రాలవారు ఉన్నారు. మేము వెళ్ళిన రూమ్‌లో ఎవరూ లేరు. మేమిద్దరం అక్కడ రూమ్‌లో మాట్లాడుకుంటుండగా హఠాత్తుగా గురువుగారు మా దగ్గరకు వచ్చారు. మామూలుగా అయితే ఎవరైనా హఠాత్తుగా కనిపిస్తే భయంగా ఉంటుంది. కాని అలా భయమేమీ లేకుండా చాలా ప్రశాంతంగా గురువుగారికి నమస్కారం చేసుకొన్నాను. తర్వాత గురువుగారిని గట్టిగా పట్టుకొని 'గురువుగారూ, మీరు నన్ను విడిచి ఎక్కడకూ వెళ్ళొద్దు. మీరు నన్ను వదిలేసి వెళితే నేనే మీదగ్గరికి వస్తాను' అన్నాను. మా ఫ్రెండ్ కూడా గురువుగారికి నమస్కారం చేసుకొంది. వెంటనే గురువుగారు అక్కడే ఉన్న ఒక పడక కుర్చీలో కూర్చొన్నారు. మళ్ళీ మేమిద్దరం గురువుగారి పాదాలకు నమస్కారం చేసుకొన్నాము. అప్పుడు గురువుగారు *"నీవు నా దగ్గరకు రావద్దు. అయినా నిన్ను విడిచి ఎక్కడకు వెళతాను? ఎప్పుడూ నీతోనే ఉంటాను"* అన్నారు. నేను గారంగా ఒక తండ్రిని బిడ్డ అడిగిన విధంగా గురువుగారి చేయి పట్టుకొని 'మీరు నన్ను విడిచి వెళ్ళొద్దు. నన్ను విడిచి వెళ్ళొద్దు' అని బ్రతిమాలుతూనే ఉన్నాను. అంతలో ఎవరో రూమ్‌లోకి వచ్చారు. తర్వాత గురువుగారు కనిపించలేదు. ఆ స్వప్నదర్శనం తర్వాత గురువుగారు ఇప్పటికీ, ఎప్పటికీ మనతోనే ఉన్నారన్న విశ్వాసం కలిగింది.

## ధృవతార

ఇవాన్ వయర్, స్విట్జర్లాండ్.

జర్మనీ కాలమానం ప్రకారం గురువుగారు నవంబర్ 13, శనివారం ఉదయం 9.21గం.లకు మహాసమాధి చెందారు. వారు సమాధి చెందిన మరుసటి రోజు ఉదయం 8గంటలకు నేను అశ్రునయనాలతో జర్మనీలోని ముర్నావ్‌లో మేమున్న గెస్ట్‌హౌస్ బాల్కనీలోకి వెళ్ళాను. అప్పుడు పైకి చూడగానే ఆ ఉదయాకాశంలో స్పష్టమైన, ప్రకాశవంతమైన నక్షత్రాన్ని చూసాను. ఆ నక్షత్రం నేను ఇంతకుమునుపెన్నడూ చూడనంత పెద్దగా, కాంతివంతంగా ఉంది. ఆ అసాధారణ దృశ్యాన్ని చూడగానే గురువుగారి సాన్నిధ్యంలో ఉండే ప్రశాంతత నాకు అనుభవమయింది.

## సద్గురు స్మృతిపథంలో జీవిత'యాత్ర'

అద్దంకి శివరాం, చెన్నై.

నేను గురువుగారిని మొదటిసారి 1988లో దర్శించుకొన్నాను. వారి సన్నిధికి చేరిన తరువాత మా కుటుంబమంతా వారి అనుగ్రహాన్ని ఆస్వాదించింది. వారి రక్షణ మహాసమాధి తరువాత కూడా మాకు అనుభవమవుతూనే వుంది. "నాకు, నా చిత్రపటమునకు భేదం లేదు. నా మట్టి మాట్లాడుతుంది. నా సమాధి సమాధానం చెబుతుంది" అని బాబా అభయమిచ్చిన విధంగా – గురువుగారు వారి సమాధి నుండి కూడా మాకు ఎన్నో అనుభవాలను ప్రసాదిస్తున్నారు.

గురువుగారితో అక్టోబర్ 31, 2010 ఉదయం చెన్నై ఎయిర్‌పోర్టు నుండి ఇంటి వరకు వారి కారులో ప్రయాణించే భాగ్యం నాకు లభించింది. ఆ 45ని॥ల ప్రయాణం నా జీవితంలో చిరస్మరణీయం. నేను అడిగినవన్నింటికి వారు ఆశీస్సులు



ఇచ్చారు. నేను 'గురువుగారూ, నా జీవితానికి ఒక అర్థం కావాలి. ఏదైనా సాధించాలి. ఇప్పటికి నాకు 47 సంవత్సరాలు. నేను మీ సన్నిధిలో ఉంటున్నాను. నాకు అర్థవంతమైన జీవితం కావాలి' అని అడిగి వారి ఆశీస్సులు పొందాను. మా అమ్మాయి స్నేహిత ఉద్యోగవిషయం కూడా అడిగాను.

అప్పుడు గురువుగారు– "ఎప్పుడు ఇంజనీరింగ్ పూర్తి అవుతుంది? సర్టిఫికేట్ రాగానే చెప్పు. జాబ్ విషయం నేను చూసుకొంటాను" అన్నారు. బాబా, 'నాదంతా నగదు బేరమే అరువు లేద'న్నారు. గురువుగారు కూడా, నాదంతా నగదు బేరమే వాయిదాలు ఉండవు అన్నదానికి నిదర్శనంగా వారు భౌతికంగా ఉన్నప్పుడు ఇచ్చిన అభయాన్ని సమాధి చెందిన వెంటనే నెరవేర్చి ఇంకా మనతోనే ఉన్నారు అనే నిదర్శనాన్ని చూపారు. గురువుగారి సమాధి అనంతరం మా స్నేహితను ఎస్.వి.సి.ఇ కాలేజీలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఏవిధమైన వ్రాతపరీక్ష లేకుండా 'కాగ్నిజెంట్ టెక్నాలజీస్' వారు సెలెక్ట్ చేసారు.

ఏదైనా ఒక నియమం: నియమపాలనకు గురువుగారు ప్రాముఖ్యతనిస్తారు. మనం నియమం పెట్టుకొని దానిని చిత్తశుద్ధితో పాటిస్తూ వుంటే ఆ నియమాన్ని ఆచరించేందుకు అవసరమైన తోడ్పాటునందిస్తారు. ఆ క్రమంలోనే నాకు సుమారు 17సంవత్సరాలపాటు ప్రతి టూర్‌లో తప్పక వారి వెంట వెళ్ళే మహదవకాశాన్ని కల్పించారు. తిరుగుప్రయాణం వున్న ప్రతిసారీ వారి వెంట నన్ను తీసుకుని వెళ్ళారు. భౌతికంగా మరి తిరుగుప్రయాణం లేని జర్మనీ ప్రయాణంలో నన్ను వదలివెళ్ళారు.

కాని నవంబర్ 3, 2010న చెన్నై ఎయిర్‌పోర్టులో చివరిసారిగా వారి ప్రక్కన నడచి వారి ఆశీస్సులు పొందే భాగ్యాన్ని ప్రసాదించారు. వారి చివరి వీడ్కోలు (ఇండియాలో) కన్నులారా చూడగలిగాను. ఆ రోజు వారు ఎయిర్‌పోర్టుకు వెళ్ళే కారును (ఇండియాలో చివరిసారిగా ప్రయాణించినపుడు) "నీవు డ్రైవ్ చేస్తావా" అని గురువుగారు అడిగారు కానీ నేను చేయలేక పోయాను. ఇలాంటివన్నీ నాకు అప్పుడు అర్థంకాలేదు. గురువుగారు సమాధి చెందిన తరువాత ఆలోచిస్తే వారు ఇక భౌతికంగా తిరిగిరారనే విషయాన్ని నాకు ముందుగానే సూచన ఇచ్చారనిపించింది. గురువుగారికి నాపై వున్న ప్రేమ ఎనలేనిది. గురువుగారు ఎయిర్‌పోర్టుకు వెళ్ళేదారిలో, నేను వేరే కారులో ఫాలో అవుతూ దారి తప్పగా నాపై దయతలచి నాకు ఫోన్ చేయించి వారు ఎయిర్‌పోర్టుకు వెళ్ళే రూట్ నాకు చెప్పించి, చివరిసారిగా కూడా నాకు మార్గదర్శకులైనారు.

గురువుగారు మహాసమాధి చెందడానికి మూడు రోజుల ముందు నాకు ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో గురువుగారు నన్ను కారులో వెనుక సీటులో వారి ప్రక్కన కూర్చోమన్నారు. నేను వారు చెప్పినట్లుగానే కూర్చుని వెంటనే రియలైజ్ అయ్యి వారి ప్రక్కన కూర్చున్నందుకు క్షమించమని అడిగి కారులో క్రింద కూర్చున్నాను. "నేనే కదయ్యా కూర్చోమన్నది" అని ప్రక్కన కూర్చోమన్నారు. నేను తిరిగి సీటులో కూర్చున్నాను. ఆ కారు ముందు సీటులో ఎవరూ లేరు. అదే విధంగా డ్రైవరు సీటులో కూడా ఎవరూ లేకుండానే ఆ కారు ప్రయాణిస్తోంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. డ్రైవరు లేకుండా కారు ఎలా వెళ్తుందో నాకు అర్థంకాలేదు. గురువుగారు ఆ కారులో తెనాలిలోని మా ఇంటికి వచ్చి సెకండ్ ఫ్లోర్‌లో ఉన్నారు. కొందరు గురుబంధువులకు కూడా దర్శనం ఇచ్చారు. వారి పేర్లు నాకు గుర్తున్నాయి. నేను మా కుటుంబసభ్యులకు ఈ కల గురించి చెప్పాను. కాని దీని భావం మాకు అప్పుడు అర్థంకాలేదు.

గురువుగారు ఈ 17 సంవత్సరములలో తెనాలికి రెండుసార్లు వచ్చారు. మూడవసారి కూడా వస్తానని చెప్పారు. ఆ సమయంలో గురువుగారి వసతి కోసం మా ఇంట్లో సెకండ్ ఫ్లోర్‌లో మూడు రూములు కట్టించాము. గురువుగారు వారి జీవిత పర్యంతం సత్యాన్ని అంటిపెట్టుకుని ఉన్నారు. వారు పలికిన పలుకులు సత్యమై నిలుస్తాయి. ఇందుకు నిదర్శనంగా వారు సమాధి చెందే మూడురోజుల ముందు తెనాలిలో మా ఇంటికి వచ్చినట్లు నాకు స్వప్నాన్ని ఇచ్చారు. సమాధి చెందిన తరువాత కూడా మా నాన్నగారికి భౌతికంగా దర్శనం ఇచ్చారు. మా అమ్మాయి స్నేహితకు స్వప్నంలో తెనాలి వచ్చినట్లు నిదర్శనం ఇచ్చారు. నేను 1993లో మొదటిసారిగా గురువుగారితో శ్రీశైలం నుండి శిరిడీ వరకు ప్రయాణించాను. అలా



మొదలైన గురువుగారి ప్రత్యక్ష సన్నిధి యాత్ర నవంబర్ 10, 2010 రాత్రి స్వప్నంలో వారి ప్రక్కన కూర్చున్న ప్రయాణంతో ముగిసింది. వారి ప్రత్యక్ష సన్నిధి యాత్ర ఎంతో అమోఘం.

శిరిడీలో గురువుగారి భౌతికకాయాన్ని సమాధి చేసిన మరునాడు ఉదయం నేను సత్సంగంలో ఉన్నాను. ఎందుకో నాకు రూమ్‌కి వెళ్ళాలనిపించింది. రూమ్‌కి వెళ్ళి చెన్నైలో ఉన్న స్నేహితకి ఫోన్ చేసాను. స్నేహిత బాగా ఏడుస్తూ నాకు రేపు సెమిస్టర్ ఎగ్జామ్‌కు సబ్జెక్ట్ ఏమీ గుర్తురావడంలేదు, బాగా వ్రాయలేను అని చెప్తే, 'ఏం బాధపడకు. నేను వెళ్ళి గురువుగారి సమాధి దగ్గర ప్రదక్షిణలు చేస్తాను' అని చెప్పి ప్రదక్షిణలు చేసాను. రెండోరోజు సాయంత్రం స్నేహిత నాకు ఫోన్ చేసి ఆ పరీక్ష అన్ని పరీక్షలలోకెల్లా బాగా వ్రాసానని చెప్పింది. ఈవిధంగా సమాధి అనంతరం కూడా వారి అనుగ్రహం పొందుతున్నాము.

నవంబర్16న గురువుగారి పార్థివదేహం శిరిడీ 'సాయిపథం' చేరినది. ఆ రోజు రాత్రి సత్సంగం తర్వాత రెగ్యులర్‌గా బాబాకు ఆరతి ఇచ్చే గవారేగారు ఆ సమయంలో ఏదో పనిమీద బయటకు వెళ్ళారు. అదే సమయంలో బయటవున్న నేను గురువుగారు ఉన్న ప్రదేశానికి వచ్చాను. మేజర్ సురేష్‌బాబుగారు నాతో, ఇప్పటికే 5ని॥ లేటయింది. వెంటనే బాబాకు ఆరతి ఇవ్వమని చెప్పారు. ఒక్క క్షణం పెద్దవారు ఎవరయినా ఉన్నారేమోనని వెదికాను. ఆ సమయంలో ఎవరూ నాకు కనబడలేదు. వేరే ఆలోచించకుండా బాబాకు, గురువుగారికి నైవేద్యం సమర్పించి హారతి ఇచ్చాను. అనంతరం హారతిని గురువుగారి పార్థివదేహానికి కూడా ఇచ్చాను. వర్ణించలేని అరుదైన ఈ భాగ్యానికి చాలా ఆనందం పొందాను. హారతి అనంతరం నాకు దుఃఖం ముంచుకునివచ్చి బయటకు వచ్చి పెద్దగా ఏడ్చాను. కారణం నేను గురువుగారిని నా జీవితానికి ఒక అర్థం కలిగించమని అడిగాను. నాకు వారి పార్థివదేహానికి ఆఖరిగా హారతినిచ్చే అవకాశాన్ని ఇచ్చి, నా జీవితానికి సార్థకతను ప్రసాదించి, నా కోరికను నెరవేర్చారు.

1995సం॥లో 'సాయియానా' భూమిపూజ కార్యక్రమానికి ముందురోజున నేను, మిస్టర్ జాక్ (ఫారినర్) వెళ్ళి మట్టి త్రవ్వే కార్యక్రమాన్ని చేపట్టాము. మరల అదే ప్రాంగణంలో గురువుగారి సమాధి నిర్మాణ కార్యక్రమంలో కూడా నేను పాలుపంచుకునేలా చేసారు.

2001లో అనుకొంటాను– గురువుగారు, శిరిడీలో సాయిపథం సత్సంగహాలులో వున్న వారి ఫోటోని తీసివేయమని చెప్పారు. ఆ రోజు కోజాగిరి పౌర్ణమి. ఆ రోజున ఆ ఫోటోని నన్ను సైబర్ బిల్డింగ్‌లో పెట్టుకోమన్నారు. ఆ ఫోటోని ఆ బిల్డింగ్‌కు తీసుకువెళ్ళిన గురుబంధువులలో నేను కూడా వున్నాను. ఆ విధంగా ఫోటో తీసివేసే సమయంలో 'మా చేతులమీదుగా ఈ పని చేయవలసి వచ్చిందే' అని చాలా బాధపడ్డాను. మరల గురువుగారు పార్థివదేహం శిరిడీ చేరే ముందురోజు గురువుగారి ఫోటోని నా చేతులమీదుగా డయాస్ మీద ఉంచే భాగ్యం నాకు లభించింది. ప్రతి ప్రయాణంలోనూ తమ వెంట వెళ్ళేందుకు అనుమతించిన గురువుగారు తమ జర్మనీ ప్రయాణంలో నన్ను ఎందుకు తీసుకువెళ్ళలేదో నాకు ఆ రోజున అర్థమయ్యింది.

డిసెంబర్ 2007, కేదారనాథ్ యాత్రలో అందరూ ముందుగా హెలికాప్టర్‌లో కేదార్‌నాథ్ చేరారు. చివరిగా గురువుగారిని పిలుచుకుని రావటానికి గురువుగారు బస చేసిన 'రాంపూర్' హోటల్‌కి వెళ్ళాను. గురువుగారు, అమ్మ, శృతి రెడీగా వున్నారు. ఇంతలో రిసెప్షన్ దగ్గర కూర్చుని వున్న ఒక పూజారి నాతో "గురూజీ దర్శనం కావాలి" అని అన్నారు. ఆ విషయం గురువుగారితో చెప్పాను. గురువుగారు "*బయటకి వచ్చేటప్పుడు చూస్తాన*"న్నారు. గురువుగారు బయటకు రాగానే ఆ పూజారి గురువుగారికి నమస్కరించి తాను కేదార్‌నాథ్ మందిర పూజారినని పరిచయం చేసుకొని, ఆ మందిరం నుండి తెచ్చిన బ్రహ్మకమలం అనే పుష్పాన్ని గురువుగారికి సమర్పించారు. గురువుగారు అతనికి దక్షిణ కూడా ఇప్పించారు. గురువుగారు కారులో వెళ్ళేటప్పుడు "*ఇది నిజమైన బాబా పిలుపు, బాబా ఆహ్వానం. కేదార్ వెళ్ళాలని నేను బయలుదేరితే కేదార్‌కు బాబా నాకు ఆహ్వానం పంపారు*" అన్నారు. ఆ ఆహ్వానాన్ని మన్నించి కాబోలు– ఇండియా నుండి జర్మనీ వెళ్ళే ముందురోజు మేము



గురువుగారిని, "మీరు ఎక్కడికి వెళ్ళారని ఎవరైనా అడిగితే ఏం చెప్పమంటారు?" అని అడిగాము. అందుకు గురువుగారు నవ్వుతూ "హిమాలయాలకు" వెళ్తున్నానని చెప్పమన్నారు. వారి మాటను నిజం చేసుకున్నారు. బాబాలో ఐక్యం చెందారు.

## అందరి దగ్గర ఉన్నా

దుగ్గిరాజు పూజిత, తెనాలి.

నవంబరు 13, 2010 సాయంత్రం నేను మా అమ్మతో కలసి బజారుకు వెళ్ళినప్పుడు మాకు గురుబంధువు కిరణ్‌గారు కనబడి బాబూజీగారు మహాసమాధి చెందారని చెప్పారు. నేను ఆ వార్త విన్న వెంటనే దుఃఖాన్ని ఆపుకోలేక అక్కడ నుండి నేరుగా సత్సంగకేంద్రానికి వెళ్ళి ధ్యానం చేసుకుంటూ కూర్చున్నాను. అప్పుడు గురువుగారు కనబడి *"ఎందుకు ఏడుస్తున్నావు? నేను నావాళ్ళ దగ్గరకు వెళ్ళిపోయాను (అపుడు అక్కడ నాకు బాబా, భరద్వాజగారు కూర్చుని కనపడ్డారు). ఇప్పుడు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పటిదాకా నేను ఒకే చోట ఉన్నాను. ఇప్పటినుండి నేను అందరి దగ్గరా ఉంటాను. ఈవిధంగా మీరు బాధపడితే నేను చాలా బాధపడతాను. మీరు ఎప్పుడూ బాబా నామాన్ని చేస్తూ ఉండండి"* అని చెప్పారు. అపుడు నా మనసులో బాధ తగ్గింది. శ్రీబాబూజీ అంటే నిత్యసత్యం.

## నేనున్నాను- ఏదైనా నన్నడుగు

డి. వరలక్ష్మి, బెంగుళూరు.

నాకు ఎప్పటినుండో గురువుగారు నా గురించి మాట్లాడుతుంటే వినాలని కోరిక. నవంబర్ 11, 2010 రోజున నాకు వచ్చిన కలలో ఆ కోరిక నెరవేరింది. ఈ కలలో గురువుగారు నాతో, *"నీది మంచి స్వభావం. నీకు ఏదైనా సమస్య వచ్చినపుడు నన్ను అడుగు. నేనున్నాను. నీవు బాధపడవలసిన అవసరంలేదు. సరేనా!"* అన్నారు. ఆ మాటలు విని చాలా ఆనందపడ్డాను. ఎందుకంటే ఇంతవరకు నాకు వచ్చిన కలల్లో గురువుగారి దర్శనం మాత్రమే జరిగేది. ఏనాడూ వారు నాతో మాట్లాడలేదు. ఈ కలలో మాత్రం వారు నా కోరిక తీర్చాలని అలా మాట్లాడినట్లుగా నాకు అనిపించింది. వారన్న ఆ మాటలే నాకు వారు ఇచ్చిన ఆదేశంగా, అభయంగా భావించాను. గురువుగారు బాబా ప్రబోధాన్ని గుర్తుచేస్తూ– పరనింద చేయవద్దని, అబద్ధం ఆడవద్దని చాలాసార్లు చెప్పారు. నేను దానిని నియమంగా పెట్టుకొని, ఎట్టి పరిస్థితులలో కూడా సడలించకుండా పాటిస్తున్నాను.

గురువుగారు శిరిడీగాని, తిరువణ్ణామలైగాని, తిరుమలగాని వెళ్ళేటప్పుడు, మేము బెంగుళూరులో ఉన్నందున మాకు తెలిసే అవకాశం లేదు. నేను గురువుగారిని మీరు శిరిడీగాని, తిరువణ్ణామలైగాని వెళ్ళినప్పుడు ఏదో రకంగా తెలియజేయమని, నాకు మీ దర్శనభాగ్యం ప్రసాదించమని ప్రార్థించాను. అదే విధంగా నాకు కలలో గురువుగారు కనిపించిన ప్రతిసారీ గురువుగారు శిరిడీగాని, తిరువణ్ణామలైగాని వెళ్ళారని తెలిసేది. గురువుగారి మహాసమాధికి రెండునెలల ముందు తిరువణ్ణామలై, శిరిడీ, తిరుమల, చెన్నైలలో గురువుగారి దర్శనము ప్రతిసారీ చేసుకున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది.



మహాసమాధి చెందిన తరువాత కూడా గురువుగారు నాకు వారిని దర్శించుకునే అవకాశం కల్పించారు. మా అత్తగారు గురువుగారి మహాసమాధికి వారంరోజుల ముందు నుండి ఆయాసంతో బాధపడుతూ వున్నారు. హాస్పిటల్‌లో చేర్చాము. మా అత్తగారికి ఆయాసం తగ్గాలని గురువుగారిని ప్రార్థించాను. గురువుగారి ఆశీస్సులతో మా అత్తగారికి తగ్గింది. కొంచెం నీరసంగా ఉండేది. అంతేకాని ఆయాసం లేదు. మా అత్తగారు కోలుకున్న తరువాత హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చాము. మావారు రఘుని బెంగుళూరు నుంచి మచిలీపట్నం (మా అత్తగారు ఉండే ఊరు) రమ్మని, అత్తగారిని చూసి మరలా తర్వాత బెంగుళూరు వెళ్ళొచ్చని చెప్పాను. మావారేమో 'నేను రాలేను. ఆఫీసులో చాలా వర్క్ వుంది. వీలు కాదు' అన్నారు. కాని తర్వాత మనస్సు మార్చుకొని అదే రోజు సాయంత్రం అంటే 12వ తారీఖు బయలుదేరి 13వ తారీఖు మధ్యాహ్నం 2గం॥లకు మచిలీపట్నం వచ్చారు. గురువుగారు మహాసమాధి చెందారు అని మాకు అదే రోజు సాయంత్రం 4గం॥లకు తెలిసింది. ఆయన బెంగుళూరులోనే ఉండివుంటే, ఈ విషయం తెలియగానే అటునుండి శిరిడీకి బయలుదేరేవారు. అలా జరిగుంటే మచిలీపట్నం నుంచి శిరిడీకి ఎలా రావాలో తెలియక నేను చాలా ఇబ్బందిపడేదాన్ని. నేను ఇంతకు ముందు ఎప్పుడూ అక్కడ నుండి ఒక్కసారి కూడా ప్రయాణం చేయలేదు. కానీ అలా జరగకుండా, మావారు వర్క్ ఎక్కువగా ఉంది అని ముందు చెప్పినా మచిలీపట్నం రావడం, మా అత్తగారికి ఆరోగ్యం బాగవడం- ఇలా ఇవన్నీ చూస్తే, గురువుగారిని కడసారిగా దర్శించుకునే భాగ్యాన్ని నాకు బాబా, గురువుగారు కల్పించి అనుగ్రహించారని అనిపించింది.

## పసి హృదయాన్ని సైతం స్పందింపజేసే దర్శనం

రాధారాణి, బెంగుళూరు.

మా పాప సాయి నయనకు 6 నెలలు. మా పాపను గురువుగారి దర్శనానికి తీసుకెళ్ళాలని నేను చాలా ప్రయత్నం చేశాను. కాని నాకు సాధ్యమవలేదు. గురువుగారి దగ్గరకు పాపను తీసుకొని వెళ్ళడానికి గురువుగారి దర్శనాలు లేకపోయేసరికి చాలా బాధపడేదాన్ని. అమ్మగారు ఒంగోలు వచ్చినప్పుడు పాపని తీసుకెళ్ళి చూపించి, గురువుగారి ఆశీస్సులు పాపకు ఎప్పుడూ ఉండాలని కోరాము. ఎందుకో నాకు గురువుగారు సమాధి చెందే లోపైనా పాపను చూపించగలనా అనిపించింది. ఛీ! ఇలా అనుకుంటున్నానేమిటని నన్ను నేను తిట్టుకుంటూ బాధపడేదాన్ని. ఇలాంటి ఆలోచనలు బాగా వస్తుండేసరికి ఏడ్చేశాను.

నవంబర్ 13న గురువుగారు మహాసమాధి చెందారని తెలిసి వెంటనే శిరిడీకి బయలుదేరాము. అక్కడ గురువుగారిని దర్శించుకొని, గురువుగారి పార్థివదేహానికి పాపతో నమస్కారం చేయించాను. పాప చాలాసేపు గురువుగారిని చూసింది. అక్కడ ఫోటోగ్రాఫర్ ఫోటో కూడా తీసారు. అప్పటివరకు చాలా నెమ్మదిగా అప్పుడప్పుడు ప్రాకుతూ ఉండే సాయి నయనకు కేవలం రెండు మూడురోజుల్లోనే ప్రాకడం, పట్టుకొని నిలబడటం, కూర్చోవడం అన్నీ వచ్చాయి. అందరం ఆశ్చర్యపోయాము. గురువుగారి దర్శనంతో పాప అంత యాక్టివ్ అయినందుకు నాకు చాలా సంతోషం కలిగింది. గురువుగారితో పాపకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించుకొంటూ ఫోటో కావాలని కోరుకున్నాను. కాని గురువుగారితో ఇలా పాపకు ఫోటో తీయించాల్సి వచ్చింది. గురువుగారు ఎంతో ప్రేమతో మా పాపకి అనుగ్రహాశీస్సులు ఇచ్చారని పాప చురుకుదనాన్ని బట్టి మా అందరికి అర్థమయింది.



# దేహానంతరం అప్రమత్తులే

అరుణకృష్ణ, తెనాలి.

గురువుగారు అందరినీ సత్సంగానికి వెళ్ళడానికి ప్రోత్సహించేవారని నేను కొంతమంది గురుబంధువుల ద్వారా తెలుసుకున్నాను. నా గురువు నోటి నుండి వెలువడిన వాక్కే నాకు వేదవాక్కు అయింది. నేను క్రమం తప్పకుండా సత్సంగానికి వెళ్తుంటాను. సత్సంగమే నా ఇల్లు. బాబా, గురుదేవులే నా తల్లిదండ్రులు అనుకుంటాను. సత్సంగం నా ఎన్నో సమస్యలను తీర్చి ఓదార్పునిచ్చింది.

నవంబరు 13వ తేదీ మధ్యాహ్నం అద్దంకి రామమోహనరావుగారు ఫోన్ చేసి, గురువుగారు బాబాలో ఐక్యమయ్యారని చెప్పారు. ఆ మాట విని షాకయ్యాను. నోట మాట రాలేదు. కళ్ళ వెంట నీరు కారిపోతూ వుంది. అమ్మకు ఇలాంటి విషయాలు త్వరగా చెప్పను. ఆమె హార్ట్ పేషెంట్. కానీ అమ్మ నా ఎదురుగానే ఉండటంతో విషయం తెలుసుకుని వణికిపోయింది. చెమటలు పట్టి, గుండెల్లో బరువుగా ఉంది అని పడుకుంది. నాకు భయం వేసింది. ఒకవైపు గురువుగారి విషయం విని మానసికంగా కృంగిపోయాను. ఇప్పుడు అమ్మ ఏమవుతుందో అని టెన్షన్. గురువుగారికి నమస్కారం చేసుకున్నాను. 14సం॥ల క్రితం అమ్మకు ఇలాగే అయితే కాపాడావు. ఇప్పుడు కూడా భారం నీదే తండ్రీ అనుకున్నాను. హాస్పిటల్‌కి తీసుకువెళ్ళి వైద్యం చేయించాను. అన్ని చెకప్‌లు చేయిస్తే మంచిదని డాక్టర్స్ చెప్పారు. అమ్మకు గురువుగారంటే ప్రాణం. గురువుగారే కాపాడతారు అంటుంది. అలాంటి తనకి కూడా అధైర్యం వచ్చింది. ఒక్కసారి గురువుగారిని చూడాలి ఇంటర్‌నెట్‌లో చూపించమని గొడవచేసింది. నువ్వు చూసి తట్టుకోలేవు, వద్దన్నాను. చూడాలని పట్టుపట్టింది. గురువుగారి పార్థివదేహ దర్శనంతో ఇంకా నీరసపడిపోయింది. నేనిక అమ్మ మీద ఆశ వదులుకున్నాను. పైకి మామూలుగా తిరుగుతున్నాను కానీ మనసులో తుఫాను చెలరేగుతోంది. 'గురుదేవా! ఏది చేసినా భారం నీదే' అనుకున్నాను. ఇ.సి.జి, స్కానింగ్, టి.ఎమ్.టి వంటి పరీక్షలన్నీ చేసి, కేవలం రక్తం తక్కువగా ఉన్నందువలనే ఆమెకు నీరసం వచ్చింది. అంతేకానీ ఇది హార్ట్ స్ట్రోక్ కాదని చెప్పారు. మందులు అవసరం లేదని, రక్తం పడితే ఆమె కోలుకుంటుందని చెప్పారు. అక్కడ స్కానింగ్ సెంటర్‌లోనే అలాగే కుర్చీలో కూర్చుండిపోయాను. గోడకి తల ఆనించి కళ్ళు మూసుకున్నాను. ఎదురుగా నా గురువు, నాతండ్రి నావైపే చూస్తూ తల చిన్నగా ఊపారు. నా కళ్ళల్లో నీళ్ళు కమ్మాయి. "ఈ కన్నీటితోనే మీ పాదాలకు అభిషేకం చేస్తున్నానయ్యా" అనుకున్నాను. దేహముంటేనే గురువుగారు ఉన్నట్లు, దేహానంతరం లేనట్లు అనుకుంటే అది అవివేకం అనిపించింది. వారు మహాత్ములు. 'ఈ భౌతిక దేహానంతరం కూడా నేను అప్రమత్తుడనే' అన్న బాబా పలుకు గురువుగారు నిజంచేసారు.

నేను అద్దెకు ఉంటున్న ఇల్లు గంగానమ్మపేటలోని సాయిబాబా సత్సంగకేంద్రానికి దగ్గరగా ఉండేది. నేను రోజూ క్రమం తప్పకుండా సత్సంగానికి వచ్చేదాన్ని. ఆరునెలల క్రితం ఇల్లు మారాల్సి వచ్చింది. ఆ ఇల్లు సత్సంగానికి కొంచెం దూరంగా వుంటుంది. సత్సంగానికి ఇదివరకులా రాలేనేమో, సేవ చేసుకోలేనేమో అని భయపడ్డాను. గురుపౌర్ణమికి శిరిడీ వెళ్ళినప్పుడు– 'గురుదేవా! నా ఇల్లు సత్సంగానికి దూరంగా వుంది. సత్సంగానికి దగ్గరగా చిన్న ఇల్లు అద్దెకు ఇప్పించయ్యా' అని అనుకున్నాను. శిరిడీ నుండి వచ్చాక నా ప్రమేయం లేకుండానే, సత్సంగానికి దగ్గరగా సొంత ఇల్లే ఇచ్చారు గురువుగారు. నాకు కావాల్సిన 'ఉడా' ప్లాన్, బ్యాంక్ లోన్, ప్లానింగ్ ఇంజనీర్ సర్టిఫికేట్, ఇంకా ఎన్నో ఫారాలు, నేను ఎక్కువగా తిరిగి శ్రమపడకుండానే వాళ్ళే ఎదురువచ్చి ఇచ్చారా అన్నట్లు జరిగిపోయింది. మరలా దసరాకి శిరిడీ వెళ్ళినప్పుడు, 'గురుదేవా! ఇల్లు రిజిస్ట్రేషన్ జరిగాక డాక్యుమెంట్స్ తెచ్చి మీపాదాల వద్ద ఉంచుతాను' అనుకున్నాను.

నవంబర్ 12న రిజిస్ట్రేషన్ అయింది. నవంబర్ 13న గురువుగారు దేహత్యాగం చేసారు. నాకు చాలా బాధ, నిరాశ అనిపించింది. అయినా మహాత్ములకు మరణం లేదు. వారు అమరులు అని నన్ను నేనే ఓదార్చుకున్నాను. ఏ జన్మలో చేసిన



పుణ్యమో 15 సంవత్సరాల పాటు సజీవులైన సద్గురువుని దర్శించుకోగలిగాను అనుకున్నాను. 20వ తేదీన డాక్యుమెంట్స్ బ్యాంక్‌లో ఇవ్వాలి. ఒరిజినల్ కాపీని రెండు సెట్లుగా ఫోటోస్టాట్ తీయించి, మొత్తం ఆఫీసరుగారికి ఇచ్చాను. ఆమె అన్నీ సరిచూసుకుని, తనకి కావాల్సినవి తీసుకొని మిగిలిన ఫారాలు నాకు ఇచ్చారు. ఇంటికి వచ్చి అన్నీ ఫైల్ చేసుకుంటూ చూడగా, ఒరిజినల్ డాక్యుమెంట్ నా దగ్గరే ఉంది. ఆ ఆఫీసర్ ఫోటోస్టాట్ మాత్రమే తీసుకుంది. జరిగిన విషయం ఆమెకు చెపితే, ఆమె చాలా కూల్‌గా, 'తొందరేముంది, నిదానంగా తీసుకురండి' అన్నారు. ఏ బ్యాంక్ వారైనా ఇలా చేస్తారా? ఇది ఖచ్చితంగా గురువుగారి అనుగ్రహమే. ఎందుకంటే 'ఒరిజినల్ డాక్యుమెంట్ తీసుకొచ్చి మీ పాదాల చెంత ఉంచుతాను' అన్న నా కోర్కెను గురువుగారు ఈవిధంగా తీర్చారు.

నేను ఏది అడిగినా గురువుగారు తీరుస్తారనే విశ్వాసముంది. అందుకే నేను ఎప్పుడూ గురువుగారి మీదే ఆధారపడతాను. నా గురుదేవులకు కృతజ్ఞతలు తెలుపడానికి ఈ జన్మ సరిపోదు అనిపిస్తుంది. నాకు చాలా విషయాలలో, చాలా సంఘటనలలో బాబా, గురువుగారు ఒక్కరేనని అనుభవమైంది.

## తలచినంతనే అనుగ్రహం

టి. లక్ష్మి, హైదరాబాద్.

గురువుగారికి అనారోగ్యంగా ఉందని విని, నేను, మావారు గురువుగారిని చూద్దామని శిరిడీకి వచ్చాము. మావారికి మతిస్థిమితం లేదు. సాయియానా సత్సంగం హాలులో జనం క్రిక్కిరిసి వున్నారు. గురువుగారికి బాగాలేదని చూసేదానికి వచ్చారనుకున్నాను. లోపలికి పోయి చూస్తే గురువుగారిని బాక్సులో పెట్టి వుంచిన దృశ్యం చూసి బిగ్గరగా ఏడుస్తూ వుండిపోయాను. ఇంతలో గుంటూరు శివగారు నన్ను సముదాయించారు. గురువుగారి సమాధి కార్యక్రమములో పాల్గొని శిరిడీ నుండి మా స్వగ్రామానికి సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాము. మతిస్థిమితం లేని మావారు రాత్రి 12గం.ల సమయంలో రైలు దిగేశారు. ఆ సమయంలో నేను నిద్రపోతున్నాను. ఉన్నట్లుండి మెలకువ వచ్చేసరికి మావారు కనపడలేదు. చుట్టుప్రక్కల వారిని, మావారిని చూసారా అని ఖాజీపేట దాటిన తరువాత అడిగాను. మీవారు ఖాజీపేటలో దిగేసారని చెప్పారు. నేను పెద్దగా ఏడవటం మొదలుపెట్టాను. మాతోపాటు కంపార్ట్‌మెంటులో ఉండే ఇద్దరు పిల్లలు గార్డుకు చెప్పి ఖాజీపేట స్టేషన్‌మాస్టర్‌కు ఫోన్ చేసారు. స్టేషన్‌మాస్టర్ నేను చూసుకొంటానని ధైర్యం చెప్పారు. వరంగల్ వచ్చిన తర్వాత నేను దిగి, పద్మావతి ఎక్స్‌ప్రెస్ ఎక్కి ఖాజీపేటకు వెళ్ళి, స్టేషన్‌మాస్టర్‌కు మా ఆయన గుర్తులు చెప్పి అడగగా, గోదావరి ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతుంటే ఇంజన్ క్రింద పడబోతే అరచి దూరంగా పంపించానని చెప్పారు. నేను అన్ని ప్లాట్‌ఫారంల మీద వున్న వాళ్ళను మా ఆయన గుర్తులు చెప్పి అడిగాను. ఆ పోలికలు గల వ్యక్తి కనబడలేదని చెప్పారు. తరువాత నేను గురువుగారిని తలచుకుని– 'మావారు కనపడకపోతే నేను కూడా రైలు క్రిందపడి చనిపోతాను గురుదేవా, మీరు భౌతికంగా వుంటే మీతో చెప్పుకునేదానిని, ఇప్పుడు మీరు కూడా లేరు' అని ఏడ్చాను. అప్పటివరకు రైల్వేస్టేషన్‌లో కనపడని మావారు నేను గురువుగారిని తలచుకోగానే నా ప్రక్కనే కనిపించారు.

నవంబరు 20వతేదీ రాత్రి నేను, మావారు పలుకూరులో మా ఇంట్లో వున్నాము. ఒక అర్ధరాత్రి మెలకువ వచ్చింది. "గురువుగారూ! మీరు వున్నప్పుడు మా కష్టసుఖాలు మీతో చెప్పుకునే దానిని. ఇపుడు మీరు కూడా సమాధి చెందారు. నా బాధలు



ఎవరు తీరుస్తారు?" అని ఏడుస్తూ మరలా నిద్రలోకి జారుకున్నాను. కలలో గురువుగారి సమాధి కనపడింది. సమాధి మధ్యలో గురువుగారు నిలుచున్నారు. నేను గడగడా వణికిపోతూ నమస్కారము చేసుకున్నాను. మావారు ప్రక్కనే నిలబడి చూస్తున్నారు. గురువుగారు నావైపు చూస్తూనే వున్నారు. నేను సమాధి వద్ద నుండి గేట్ వరకు వచ్చి మరలా వెనుకకు చూస్తే గురువుగారు అట్లాగే నిలుచొని వున్నారు. మరలా నమస్కారం చేసుకున్నాను.

## అనునిత్యం అనుగ్రహం

చీదెళ్ళ రాజేశ్వరి, సంతనూతలపాడు.

నాకు ఎక్కువసార్లు గురువుగారి ప్రత్యక్ష దర్శనభాగ్యం కలుగలేదు. నేను సత్సంగానికి అరుదుగా వెళుతుంటాను. కాని బాబా అంటే చాలా ఇష్టం. బాబా పూజ శ్రద్ధగా చేసుకొంటాను. నాకు ఏ సమస్య వచ్చినా బాబా స్వప్నంలో పరిష్కారం చెబుతూ ఉంటారు. మా బాబుకు ఉద్యోగం రానందుకు చాలా బాధపడుతున్న సమయంలో గురువుగారు స్వప్నంలో కనిపించి మా సమస్యను తీర్చారు. నాకు నవంబర్ 28, 2010 ఆదివారం గురువుగారు స్వప్నదర్శనం ప్రసాదించారు. ఆ కలలో– *"అమ్మా! నీవు బాబాకు శ్రద్ధగా చేసుకొంటున్నావమ్మా. ఇంకా బాగా చేసుకోమ్మా. నేను వెళ్ళిపోతున్నాను. 62 సంవత్సరాలు ఉందామనుకొన్నాను. కాని ముందే వెళ్ళిపోతున్నాను. అయినప్పటికీ ఇంకా బాగా ప్రకటమవుతాను, అనుగ్రహిస్తాను. బాబాకు బాగా శ్రద్ధగా చేసుకోమ్మా"* అని చెప్పారు. ఒక పళ్ళెంలో కుంకుమభరిణ, పసుపు, అరటిపండ్లు పెట్టి 'తీసుకోమ్మా' అని, *"నేను ఎప్పుడూ నీకు సాయం చేస్తాను. నీకు ఇంకా మంచి జరుగుతుంది"* అని అభయమిచ్చారు. ఆ స్వప్నంలో గురువుగారు తెల్లని వస్త్రాలతో ఎంతో ప్రకాశవంతంగా ఉన్నారు. ఆ రూపాన్ని ఎప్పటికీ మరచిపోలేను.

## మహద్భాగ్యం

జె. సతీష్‌బాబు, ఒంగోలు.

నేను సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో ట్రాన్స్‌పోర్ట్ కో–ఆర్డినేటర్‌గా వర్క్ చేస్తున్నాను. గురువుగారి దర్శనాలు గాని, శిరిడీకి రావడంకాని నేను ఎప్పుడూ మిస్ అయ్యేవాణ్ణి కాదు. ఈ మధ్య నాకు స్కూల్లో ఉండే బాధ్యతల వలన అంతకు ముందులా శిరిడీ వెళ్ళడం, గురువుగారిని దర్శించుకోవడం సాధ్యమవలేదు. దాంతో అవన్నీ మిస్ అవుతున్నానని అప్పుడప్పుడు బాధగా ఉండేది. గురువుగారు మహాసమాధి కార్యక్రమంలో నన్ను ఎంతో సమీపంగా ఉండగలిగేలా అనుగ్రహించి నా మనస్సులో వున్న ఆ బాధనంతా ఒక్కసారిగా తీసివేశారు.

గురువుగారి పార్థివదేహాన్ని తీసుకుని వస్తున్నారని తెలిసి శిరిడీ పొలిమేర వద్ద ఎదురుచూస్తున్నాము. గురువుగారి పవిత్రకాయం శిరిడీ చేరగానే ఆ వ్యాన్ చుట్టూ ఒక్కసారిగా అందరూ చేరి, ఏడుస్తూనే బాబా నామం చెప్పుకుంటూ గురువుగారిని తీసుకువస్తున్నారు. అందరూ గురువుగారిని చూడాలని వ్యాన్ దగ్గరకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. నేను కూడా గురువుగారిని



చూడాలని అనుకున్నాను. కనీసం గురువుగారున్న వాహనాన్ని కూడా తాకలేకపోయాను. గురువుగారిని ఎప్పుడు చూస్తామా, ఈ జనంలో ఇప్పుడల్లా చూడగలుగుతామా లేదా అనే బాధతో మన సత్సంగమందిరానికి చేరుకున్నాను. అక్కడికి వెళ్ళగానే, దశన్న నాతో– 'అందరూ ఒక్కసారిగా లోనికి వస్తారేమో, నువ్వు ఇక్కడే వుండి కొద్దిగా చూసుకుంటూ ఉండు' అని చెప్పారు. ఇంతలో గురువుగారి దేహం ఉన్న వ్యాన్ గేట్ దగ్గరకు చేరుకుంది. నెమ్మదిగా వ్యాన్ లోనికి వస్తున్నది. అప్పుడు నేను గురువుగారిని లోనికి తీసుకువెళ్ళేందుకు ఏర్పాటు చేసిన దారికి గోడ ప్రక్కన నిలుచొని వున్నాను. అంతలో అక్కడ శివరామ్‌గారు నన్ను పిలిచి, గురువుగారున్న పేటికను లోనికి తీసుకువెళ్ళేందుకు ఏర్పాటుచేసిన దారికి రెండవవైపుకి రమ్మన్నారు. శివరామ్‌గారు నాతో– 'సతీష్, గురువుగారు వున్న పేటికను మనం బలంగా నెట్టుకుంటూ జాగ్రత్తగా లోనికి తీసుకువెళ్ళాలి' అని చెప్పారు. ఇంతలో వ్యాన్ రాగానే గురువుగారి దేహంవున్న పేటికని దించారు. ఆ పేటికని అక్కడ ఉంచిన బల్లల మీదుగా జరుపుకొంటూ మేమంతా కలిసి గురువుగారిని సత్సంగ మందిరం లోనికి తీసుకువచ్చాము. నేను గురువుగారిని చూస్తూ అలానే ఉండిపోయాను. నాకు గురువుగారిని వదలివెళ్ళాలని లేదు. అక్కడే ఉండాలని గురువుగారికి మనసులో ప్రార్థించుకున్నాను. కానీ అంతలోనే 'ఎవ్వరూ ఇక్కడ ఉండడానికి లేదు, ఇక్కడ నుండి వెళ్ళిపోండి' అని అంటున్నారు. నన్ను కూడా వెళ్ళిపొమ్మని చెబుతున్నారు. నాకు గురువుగారిని దగ్గరగా ఎక్కువసేపు ఇక చూడలేము కదా అని బాధవేసింది. అక్కడ ఉన్నవాళ్ళు ఒక్కొక్కరు బయటకు వెళ్తున్నారు. ఇంతలో అక్కడ వున్న ద్వారక్ సార్ నన్ను పిలిచి, గురువుగారు ఉన్న పేటిక చుట్టూ నేలపై పడివున్న పూలు క్లీన్ చెయ్యమని చెప్పారు. అక్కడ శుభ్రం చేస్తూ అలాగే గురువుగారి దగ్గర వున్నాను. అది అయిన తరువాత కొంతసేపటికి మరలా బయటకి వెళ్ళమన్నారు. నాకు మళ్ళీ మనసులో బాధ కలిగింది. అంతలో ద్వారకగారు నన్ను మళ్ళీ పిలిచి గురువుగారు ఉన్న పేటిక డైరెక్షన్ మార్చాలి ఉండు అన్నారు. అది అయిన తరువాత నన్ను గురువుగారి చుట్టూ పూలమాలలు అలంకరించమన్నారు. ఆ తరువాత గురువుగారిని చూసేందుకు, అందరినీ క్యూలో వదిలారు. ఒక్కొక్కరు వచ్చి గురువుగారిని చూసుకుంటూ వారితోపాటు తెచ్చిన పూలు గురువుగారి మీద ఉంచుతున్నారు. గురుబంధువులు తెస్తున్న పూలమాలలను తీస్తూ, ఆ బాక్స్ పైవున్న మరకలు తుడుస్తూ అక్కడే వున్నాను. నేను ఉన్నది గురువుగారి శిరస్సు దగ్గర. అక్కడ అలాగే చాలాసేపు దాదాపు రాత్రి 8 గంటలదాకా వున్నాను. గురువుగారిని చూసుకుంటూ అక్కడే ఉండేందుకు గురువుగారు అలా అనుగ్రహించి అవకాశం కల్పించారు.

ఆ మరుసటిరోజు ఉదయం సమాధి చేసే ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తూ ఎవరికి తగ్గ పనులలో వారు నిమగ్నమై వున్నారు. సమాధి చేసే సమయంలో కూడా నేను గురువుగారిని చూసుకుంటూ ఉండాలి అని మనసులో ఉంది. అలా అనుకుంటూ అక్కడే వర్క్ చేసుకుంటున్నాను. కాని ఇంతలో దశన్న ఈ ప్రాంగణంలో 10.30గం.ల కల్లా ఎవరూ ఉండటానికి లేదని నాతో అన్నారు. అప్పటికే సత్సంగహాలు లోపల, వెలుపల కూడా పూర్తిగా జనంతో నిండిపోయింది. ఆఖరిసారిగా గురువుగారిని చూసుకోగలనో లేదోనని మథనపడుతూ అక్కడ వర్క్ చేసుకుంటున్నాను. ఇంతలో రమేష్ అన్న పిలిచి, 'బయట వెహికల్‌లో గ్రానైట్ స్టోన్ (గురువుగారి సమాధిలో గోడకు వేయడానికి) వచ్చింది. తీసుకురండి' అన్నాడు. ఆ స్టోన్ తీసుకు వచ్చి శుభ్రం చేస్తూ వున్నాను. 10.30 సమయం దగ్గరపడుతోంది, బయటికి వెళ్ళాలేమోనని నాకు ఒకప్రక్క భయము, ఇంకొకప్రక్క బాధగా ఉంది. ఇంతలో మరలా రమేష్ అన్న– గురువుగారు అంతకుముందు ఊదీ దర్శనాలు ఇచ్చే రూమ్‌లోనికి పిలిచి, అక్కడ ఉప్పు, కర్పూరము కలపమని చెప్పాడు. అక్కడే ఉండి ఆ పని చేస్తూ చాలాసేపు వున్నాను. ఇంకొద్దిసేపట్లో గురువుగారి దేహాన్ని తీసుకువస్తారనగా, నేను అక్కడినుండి నేరుగా వచ్చి, సమాధి దగ్గర వున్న గురువుగారి ఫోటోకి ప్రక్కన ఒక మూలగా నుంచున్నాను. తరువాత సత్సంగమందిరంలో వున్న గురువుగారిని తీసుకువస్తున్నారు. ఆ సమయంలో, గురువుగారి శరీరాన్ని తాకే అదృష్టం ఉందో లేదో, గురువుగారి శరీరాన్ని తాకి నమస్కారం చేసుకోగలుగుతానో లేదో అనే బాధ ఉంది. ఇంతలో శృతిపాప గురువుగారిని సమాధిచేసే స్థలం దగ్గరకి వచ్చి వున్నారు. గురువుగారిని తమ చేతులతో ఎత్తుకొని తీసుకువస్తున్నారు.



ఆ సమయంలో 'గురువుగారూ! మిమ్మల్ని తాకే భాగ్యాన్ని కలిగించండి' అని మనసులో వేడుకొంటున్నాను. గురువుగారి శరీరాన్ని శృతిపాప చేతులకు అందిస్తుండగా, నేను మోకాళ్ళపై శృతిపాప వెనుకవున్నాను. అప్పుడు గురువుగారి దేహం నాకు చాలా సమీపంగా వచ్చింది. నేను గురువుగారి చెంపను నిమురుతూ కడసారిగా చూసుకున్నాను. గురువుగారిని నెమ్మదిగా లోనికి దించుతున్నంతసేపు, అమ్మగారు, పాప మిగతా కార్యక్రమాలు పూర్తి చేసేంతవరకూ, సమాధి ప్రక్కనే ఉండి వారిని తనివితీరా చూసుకునే మహద్భాగ్యాన్ని నాకు ఈ విధంగా అనుగ్రహించారు.

## మా ఇంటికి వచ్చారు

**బి.ముక్త, హైదరాబాద్.**

నా పేరు ముక్త. నా వయస్సు 14 సంవత్సరాలు. నాకు గురువుగారితో గల అనుభవాలలో ఇది అత్యుత్తమమైనది. నాకు కలలో వచ్చిన ఈ అనుభవంలో, గురువుగారి సమాధి నుండి ఓ రకమైన తెల్లని ధూమం ఎగసి అలా సాగిపోతూ వుంటే అమ్మగారు, శృతి అక్క అనుసరిస్తున్నట్టుగా వుంది. నాకు ఒక్క క్షణం ఆ ధూమం ఏమిటన్నది అర్థం కాలేదు. మరికాస్త సమయానికి శృతి అక్క, అమ్మగారు ఆ ధూమం వెంబడి వెళుతూండడంతో శ్వేతవర్ణ ధూమం గురువుగారని అనిపించింది. ఆ ధూమం అలా సాగిపోయి చివరకు మా ఇంటికి చేరుకుంది.

## వ్యధ తీర్చిన స్వప్నదర్శనం

**షాలిని, నార్త్‌కరోలినా, యు.ఎస్.ఎ.**

గురువుగారు మహాసమాధి అనంతరం డిసెంబర్‌లో నాకు స్వప్నంలో దర్శనమిచ్చారు. ఆ స్వప్నంలో– గురుబంధువులు అందరూ గురువుగారి కోసం శిరిడీ సాయియానాలో వేచి ఉన్నారు. చాలా పెద్ద 'క్యూ'లు ఉన్నాయి. నేను, గురుబంధువు భార్గవి లైన్‌లో వున్నాము. పాదదర్శనం అయ్యింది. మళ్ళీ మేము ముందుకువెళ్ళి నిలబడ్డాము. గురువుగారు చాలాసేపు ఆగివున్నారు. నాకు సంతృప్తిగా గురువుగారి పాదనమస్కారం చేసుకునే భాగ్యం కలిగింది. ఆ స్వప్నం తరువాత నాకు, 'గురువుగారు సమాధి చెందలేదు. ఇంకా మనతోనే వున్నారు, ఇంకా దర్శనాలు వున్నాయి' అన్న భావన కలిగింది. ఈ కల నాకు వచ్చినప్పుడు చాలాసార్లు మెలకువ వస్తూనే వుంది. మళ్ళీ కంటిన్యూ అవుతూ వుంది. గురువుగారి స్వప్నదర్శనం వల్ల చాలారోజులు నాలో ఏదో తెలియని శక్తి వచ్చింది.

మరోసారి 2010 డిసెంబర్‌లోనే గురువుగారు స్వప్నదర్శనం ఇచ్చారు. ఒకరోజు ఎందుకో చాలా బాధగా అనిపించింది. గురువుగారు మహాత్ములు. మహాసమాధి చెందిన తర్వాత కూడా మనతోనే వున్నారు అని అనుభవాలు ఇస్తున్నారు కదా. గురువుగారు భౌతికరూపంలో లేకపోయినా మనతోనే వున్నారు అని సర్దిచెప్పుకొనేదానిని. కానీ ఆ రోజు ఎందుకో మనసులో చెప్పలేనంత బాధ. ఎంత సర్దిచెప్పుకున్నా బాధ తీరలేదు. రోజంతా ఆలోచిస్తూనే వున్నాను. గురువుగారు నా బాధ పోగొట్టడానికా



అన్నట్లు ఆ రోజు స్వప్నదర్శనం ఇచ్చారు. పెద్ద హాలు ముందు అందరం గురువుగారి దర్శనం కోసం వేచివున్నాము. చాలాసేపటికి ఎవరో వచ్చి 'ఇకమీదట గురువుగారి దర్శనం ఉండదు, ధ్యానం చేసుకోవటానికి హిమాలయాలకు వెళ్తారు' అని చెప్పారు. సంవత్సరానికి ఒకసారి మాత్రమే దర్శనం ఇస్తారట అని చెప్పుకుంటున్నారు. తరువాత కొంతమందిని లోపలికి పిలిచారు. నన్ను మా ఇంట్లో పిలిచే పేరుతో పిలిస్తే ఆశ్చర్యం వేసింది. నేను లోపలికి వెళ్ళాను. లోపల, హొటల్‌లో మీటింగ్ హాల్‌లాగా వుంది. గురువుగారు కూర్చుని వున్నారు. వెళ్ళి వారి పాదాలకు నమస్కారం చేసుకున్నాము. గురువుగారు సాక్స్ వేసుకొని వున్నారు. నమస్కారం చేసుకొంటూ ఉండగా, హిమాలయాలకు వెళుతున్నారు కదా, అందుకనే సాక్స్ వేసుకొన్నారు కాబోలు అని నా మనసులో ఆలోచన వచ్చింది. దర్శనం చాలా బాగా అయ్యింది. గురువుగారు నా తలమీద చెయ్యి ఉంచి దీవించారు. ఎప్పుడూ నేను– బాబా నన్ను అనుగ్రహించేటప్పుడు నా తలమీద చెయ్యిపెట్టి దీవిస్తారు అని అనుకొంటాను. గురువుగారు స్వప్నదర్శనంలో అలాగే నన్ను దీవించారు.

## ఆ చూపు వెతలను బాపు

ఎస్.సిహెచ్.బి.కె. గుప్తా, హైదరాబాద్.

నేను గురుదేవుల దగ్గరకు 1982లో మొదటిసారి వచ్చాను. అప్పటి నుండి గురుదేవులను వీలున్నప్పుడల్లా కలుస్తూ, నాకున్న చిన్నా, పెద్దా అనుమానాలన్నీ నివృత్తి చేసుకుంటుండేవాడిని. ఇందులో ఒక ప్రత్యేకత ఉండేది. అదేమిటంటే గురుదేవులు ఏ విషయాన్నైనా మనస్సుకు హత్తుకునేలా చెప్పి, ఆ విషయానికి బాబా తత్త్వాన్ని జోడించేవారు. సాయిబాబా, సాయిపథం మాసపత్రికలలోను, శిరిడీ సాయియానా ఏర్పాటులోను పాలుపంచుకొనే భాగ్యాన్ని నాకు ప్రసాదించారు. గురుదేవులను 1982 నుండి 2002 వరకు వీలైనన్ని ఎక్కువసార్లు తరచూ దర్శించుకునేవాణ్ణి. వారు నా జీవితాన్ని, ఆలోచనావిధానాన్ని తీర్చిదిద్దారు.

నవంబరు నెలలో గురుదేవులు జర్మనీలో ఉన్నట్లు, ట్రీట్‌మెంట్ ఏదో జరుగుతుందని మాత్రం తెలిసింది. హఠాత్తుగా గురుదేవులు ఇకలేరని శ్రీహరి, శివరాంలద్వారా విని నేను అయోమయస్థితిలో ఉండిపోయాను. నేను, నా కుటుంబసభ్యులు పూర్తిగా శోకసముద్రంలో మునిగిపోయాము. ఇది నిజమా? లేక అబద్ధమా? అని మనస్సు కొట్టుకుంది. గురుదేవులు జర్మనీ నుండి శిరిడీకి వస్తున్నారని తెలిసి అందరమూ శిరిడీ చేరాము. మంగళవారం మధ్యాహ్నానికి గురుదేవులు శిరిడీ చేరారు. గురుదేవులను జనవరి 2010 నుండి దర్శించుకోలేకపోయానన్న దిగులు నన్ను విపరీతంగా కృంగదీసింది. అట్లాగే అదే స్థితిలో– గురువుగారిని చివరిసారిగా దర్శించుకుందామని సాయియానా సత్సంగమందిరానికి చేరి గురుదేవుల పాదాలకి నమస్కరించి, వస్తున్న దుఃఖాన్ని ఆపుకొంటూ, కొద్దిగా ముందుకు వంగి కళ్ళు మూసుకుని ప్రార్థించుకుని, గురుదేవుల వంక చూసాను. అంతే! మన ప్రియతమ గురుదేవులు నావంక కళ్ళు తెరచి చూచి మళ్ళీ కళ్ళు మూసుకున్నారు. అదే సమయంలో వారి హృదయభాగం కూడా కొట్టుకున్నట్లుగా స్పష్టంగా చూసాను. ఒకప్రక్క ఆనందం, మరోప్రక్క గురువుగారు ఇక లేరనే దుఃఖం నన్ను ఎంతగానో బాధించాయి. అప్పుడు అక్కడ ఉన్న నా ప్రియ స్నేహితుడు శ్రీఎస్.వి.ఎల్. నారాయణరావుగారిని కౌగలించుకుని, ఇద్దరం భోరున ఏడ్చాము.

నేను సత్సంగమందిరం నుండి బయటకు వచ్చి కూర్చున్నాను. వెంటనే జరిగిన సంఘటన మళ్ళీ మళ్ళీ జ్ఞప్తికి వచ్చి చాలా మథనపడ్డాను. గురువుగారిని జనవరి నుండి దర్శించుకోలేదన్న ఆవేదన తీసివేయడానికి గురువుగారు నావంక చూచి నన్ను



ఓదార్చారు. ఆ ఒక్క చూపుతోనే నా బాధను పోగొట్టారు. దీనిని బట్టి మనకు అన్ని విధాల అండగా ఉండే గురుదేవులు, ఇక తర్వాత కూడా సూక్ష్మశరీరంతో ఉండి మనల్ని ఎల్లవేళలా కాపాడతారని తెలుసుకున్నాను.

సమాధి అనంతరం ప్రతి వారం-పదిరోజులకు ఒకసారి తెల్లవారుఝామున నాకు గురువుగారు స్వప్నదర్శనం ప్రసాదిస్తూనే ఉన్నారు. ఒకసారి ఎక్కడో సుదూరప్రాంతాలకు గురుదేవులు నన్ను తీసుకెళుతున్నట్లు స్వప్నం వచ్చింది. ఇలా వారు మిగిల్చిన జ్ఞాపకాలను తలచుకొంటూ నా జీవిత చివరి దశను వెళ్ళబుచ్చుతున్నాను.

## ఎవరు ముందు వెళ్ళాలి

మార్విన్ ఏల్‌వర్డ్, ఫ్రాన్స్.

గురువుగారు మహాసమాధి చెందారని తెలిసి నేను, నా భార్య గెయిల్ చాలా ఆశ్చర్యపోయాము. గురువుగారు సమాధి చెందిన రోజు శనివారం ఉదయం గెయిల్ చాలా విచిత్రమైన పరిస్థితికి లోనయింది. ధ్యానం కుదరడానికి కూడా చాలా సమయం పట్టింది. ఏదో తెలియని ముఖ్యమైన సంఘటన జరుగబోతుందనిపించింది. గురువుగారు సమాధి చెందడానికి ముందురోజున గురువుగారి గురించి మొదటిసారి కల వచ్చింది. ఆ కలలో “జీవితంలోని ప్రతి విషయంలో ఉన్న సహజత్వాన్ని గురించి, అనంతచైతన్యంలో భాగంగా సాగే ఈ జీవనస్రవంతి గురించి, జీవితాన్ని సహజంగా, పరిపూర్ణంగా ఎలా జీవించాలి” అనే విషయాల గురించి గురువుగారు, నేను చాలాసేపు చర్చించుకున్నాము. ఆ తరువాత ‘ఎవరు ముందు వెళ్ళాలి’ అనే విషయం మీద మీమాంస వచ్చింది. అందరూ ఎవరు ముందు వెళ్ళాలని చర్చించుకొంటుండగా, గురువుగారు, నేను మా ఇద్దరిలో ఎవరు వెళ్ళినా ఫరవాలేదని అనుకొన్నాము. ఆ కల గురించి గురువుగారు సమాధి చెందిన రోజు ఉదయం గెయిల్‌తో మాట్లాడాను. ఆ తర్వాత గురువుగారు సమాధి చెందారనే విషయం తెలిసి నాకు వచ్చిన కలను విశ్లేషించుకొని చాలా ఆశ్చర్యానందాలకు లోనయ్యాను.

## ఉత్తరం వ్రాయి

బి. మురళీబాబు, వెంకటగిరి.

నేను ఒక పని చేయదలుచుకున్నాను. కాని ఎలా చేయాలో, ఏం చేయాలో అనే సరైన అవగాహన రావడంలేదు. అప్పుడు ఒక రాత్రి బాబా, గురువుగారిని స్మరించుకుంటూ, ఆ పని ఎలా చేయాలో అనే దాని గురించి తగు సలహా ఇవ్వవలసిందిగా వేడుకొంటూ అలాగే నిద్రపోయాను. ఆ రోజు నవంబర్ 22, 2010. ఆ రాత్రి తెల్లవారుఝామున 4:30గం.ల ప్రాంతంలో గురువుగారు నాకు స్వప్నదర్శనమిచ్చారు.

ఆ స్వప్నంలో- పొడవుగా ఉన్న ఒక గృహంలో దేవుని ముందు గురువుగారు కూర్చొని ధ్యానం చేసుకొంటున్నారు. నా శరీరమంతా భయంతో బిగుసుకుపోయింది. గురువుగారు సమాధి చెందారన్న విషయం కూడా జ్ఞాపకమొచ్చింది. భయం



భయంగానే నామాన్ని జపిస్తూ గురువుగారి దగ్గరకు చేరాను. అప్పుడు గురువుగారు నన్ను చూసి ఏదో మాట్లాడి, "నీవు అనుకొన్న పని నెలరోజుల్లో అవుతుంది, నాకు ఇవ్వాల్సింది తప్పక తెచ్చివ్వాలి" అన్నారు. ఆ మాటలు స్పష్టంగా అర్థంకాక గురువుగారిని చూశాను. అప్పుడు గురువుగారు 'నీవు అనుకొన్న పని నెలరోజుల్లో అవుతుంది, నాకు వస్తువేదైనా తెచ్చివ్వు' అన్నట్లుగా అర్థమయింది. గురువుగారు ఎక్కువ స్పష్టంగా కాకపోయినా, బాగానే కనిపిస్తున్నారు. ఎడమవైపు వెంట్రుకలు కొంతభాగం మట్టి రంగులోనో లేక బంగారు రంగులోనో ఉన్నట్లు కనిపిస్తున్నాయి. గురువుగారు ముందు కూర్చొన్న నేను 'మీ పాదాలను పట్టుకోవాలని ఉంది' అన్నాను. అంతలో గురువుగారు పద్మాసనం నుండి రెండుపాదాలు తీసి నేనున్న ఎడమవైపు ఉంచారు. నేను రెండు పాదాలను ఎంతో ఆనందంతో పట్టుకొన్నాను. ఆ పాదాల వ్రేళ్ళ మధ్య తడికి పుండుపడ్డట్లు, మట్టి ఉన్నట్లు కనిపించింది. నేను పాదనమస్కారం చేసుకొన్నాను. తరువాత నా చేతులను చూసుకొంటే మంచి వాసనతో కూడిన గంధం అంటుకొని ఉంది. రెండు చేతులకు వున్న ఆ గంధాన్ని నా ఛాతీభాగంలో పవిత్రభావంతో రాసుకొన్నాను.

గురువుగారు 'నీవనుకున్న పనిని ఉత్తరంలాగా ఈ పేపరుపై వ్రాసివ్వు' అని ఒక పాత తెల్లకాగితాన్ని నాకు ఇచ్చారు. దానికి ఒకవైపు ఏదో వ్రాసినట్లు ఉంది. అందువల్ల దానిని వెనక్కు త్రిప్పి చూపి వ్రాయమని నాకిచ్చారు. నేను బాబాకు, గురువుగారికి ఉత్తరం వ్రాసే రీతిలో మొదలుపెట్టి వ్రాయబోతున్నాను. ఆ పేపరు పైనంతా దేవతల బొమ్మలు కనిపిస్తున్నాయి. నాకు గురువుగారు కనిపించినప్పటి నుండి గురువుగారి పాప మా ప్రక్కనే ఉన్నట్లుంది. నేను గురువుగారు చెప్పినట్లు ఉత్తరం వ్రాయడానికి ఆ పాపే నాకు పెన్ను, ఆ పేపరు క్రింద ఒత్తు పెట్టుకోవడానికి ఇచ్చి సహాయపడ్డారు. గురువుగారు స్వప్నంలో చెప్పినట్లుగానే నేను ఆ మరునాడు ఉత్తరం వ్రాసుకొన్నాను. అలా ఉత్తరం వ్రాసుకున్న పదిహేను ఇరవై రోజులకి ఆ కోరిక తీరింది.

## నన్ను కాపాడారు

**వి. సుజాత, తిరుపతి.**

నవంబర్ 17న మహాసమాధి కార్యక్రమం ముగిసిన తరువాత సాయంత్రం గురువుగారి గురించి ఇంగ్లీషులో (ట్రిబ్యూట్ టు శ్రీబాబూజీ) చదివారు. అది నాకు అర్థంకాలేదు. రూమ్‌కెళ్ళి స్నానం చేసేసరికి, అప్పటికే ఒంట్లో బాగలేనందువలన చలి ఎక్కువైంది. ఫిట్స్ వస్తాయని భయపడ్డాను. చలికి నేను చచ్చిపోతాను అనిపించింది. ఎవరికైనా ఫోన్ చేసి చెబుదామన్న ఆలోచన రాలేదు. అప్పుడు తోటి గురుబంధువు సుజాత చివరిసారిగా గురువుగారితో తాకించిన ఊదీ నాకిచ్చిన విషయం గుర్తుకు వచ్చింది. దాన్ని నీళ్ళలో వేసుకుని త్రాగి, 'నేను ఈ బాధపడలేను. నాకు ఐదునిమిషాలలో తగ్గించండి లేకుంటే చంపేసెయ్యండి' అని గురువుగారికి మనస్సులో ప్రార్థించుకుని పడుకున్నాను. కొంతసేపటికి గురుబంధువు రాజ్‌మోహన్ వచ్చి తలుపు తట్టాడు. నేను లేచి తలుపు తీయగలిగాను. గురువుగారు అలా నన్ను కాపాడారు. నిజంగా నాకు చాలా సంతోషం కలిగింది. మరుసటి రాత్రి గురువుగారి సమాధి దగ్గర జరుగుతున్న పనిలో తెల్లవార్లు నిద్రలేకుండా పాల్గొన్నాను. ఆ రాత్రి చాలా చలిగా వుంది. నాకు రాత్రి 12 గంటలకు ఒకసారి టీ ఇచ్చారు. త్రాగాను. కాని తెల్లవారుఝామున చలిగా ఉండటంతో, గురువుగారి సమాధి దగ్గర 'నాకు టీ కావాలి' అని వేడుకొని, బయట గేటు దగ్గర రాగానే సరిగ్గా అప్పుడే ఇద్దరు అబ్బాయిలు 'టీ' క్యాన్ తెస్తూ కనిపించారు. ఇలా అడిగాను–అలా ఇచ్చారు గురువుగారు. ఇది నాకు ఎన్నటికీ మర్చిపోలేని అనుభవం.



## మనతోనే ఉన్నారు

లక్ష్మి, నెల్లూరు.

పూజ్యశ్రీ గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ మహాసమాధి విషయం తెలిసిన వెంటనే తోటి గురుబంధువులతో శిరిడీ వచ్చి గురువుగారిని చివరిసారిగా దర్శనం చేసుకున్నాను. శిరిడీకి గురువుగారి పార్థివదేహం చేరుకొన్నప్పుడు గురువుగారి వెంట అందరం శిరిడీ ప్రదక్షిణ చేసుకొన్నాము. అప్పుడు గురువుగారిని అక్టోబర్‌లో చెన్నైలో దర్శనం చేసుకొనే అవకాశం ఉన్నా దురదృష్టవశాత్తూ వెళ్ళలేకపోయినందుకు నేను పొందిన బాధ వర్ణనాతీతం. సమాధి తరువాత గురువుగారు స్వప్నములోనైనా కనబడితే బాగుండునని అనుకొనేదాన్ని. అప్పుడు ఒక రాత్రి స్వప్నంలో మహాసమాధి నాడు మాదిరిగానే గురువుగారి వ్యాను వెంట నేను నడుస్తున్నాను. ఉన్నట్టుండి గురువుగారు వ్యాను దిగి వస్తున్నారు. నేను పట్టరాని సంతోషముతో "గురువుగారు లేచేసారు, గురువుగారు లేచేసారు" అని ఆనందముతో కేకలేస్తున్నాను. ఆ విధంగా స్వప్నములో నాకు దర్శనమిచ్చి నాకు మనశ్శాంతి కలిగించారు ఆ దయామయులు.

## సాక్షాత్తూ భగవంతుడు

సురేష్, బోధన్.

ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో లేక ఋణానుబంధమో తెలియదు కాని ఈ జన్మలో సాక్షాత్తూ భగవంతుని దర్శనము, సన్నిధి భాగ్యము లభించింది. "నామాటల అర్థం మీకు సరిగా బోధపడటంలేదు" అన్న బాబానే తమ మాటలకు అర్థం వివరించడానికి, తనదైన మార్గము చూపడానికి శ్రీసాయినాథుని శరత్‌బాబూజీగా తిరిగి భువిపై అవతరించారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈరోజు మన అందరికీ జరుగుచున్న లీలలు, మనం పొందుతున్న ఆనందం, శాంతి అందుకు నిదర్శనం.

నేను రెండుసార్లు గురువుగారి దర్శనం చేసుకున్నాను. రెండవసారి దర్శనం తరువాత గురువుగారిని తిరిగి కలుసుకోలేను అన్న భావన కలిగింది. కాని గురువుగారు తమ చివరి దర్శనానికి నన్ను తీసుకువెళ్ళిన విధానం చూసి నా రక్షకుడు నాతో ఉన్నాడు అనే సంతోషం శాశ్వతంగా ఉండిపోయింది.

గురువుగారు మహాసమాధి చెందిన విషయం నా గురుబంధువులకు తెలియగానే వారు బాధతో, హడావుడిగా నాకు చెప్పకుండా వెళ్ళిపోయారు. మరుసటి రోజు శిరిడీ నుండి నాకు ఫోన్ చేసి ఆ విషయం చెప్పడంతో, నేనెంతో బాధకు లోనయ్యాను. నన్ను కూడా వీలు చేసుకుని శిరిడీ రమ్మని చెప్పారు. కాని ఒంటరిగా శిరిడీ రావడానికి అంతగా రూట్ తెలియదు అని వారితో చెప్పడంతో, ఫర్వాలేదు మన మురళి వస్తున్నాడు, అతనితో కలసి రమ్మని చెప్పారు. తరువాత నేను, మురళి బయలుదేరుదాం అనుకొన్నాము. మరుసటి రోజు తీరా బయలుదేరాలనుకున్న సమయానికి మురళి ఫోన్ చేసి నాకు అత్యవసర పని వుండి రాలేక పోతున్నాను అని చెప్పడంతో, నేను కూడా ఆగిపోవలసివచ్చింది. పోలేకపోయినందుకు నాలో బాధ అంతకంతకు ఎక్కువయింది. అయితే నేను ఆగిపోయిన విషయం ఎవరికీ చెప్పలేదు. నేను శిరిడీ వస్తున్నాననే నా ఫ్రెండ్స్ అనుకున్నారు. కానీ నా పరిస్థితి వారికి తెలియదు. నేను వెళ్ళడానికి తోడు లేరు, నాకేమో రూట్ తెలియదు ఎట్లాగా అని బాధపడుతూ పడుకున్నాను. సుమారు రాత్రి 2.30గం.ల సమయంలో నాకు ఫోన్ వచ్చింది. 'నేను భానుని మాట్లాడుతున్నాను. మరో 5ని॥లలో మీ ఇంటి ముందుకు



వెహికల్ వస్తుంది. నీవు శిరిడీకి వస్తావా?' అని అడిగారు. ఎవరు పిలుస్తారా అని చూస్తున్న నాకు ఆశ్చర్యంతో పాటు ఆనందం కలిగింది. నేను ఇంటివద్ద ఉన్న విషయం ఎవరికీ తెలియదు, పైగా నా గురుబంధువులు నేను శిరిడీకి బయలుదేరాను అనుకొంటున్నారు. అటువంటి పరిస్థితిలో, పైగా అర్ధరాత్రి ఫోన్ చేసి శిరిడీ వస్తావా అని అడిగేసరికి– వీరికి నేను ఇంటివద్ద వున్నది ఎలా తెలుసు? అని ఆశ్చర్యమేసింది. మొత్తంమీద వెహికల్‌లో శిరిడీ బయలుదేరాను. ఆ సంతోషంలో ఇంట్లోవారికి కూడా నేను వెళుతున్నది చెప్పలేదు. నాందేడు దాటిన తరువాత ఫోన్ చేసి శిరిడీ వెళుతున్నానని చెప్పాను.

నాకు ఫోన్ చేసిన భానును 'నాకు ఫోన్ చేయాలి అని మీకు ఎందుకనిపించింది?' అని అడిగాను. దానికి భాను, అప్పుడు మాతో పాటు వస్తున్న మధుకు, శిరిడీ నుండి శివ ఫోన్ చేసి, మీతో సురేష్‌ని కూడా తీసుకొని రమ్మన్నాడని చెప్పాడు. ఆ తరువాత ఉదయం శివ ఫోన్ చేసినప్పుడు 'నేను మురళితో వస్తున్న విషయం చెప్పాను కదా, మరి మధును ఎందుకు తీసుకురమ్మన్నావు?' అని అడిగాను. దానికి శివ 'నిజమే. సోమవారం ఉదయం నీకు ఫోన్ చేసిన తర్వాత కరీంనగర్‌లో వున్న వారికి మధ్యాహ్నం ఫోన్ చేసాను. వాళ్ళని ఎలా వస్తారని అడిగి, నాకు తెలియకుండానే నిన్ను (సురేష్) తీసుకురమ్మని చెప్పాను. అయితే, మురళితో కలసి రావలసిన నీవు ఆగిపోయావన్న విషయం నాకు తెలియదు. దానిని ముందే తెలిసిన గురువుగారు నాతో అలా చెప్పించి వుంటారు' అని శివ అనేసరికి– గురువుగారికి నాపై వున్న ప్రేమకు ఆనందం వేసింది. తర్వాత భాను 'రాత్రి నీకు ఒకసారి ఫోన్ చేసాను. నీవు ఫోన్ లిఫ్ట్ చేయకపోయేసరికి ఇంకొకసారి ప్రయత్నిద్దామని మళ్ళీ ఫోన్ చేయగా, నీవు లిఫ్ట్ చేయడమనేది కూడా గురువుగారి అనుగ్రహమే' అన్నాడు. గురువుగారి ప్రేమ ఎలా ఉంటుందో అనుభవమై, ఎప్పటికీ ఆయన పాదాలవద్ద ఉండిపోవాలి అనిపించి, చాలా ఆనందమేసింది. వారి పట్ల ఎంతో ప్రేమ కలిగింది. మా వెహికల్ ప్రాబ్లెమ్ వల్ల మేము శిరిడీకి నవంబర్16, 2010 సాయంత్రం చేరుకొన్నాము. ఎక్కడా ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెళ్ళి 'క్యూ'లో నిలబడి రాత్రి గురువుగారి దర్శనం చేసుకొన్నాము. నేను రాలేకపోయినా కూడా 'నా బిడ్డను నేను పిలుచుకుంటాను' అన్నవిధంగా గురుదేవులు నేను శిరిడీకి వచ్చి వారి దర్శనం చేసుకొనేలా అనుగ్రహించారు.

## ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి

షర్మిల, విజయవాడ.

గురువుగారు మహాసమాధి చెందారని తెలిసి నేను, మా అబ్బాయి విజయవాడ నుండి బస్‌లో బయలుదేరి, సోమవారం మేము శిరిడీకి వచ్చాము. ముఖ్యమైన పని ఉండడంవల్ల మంగళవారమే మేము రిటర్న్ టికెట్స్ తీసుకున్నాము. గురువుగారిని మంగళవారం మధ్యాహ్నం 4.30గం.లకు తీసుకుని వచ్చారు. వెంటనే మేము గురువుగారి దర్శనం కోసం 'క్యూ'లో నిల్చున్నాము. మా అబ్బాయి ఆ జనంలో కనపడలేదు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. మాకు ట్రైన్ టైమ్ అవుతోంది. మా అబ్బాయి కొద్దిసేపటి తరువాత కనిపించాడు. 'లైన్ లోకి రా, ట్రైన్ టైమ్ అవుతుంది' అని అన్నాను. అయినా సరే రాలేదు. నేను గురువుగారి దర్శనం చేసుకుంటానులే అన్నాడు. అప్పుడు నేను 'గురువుగారూ! ఇప్పటివరకు మా అబ్బాయికి మీ దర్శనం కాలేదు. ఇప్పుడైనా మీ దర్శనం ఇప్పించండి' అని ప్రార్థించాను. సాయంత్రం 5.30గం.లకు గురువుగారిని దర్శించుకొని, రూమ్‌కి వెళ్ళి లగేజ్ సర్దుకొన్నాను. అక్కడ గురుబంధువులు వుంటే వాళ్ళని లగేజ్ చూడమని చెప్పి, మా అబ్బాయిని తీసుకుని రావటానికి 'సాయియానా'కి పరిగెత్తుకుంటూ వెళ్ళాను. మా అబ్బాయికి గురువుగారి దర్శనం ఇంక



లేదు, టైమ్ అయిపోయిందని అనుకున్నాను. అప్పటికి 5.50గం.లు అయింది. నేను పరుగెత్తుకుని వెళుతుంటే మా అబ్బాయి నిదానంగా నడుచుకుంటూ వస్తున్నాడు. 'అమ్మా! నేను గురువుగారిని చూసాను. నన్ను హరి అంకుల్ పంపించారు' అని అన్నాడు. అప్పటివరకు నేను పడిన టెన్షన్ అంతా ఇంతాకాదు. మహాసమాధి చెందిన తరువాత కూడా గురువుగారు మన కోరికలు తీరుస్తూనే వున్నారనడానికి నిదర్శనమిది.

గురువుగారు మహాసమాధి అనంతరం, నాకు వరుసగా నాలుగురోజులు కలలో దర్శనమిచ్చారు. మళ్ళీ ఇంకొక రోజు కలలో గురువుగారు మా ఇంటికి వచ్చారు. నేను 'గురువుగారూ! నాకు మీ ఆశీస్సులు కావాలి' అని అంటే "నా ఆశీస్సులు ఎప్పుడూ మీకు ఉంటాయి అమ్మా" అన్నారు గురువుగారు. తరువాత "నువ్వు పప్పుపొంగలి బాగా చేస్తావు, నాకు కొంచెం పెట్టమ్మా" అని అన్నారు. నేను పొంగలి పెట్టిన తరువాత తిని, గురువుగారు వెళ్ళి మా అబ్బాయి వెంకటేష్ ప్రక్కన పడుకున్నారు. అలా దర్శనమిచ్చి అనుగ్రహిస్తూనే వున్నారు.

## గమ్యానికి చేరుస్తాను

ఎ. స్నేహిత, చెన్నై.

గురువుగారు మహాసమాధి చెందిన వారంరోజులకి నాకు ఒక కల వచ్చింది. ఆ కలలో నేను, మమ్మీ కారులో వెళ్తుంటే కారు ఒక కరెంటు స్తంభానికి గుద్దుకుంది. వెంటనే డ్రైవర్ కనిపించలేదు. గురువుగారు అక్కడకి వచ్చి నన్ను నడిపించుకుంటూ "నిన్ను అట్లా మధ్యలో వదలివేయను. నీ గమ్యానికి నిన్ను చేరుస్తాను" అని అన్నారు. తర్వాత గురువుగారు, నేను ఒక సత్సంగహాలులోకి వెళ్ళాము. అక్కడ గురువుగారు నాకు కంప్యూటర్‌లో ఆర్ట్స్‌కి సంబంధించి ఏమి వచ్చని అడిగారు. అప్పుడు నేను నాకు వచ్చినవి చెప్పాను. అక్కడ ప్రక్కనున్న గురుబంధువుకు చెప్పి ఏదో ఒక పని ఇప్పించారు. నేను అది చేయగలనని చెప్పాను.

ఆ తరువాత గురువుగారు తెనాలిలోని మా ఇంట్లో కనిపించారు. అక్కడ నేను, మా డాడీ, మమ్మీ ఇంకొంతమంది గురుబంధువులు ఉన్నారు. డాడీతో గురువుగారు, "నీ ఫోన్ చాలా పాతది. మార్చవచ్చు కదయ్యా" అని ప్రక్కరూమ్‌లోకి వెళ్ళారు. అప్పుడు మమ్మీ, డాడీతో 'గురువుగారిని క్రొత్త ఫోన్ కొనడానికి ఆశీస్సులు అడగండి' అని అడిగింది. దానికి డాడీ 'ఈ టైమ్‌లోనా, అందరూ గురువుగారు మహాసమాధి అయ్యారని చాలా బాధగా ఉంటే ఇప్పుడు గురువుగారిని ఫోన్ కొంటానని ఎట్లా అడుగుతాను' అని అన్నారు. గురువుగారు రూమ్‌లో నుంచి బయటకు వచ్చారు. అందరం గురువుగారికి నమస్కారం చేసుకున్నాము. ఈవిధంగా గురువుగారు మహాసమాధి చెందినప్పటికీ ఆయన భౌతికంగా ఉన్నట్లుగానే మా కుటుంబంలోని అందరికీ దర్శనం ఇచ్చారు.

నాకు 4సం॥ల వయస్సు ఉన్నప్పుడు నేను మా డాడీతో జనవరి1న తిరువణ్ణామలైలో గురువుగారి దర్శనం చేసుకున్నాను. అప్పుడు గురువుగారితో 'శరత్‌బాబూ! మా ఇంటికి మళ్ళీ రండి' అని అడిగానట. అప్పుడు గురువుగారు "సరే" అన్నారట. దానికి నిదర్శనంగా గురువుగారు మహాసమాధి అయిన తర్వాత తెనాలిలో ఉన్న మా ఇంటికి వచ్చినట్లు స్వప్నానుభవాన్ని ఇచ్చారు. గురువుగారితో మాకున్న అనుబంధం మరపురానిది.



# చెప్పినట్లు నడుచుకోవడం లేదు

**విద్య, నార్త్‌కరోలినా, యు.ఎస్.ఎ.**

నాకు జనవరి 1, 2011 రాత్రి గురువుగారు స్వప్నంలో దర్శనం ఇచ్చారు. ఆ స్వప్నంలో, 'గురువుగారి దర్శనం ఇక ఉండదు' అని ముందే చెప్పారు. కానీ ఏదో ఆశతో వేచి చూస్తున్నాము. ఆశ్చర్యంగా, గురువుగారు 'సాయియానా'కి ఎప్పటిలాగే దర్శనం ఇవ్వడానికి వచ్చారు. గురువుగారి పాదాలు తాకవద్దు అని అందరికీ చెప్పారు. అయినా వీలైనప్పుడల్లా అంతా పాదనమస్కారం చేసుకుంటున్నప్పటికీ, గురువుగారు ఎవరినీ ఏమీ అనక స్టేజ్ ఎక్కి బాబాకి నమస్కారం చేసుకున్నారు. ఆ తర్వాత గురువుగారు ముందున్న మైక్ దగ్గరకు వచ్చారు. సత్సంగమో ఏంటో అని అనుకునేలోపే... *"ఇంక నేను ఈ దర్శనాలు ఇవ్వను. ఎందుకంటే మీరు ఎవ్వరూ నేను చెప్పింది ఫాలో కావటంలేదు"* అని అన్నారు. అంతా ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయారు. గురువుగారు ఆ అనౌన్స్‌మెంట్ చేసి అలా గురుచరణ్ వైపు పయనమయ్యారు. న్యూఇయర్ రోజున స్వప్నదర్శనం ప్రసాదించారు అని ఓ వైపు సంతోషపడితే., బాబా పథంలో, గురువుగారు చెప్పిన విధంగా ఇంకా సరిగా ఫాలో కావటంలేదు అని మరోవైపు బాధ వేసింది. బాబా, గురువుగారు నాకు ఈ స్వప్నదర్శనంతో– 'బాబా పథంలో గురువుగారికి ఇష్టమైన విధంగా నడుచుకోవాలి' అని మరలా ఒకసారి గుర్తుచేసారు.

# అద్భుతం

**బి. వరలక్ష్మి, శింగరాయకొండ.**

నేను ఈ సంవత్సరం (2010) సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో చేరాను. మొదట్లో గురువుగారంటే ఎవరో తెలియదు. అనుకోకుండా దైవకృప వలన నేను గురువుగారి గురించి తెలుసుకోగలిగాను. నా చుట్టూ వున్నవారు గురువుగారి గురించి చెబుతూ, వారి అనుభవాలను తెలియజేస్తూ వుంటే ఇవన్నీ నిజంగా జరిగాయా! ఈరోజుల్లో కూడా ఇటువంటి వాటిని నమ్మవచ్చా! అనే ఒకింత అనుమానం నా మనసులో మెదిలేది. ఈ విషయాలన్నీ కూడా మా కుటుంబసభ్యులతో చర్చించేదాన్ని. అయితే ఏది ఏమయినప్పటికీ మా కుటుంబసభ్యులందరితో కలసి గురువుగారిని దర్శించుకోవాలనుకున్నాను.

నవంబరు 13వ తేదీన గురువుగారు మహాసమాధి చెందారనే పిడుగులాంటి వార్త తెలిసింది. అది వినగానే గురుబంధువులందరూ శోకసంద్రంలో మునిగిపోయారు. నేను గురువుగారిని చూడలేకపోయానే అని నాకు చాలా బాధ కలిగింది. మామూలుగానే స్కూల్‌లో మా పనులు మేము నిర్వర్తిస్తుండగా గురువుగారిని చివరగా దర్శించలేని మాలాంటి వారందరికీ గురువుగారి అంతిమ యాత్రను దృశ్యరూపంలో చూపెట్టారు. ఆ సందర్భంలో ఒక గురుబంధువు 'ఏ ఇద్దరు భక్తులు ఒకచోట చేరి బాబా గురించి మాట్లాడుకుంటూ వుంటే మూడోవ్యక్తిగా వారి మధ్యకు గురువుగారు వస్తారు' అని ఒకసారి గురువుగారే చెప్పారని తెలిపారు. ఈ మాటలు ఎందుకో నా మనసులో నాటుకుపోయాయి. ఇంటివద్దకు వెళ్ళి ఈ విషయం చెప్పాను. అయినప్పటికీ గురువుగారు ఎందుకు వస్తారు అనే అనుమానం నాలో ఉంది.

ఆ రోజు ఆదివారం నవంబరు 21. కార్తీక పౌర్ణమి సందర్భంగా మా కుటుంబసభ్యులతో పాటు మరో ఏడు కుటుంబాల వారందరం కలసి 'పాకల' సముద్రతీరానికి వెళ్ళాం. ఆ రోజు పౌర్ణమి కావడంతో అక్కడ అంతా జనంతో నిండిపోయి వుంది.



మేము కూడా జట్లుగా ఏర్పడి కార్తీక స్నానమాచరిస్తూ బాబా గురించి మాట్లాడుకుంటున్నాము. ఇంతలో మా అమ్మ ఏడుస్తూ మావైపుకు వచ్చింది. విషయం కనుక్కోగా, మా బాబు మా అమ్మ చేయి పట్టుకోగా చేతికి వున్న బంగారు గాజు జారి అలలో కొట్టుకుపోయింది అని బాధపడుతూ చెప్పింది. అది విన్న నేను అయ్యో, బాబా ఎందుకిలా జరిగింది? అనుకుంటూ, 'ఏ ఇద్దరు బాబా గురించి మాట్లాడుకుంటున్నా మూడో వ్యక్తిగా గురువుగారు వస్తార'నేది అంతా అబద్ధం అని మా అమ్మతో అంటుండగానే ఇంతలో ఏమయిందో తెలియదు. అప్పటికే మోకాలి లోతువరకు నీటిలో వున్న నేను ఎవరో ప్రేరేపించినట్లుగా మరో నాలుగు అడుగులు ముందుకెళ్ళి ఎటువంటి వెదికే ప్రయత్నం చేయకుండానే మామూలుగా అప్రయత్నంగా చాలా సహజంగా కంటికి కనిపిస్తున్నట్టుగా నీటిలో వున్న గాజును తీసి అందరి సమక్షంలో 'అమ్మా! ఇదిగో నీ గాజు' అని మా అమ్మగారి చేతికి ఇస్తే అందరూ ఆశ్చర్యపోయారు. అయితే ఇదెలా సాధ్యం! అని చుట్టూ ఉన్నవారు వారిలో వారు అనుకొన్నారు. అంత లోతు నీటిలో అలలో కొట్టుకుపోయిన గాజు, అందులోనూ తేలేది కాదు, అడుగున ఇసుకలో కూరుకుపోయే వస్తువు. దానిని నేను తీసివ్వడం, అది కూడా మేము వున్న వైపు నుండి మరో వైపుకి వెళ్ళి తీయడం నిజంగా అద్భుతం! అని అక్కడున్నవారు అంటుంటే అప్పుడనిపించింది – గురువుగారు ఇక్కడే వున్నారు, మన చుట్టూనే వున్నారు అని. పిలిస్తే పలికే దైవం "గురువుగారు".

## ని'దర్శనం'

అట్ల చెంచయ్య, వెంకటగిరి.

సాయిపథంలో మొదటిసారి జూలై 2000లో గురువుగారి దర్శనం చేసుకొన్నాను. అప్పటినుండి ప్రతి సంవత్సరం శిరిడీలోగాని, తిరువణ్ణామలైలోగాని గురువుగారి దర్శనం చేసుకొంటూ ఉన్నాను. గురువుగారు భౌతికంగా ఇక లేరంటే చాలా బాధ వేస్తుంది. రోజూ గురువుగారి గురించి తలచుకొన్నప్పుడల్లా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. నేను మా అమ్మ, నాన్న చనిపోయినప్పుడు కూడా ఇంత బాధపడలేదు. పూజ్య గురుదేవులు నవంబరు13, 2010న మహాసమాధి చెందిన వారంరోజుల తర్వాత తిరువణ్ణామలైలో, స్వప్నంలో నవ్వుతూ దర్శనమిచ్చి నా మనసుకు సాంత్వన కలిగించారు.

## విడదీయరాని సద్గురు బంధం

బి. నాగరాజు, బోధన్.

గురువుగారు మహాసమాధి చెందిన విషయం నన్ను ఎంతో బాధకు గురిచేసింది. ఎటువంటి పరిస్థితిలోనూ కంటతడిపెట్టని నేను గురువుగారు సమాధి చెందారన్న విషయం తెలిసి రూమ్‌లో ఉన్న గురువుగారి ఫోటో గుండెకు హత్తుకొని ఏకధాటిగా ఏడ్చాను. గురువుగారిని శిరిడీకి ఎప్పుడు తీసుకువస్తారో తెలియదు. కాని నాలో గురువుగారిని చూడాలని ఒకటే తపన. అయితే నా భార్య 7 నెలల గర్భవతి. ఆమెకు తోడు కావాలి. నేను తప్ప ఆమెకు తోడు ఉండడానికి ఎవరూ అందుబాటులో లేరు. అప్పుడు ప్రక్కింటివాళ్ళు కూడా లేరు. నేను శిరిడీ రావాలని వారిని దర్శించుకోవాలని గురువుగారిని ప్రార్థిస్తూనే



ఉన్నాను. అలా 14వ తేదీ ముగిసింది. అప్పటికి గురువుగారు శిరిడీకి ఇంకా రాలేదన్న విషయం తెలిసింది. వెళ్ళాలన్న పట్టుదల ఇంకా పెరిగి రెండు రోజులు సెలవు కావాలని ఆఫీస్‌లో అడిగాను. పని ఉందని చెప్పి సెలవు కుదరదన్నారు. 15వ తేదీ ఉదయం ఒక దినపత్రికలో గురువుగారు మహాసమాధి చెందారన్న విషయాన్ని ఫోటోతో సహా వేశారు. అది చదివి మా బ్రాంచ్ మేనేజర్ నన్ను పిలిచి 'నాగరాజూ! ఇది నువ్వు చెప్పిన మీ గురువుగారి ఫోటోనే కదా!' అని అడిగి, 'కాని ఇందులో శిరిడీ సాయిపథంలో 15వ తేదీ మహాసమాధి అని చెప్పారు కదా! మరి నువ్వు ఎలా వెళ్ళగలవు?' అని అడిగారు. 'సార్, మా గురుబంధువులను అడిగాను. 16వ తేదీ ఉదయం గురువుగారిని తీసుకువస్తున్నారని చెప్పార'ని అన్నాను. ఆ రోజు పని పూర్తి చేసుకొని రెండు రోజులు లీవ్ పెట్టి బయలుదేరాను. నువ్వు ప్రయాణం చేయడం కష్టమని చెప్పినా వినకుండా, 'అంతా గురువుగారు చూసుకుంటారు' అని చెప్పి నా భార్య కూడా నాతో బయలుదేరింది. శిరిడీలో వున్న గురుబంధువు శివకు ఫోన్ చేసి మా ప్రయాణంలో ఏ ఇబ్బందీ కలగకుండా ఉండాలని బాబాకు, గురువుగారికి మా తరఫున ప్రార్థించమని చెప్పి బయలుదేరాము.

ఆ రోజు సాయంత్రం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్ళేసరికి అజంతా ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాంపై ఉంది. కాని అందులో నిలబడటానికి కూడా చోటులేనంతగా క్రిక్కిరిసి ఉంది. నేను, సురేష్ అనే గురుబంధువు ఇద్దరం రిజర్వేషన్ కోసం చాలా ప్రయత్నించాము కానీ దొరకలేదు. ఒక టి.సి.తో నా పరిస్థితి చెబితే గర్భవతిని ఎందుకు తీసుకొచ్చావని చులకనగా మాట్లాడాడు. ఆ తరువాత టి.సి. దగ్గర ఎవరో పంజాబీవాళ్ళు తాము ఐదుగురికి టికెట్ తీసుకొన్నామని అందులో ఇద్దరు తిరుపతి వెళ్ళారని మాట్లాడుతున్నారు. అప్పుడే వారిని మేము కలసి మా పరిస్థితి వివరించాము. అప్పుడు వారు ఆ రెండు రిజర్వ్‌డ్ సీట్లు మాకిచ్చేశారు. అప్పుడు మాకు గురుదేవులు మమ్మల్ని ఒడిలో పెట్టుకొని తీసుకెళ్ళినంత ఆనందం కలిగింది. మాకు సీట్ ఇచ్చిన వాళ్ళు ఔరంగాబాద్‌లో దిగారు. మా దగ్గర ఒక్క రూపాయి కూడా అడగలేదు. తరువాత ఉదయం శిరిడీ చేరుకొని గురువుగారి భౌతికకాయాన్ని సమాధి చేసేంతవరకు అక్కడ ఉండే భాగ్యాన్ని గురువుగారే అనుగ్రహించారు. శిరిడీ వెళ్ళడానికి చాలారోజుల ముందు నుండి రిజర్వేషన్ కోసం ప్రయత్నం చేస్తాము. అలాంటిది మాకు రిజర్వేషన్ లేకపోయినా నా భార్య, నేను ఎటువంటి ఇబ్బంది కలగకుండా చివరిసారి వారి దర్శనానికి వెళ్ళగలగడం కేవలం గురువుగారి అనుగ్రహమే.

## మాట నిలుపుకొన్న మహిమాన్వితులు

అద్దంకి వెంకటేశ్వర్లు, తెనాలి.

ఈ సంవత్సరం (2010) విజయదశమి పర్వదినాన గురువుగారి దర్శనం చేసుకోవాలని మేము శిరిడీ వెళ్ళడానికి నిర్ణయించుకున్నాము. కాని వారు దసరాకు శిరిడీ రావడం లేదని తెలిసింది. అందుకని మా ప్రయాణం మానుకున్నాము. తరువాత గురువుగారు తిరువణ్ణామలైలో ఉన్నారని తెలిసి వారు చెన్నైకి తిరిగి వచ్చేటప్పుడయినా దర్శనం చేసుకోవచ్చని చెన్నైకి బయలుదేరాము. కాని ఆ ముందురోజు రాత్రే గురువుగారు చెన్నై వచ్చేసారట. ఆ తరువాత వారు మహాసమాధి చెందారనే విషయం తెలుసుకొని, చివరిగా వారి దర్శనం పొందలేనందుకు చాలా బాధపడినాను.

నవంబర్ 18న ఉదయం సుమారు 5గం॥ ప్రాంతంలో నేను మెలకువస్థితిలోనే ఉన్నప్పుడు నాకు "అద్దంకి వారిని బాగా చూసుకుంటాను" అన్న గురువుగారి మాటలు వినిపించాయి. నేను తలత్రిప్పి చూడగా గురువుగారు అక్కడ నిలబడివున్నారు.



రూమ్ తలుపులు అన్నీ వేసివున్నాయి. గురువుగారు లోపలికి ఎలా వచ్చారు అని ఆశ్చర్యపోయి తలుపువైపు చూసి మరలా ఇటు తిరిగేసరికి కనిపించలేదు. తలుపులు తీసి హాల్‌లోకి వచ్చాను. ఇది స్వప్నంకాదు. గురువుగారిని భౌతికంగానే చూసాను. లోగడ మేము గురువుగారిని మా ఇంటికి ఇంకొకసారి రమ్మని ఆహ్వానించాము. ఇందుకు నిదర్శనంగా గురువుగారు వారి దర్శనభాగ్యాన్ని మా ఇంట్లో ఇచ్చి వారి మాటను నిలుపుకున్నారు. మా కుటుంబం పట్ల వారికున్న అభిమానానికి కృతజ్ఞులం.

## సమాధి అనంతర లీలలు

### సాయినాథుని నారాయణరావు, శిరిడీ.

వైద్యులకే అంతుపట్టని వ్యాధులను స్మరణ మాత్రాన ఎందరికో నయం చేసారు గురువుగారు. బైపాస్ సర్జరీ అవసరం అని, వెంటనే చేయాలని, వైద్యులు నిర్ధారించినా– 'గురువుగారున్నారు మనకేంకాదు, వారికి చెబితే చాలు నయమైపోతుంది' అన్న నమ్మకంగల అనేకమంది గురుబంధువుల వ్యధలను తీర్చి రక్షించారు మన గురువుగారు. అందరినీ రక్షించగలిగిన శక్తిగల ఆయన తనను తాను రక్షించుకోలేరా? మహాత్ముల చర్యలు అగాధం. అనంతం. దేహాతీతులు, చైతన్యస్వరూపులైన మహాత్ములకు మరణమున్నదా? అటువంటి మహాత్మునికి హృదయసంబంధమైన రుగ్మత కలగటం, దానికొరకు జర్మనీలో అత్యంత ఆధునిక వసతులుగల ఆస్పత్రులు, నిపుణులైన వైద్యులున్నారని, అక్కడ చికిత్స చేయించుకుంటే బాగుంటుందన్న భక్తుల కోరికను మన్నించి, అది బాబా సంకల్పంగా భావించి గురువుగారు జర్మనీ వెళ్ళారు. అక్కడి వైద్యులు వారి శాయశక్తులా వైద్యం చేసారు. కాని, విశ్వచైతన్యమే తానైన బాబా సంకల్పం మరోలా ఉన్నప్పుడు మానవశక్తి ఏం చేయగలదు? భరద్వాజ మాష్టర్‌గారి జన్మదినము (తిథుల ప్రకారం), కోటి సోమవారం పర్వదినము అయిన నవంబర్ 13న గురువుగారు తమ భౌతికకాయాన్ని వీడి సాయిబాబాలో ఐక్యమయ్యారు. గురువుగారు దేహాన్ని త్యజించిన మరుక్షణం వారి ప్రభావం మరింతగా ప్రకటమయింది. వారి సమాధి అనంతరం కూడా మనందరమూ పొందుతున్న రక్షణ వారు ఆ దేహానికే పరిమితమై లేరు అనేది మరింతగా నిరూపిస్తున్నది.

అదేరోజు ఈ వార్త శిరిడీలో అందరికీ తెలిసిపోయింది. శిరిడీలో అక్టోబరునెలలో జరిగే బాబా మహాసమాధి ఉత్సవాల పిదప సాధారణంగా వర్షంరాదు. కానీ 13వ తేదీ రాత్రి శిరిడీలో విపరీతమైన గాలివాన వచ్చింది. అంత గాలి, అంత వాన శిరిడీ ప్రజలు ఎరుగరు. దీన్ని గమనించిన స్థానికులు గురువుగారి ఎడబాటుకు ప్రకృతి కూడా విపరీతంగా రోదిస్తుందని భావించారు. బాబాగారి దేహావసాన సమయంలో కూడా ఇదే విధమైన చిహ్నాలు గోచరించాయట.

గురువుగారి భౌతికకాయాన్ని శిరిడీకి తీసుకొని వచ్చిన రోజు రాత్రి 12గం॥ నుండి తెల్లవారుఝామున 5గం॥ వరకు చందమామలో ద్వారకామాయి బాబా కనిపించారట. అది గాంచిన శిరిడీ స్థానికులు గురువుగారు గొప్ప మహాత్ములు. వారి సమాధి చెంత ఎన్నో మహిమలు జరుగుతాయని అనుకున్నారు.

నవంబర్16, 2010న గురువుగారి భౌతికకాయం అంబులెన్స్‌లో 11.30గంటల ప్రాంతంలో శిరిడీ చేరుతుందని గురుబంధువులందరమూ శిరిడీ పోలీస్‌స్టేషన్ ముందున్న నాలుగురోడ్ల కూడలి వద్ద వేచివున్నాము. కాని ఎందుకో కొంత ఆలస్యమైపోయింది. ఇంతలో గుజరాత్ నుండి వచ్చే సాయిభక్తుల పాదయాత్రాబృందాలు ఎన్నో మాకు కనువిందు చేసాయి. పల్లకీలో బాబాను పెట్టుకుని ఊరేగిస్తూ సాయినామసంకీర్తన చేసుకొంటూ ఒక్కొక్క బృందం ఒక్కోవిధమైన వస్త్రధారణలో



ఒక బృందం తరువాత మరొక బృందం వెడుతుంటే ఆ దృశ్యం ఎంతో రమణీయంగా ఉంది. కొందరు బ్యాండుమేళాలతో బాబాను పల్లకీలో తీసుకెళ్తున్నారు. ఆ మనోహరమైన దృశ్యాలను వీక్షిస్తుంటే బాబా గురువుగారిని ఎంత వేడుకతో తన చెంతకు స్వాగతిస్తున్నారా అనిపించింది. పాదయాత్ర బృందాలన్నీ శిరిడీ చేరాక పూలతో అలంకరించబడిన గురువుగారి రథం కూడలికి చేరింది. అందరం సాయినామ సంకీర్తన ఆలపిస్తుండగా గురువుగారి దేహయాత్ర సమాధిమందిరం, ద్వారకామాయి, చావడిల మీదుగా హనుమాన్ మందిరం ముందు నుండి ఆశ్రమం చేరింది. శిరిడీ గ్రామస్థులు పలువురు గురువుగారికి హారతులు సమర్పించి తమ ప్రేమను వెలిబుచ్చారు. సాయిబాబా సంస్థాన్ వారు ఇచ్చిన ద్వారకామాయిలో బాబాకు వేసిన పూలమాలను గురువుగారి భౌతికకాయానికి అలంకరించారు.

బాబా హిందూ-ముస్లింల సమైక్యతను పరిరక్షించడం కోసంగా అవతరించారు. ఈనాడు పూజ్యగురుదేవుల పార్థివ శరీరం కార్తీకమాసం ఏకాదశి పర్వదినాన శిరిడీలో సమాధి చేయబడటం, అదే రోజు, ముస్లిం సోదరులకు పవిత్రమైన బక్రీదు కావటం ఎంతో విశేషం.

## సదా సద్గురు ఆశీస్సులు

సిహెచ్. లక్ష్మీకుమారి, గుంటూరు.

గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీగారు మహాసమాధికి రెండు నెలల ముందు నాకు కలలో కనిపించారు. ఆ కలలో- శ్రీసాయినాథుని శరత్‌బాబుగారు సమాధి చెందినట్టు, ఐస్‌బాక్స్‌లో పెట్టి తెచ్చినట్లు, నేడు చేసిన చోటే సమాధి చేసినట్టు కనిపించింది. ఆ విధంగా కల రావడంతో నాకు చాలా బాధ వేసింది. ఈవిషయం నా కుమారుడు సుధాకర్‌కు చెప్పాను. కలలో నీవు ఎవరినో చూసి ఉంటావులే అని మా అబ్బాయి కొట్టిపారేశాడు. కలలో గురువుగారు 'అందరూ యథావిధిగా శిరిడీ రమ్మని, నేను లేనని చింతించవద్దని, నేను లేకున్నా నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి' అని చెప్పారు.

## అడిగినంతనే అనుభవం

సిహెచ్. సావిత్రి, విజయవాడ.

శరత్‌బాబూజీగారు మహాసమాధి చెందారని తెలిసిన మరుదినం గురుబంధువులతో కలసి బస్సులో శిరిడీ వెళ్ళాను. అక్కడ నుండి ఆందోళన, బాధతోనే అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నాను. గురువుగారిని సమాధి చేస్తున్న సమయంలో గురువుగారు చిరునవ్వుతో నన్ను చూస్తున్నట్లు అనిపించింది. అప్పుడు నా మనస్సులో 'నేను ఎక్కడికీ వెళ్ళలేదు, మీ దగ్గరే ఉన్నాను' అని గురువుగారు అన్నట్లు నాకు భావన కలిగి, ఎంతో ప్రశాంతత కలిగింది. సమాధికార్యక్రమమంతా ముగిసిన మర్నాడు శిరిడీ నుండి విజయవాడకు బయలుదేరుతున్నప్పుడు గురువుగారి సమాధికి ప్రదక్షిణం చేసి నమస్కరించి నా మనస్సులో 'మీరు సశరీరులై ఉన్నప్పటికన్నా మరింతగా మీ అనుగ్రహాన్ని మాకు ప్రసాదించాల'ని కోరుకున్నాను. రూము నుండి



బయలుదేరినప్పుడు స్టేషన్‌కు ఎంతకీ ఆటోలు దొరకలేదు. అప్పుడు ఒక గురుబంధువు ఆటోలో నన్ను స్టేషన్‌కి పంపించారు. నేను స్టేషన్‌కి చేరే సమయానికి రైలు బయలుదేరుతూ కనపడింది. అప్పుడు ఎవరో ఒక వ్యక్తి వచ్చి నా చేతిలోవున్న సంచీని తీసుకొని లోపలికి వెళ్ళి స్టేషన్‌మాస్టర్‌కి చెప్పి బండిని స్లో చేయించి నన్ను బండి ఎక్కించారు. అది ఎ.సి.కంపార్ట్‌మెంట్. అక్కడ ఒక గురుబంధువు నాకు సహాయం చేసి నన్ను వేరే బోగీలో వున్న మా బంధువుల వద్దకు చేర్చారు. అప్పుడు గురువుగారే నా వెంట వుండి నన్ను బండి ఎక్కించి నా బంధువుల వద్దకు చేర్చినట్లు నాకు 'అనుభవం' కలిగింది.

## తీర్చిదిద్దారు

కె. గాయత్రి అనిల్, విజయవాడ.

నేను సత్సంగానికి వచ్చిన తొలిరోజుల్లోనే గురువుగారి గురించి– ఈయన ఒక సద్గురువు అని అందరూ చెబుతుంటే – సద్గురువు అంటే ఎవరు? సద్గురువు లక్షణాలు ఏమిటి? అని చాలాసార్లు ఆలోచించేదాన్ని. నాకు కలిగిన ఎన్నో అనుభవాలు "గురువుగారే నా దైవం" అని సగర్వంగా నేను చెప్పుకోగలిగేలా చేశాయి.

గురువుగారు చెప్పిన విధంగా ఉండాలని, శిరిడీకి వచ్చినప్పుడు, శిరిడీలో ఉన్నన్నిరోజులు మాత్రం ఏదైనా నియమంగా పాటించేదాన్ని. శిరిడీ నుండి వెళ్ళిన కొన్నిరోజుల వరకు టైమ్‌ని సరిగా ఉపయోగించుకునేదాన్ని. తర్వాత మామూలే. గురుదేవులు మహాసమాధి చెందారని తెలిసి, శిరిడీ వెళ్ళి ఆయన దర్శనం చేసుకున్నాను. ఆ తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది. గురువుగారి చివరి దర్శనం (భౌతికంగా) రోజున – ఇక నుండి ఎంత కష్టమైనా ఆయన చెప్పిన విధంగానే జీవించాలని, ఈసారి శిరిడీ నుండి వెళ్ళేలోపు నియమాలను ఖచ్చితంగా పాటించేలా నా మైండ్‌ని ట్యూన్ చేసుకొని వెళ్ళాలని దృఢంగా నిశ్చయించుకున్నాను. అందులో భాగంగా ఒకరోజు 12 గంటల పాటు గురువుగారి సన్నిధిలోనే ఉందామని అనుకున్నాను. కాని ఏ వర్క్ చేసుకోవాలో అర్థంకాక గురువుగారిని ప్రార్థించుకొని ఉదయం 8.30గం॥లకు గురుదేవుల సన్నిధికి చేరుకున్నాను. సత్సంగం 10 గంటలకు పూర్తయింది. ఆ తర్వాత ఏం చేయాలి అని ఆలోచిస్తుండగా ప్రసాద్ అంకుల్ వచ్చి 'గురువుగారికి పూలమాల కడతావా' అని అడిగారు. ఇంతవరకు శిరిడీలో బాబాకు, గురువుగారికి పూలమాల నేను ఎప్పుడూ కట్టలేదు. సరే, ప్రయత్నిద్దాం అని పూలమాల మొదలుపెట్టాను.

నేను మొదటిసారి కట్టడం వలన పూలమాల పూర్తిచేయడానికి ఐదు గంటల సమయం పట్టింది. ఈ వర్క్ చేసి, తర్వాత సాయంత్రం సత్సంగానికి హాల్ అంతా శుభ్రం చేయడం, సాయంత్రం సత్సంగంలో పాల్గొనడం ఇలా రాత్రి 9గం॥ల వరకు గురుదేవుల సన్నిధిలోనే గడిపాను. నాతో పాటు బాబా, గురుదేవులకు చాలామంది పూలమాలలు తయారుచేసారు. సాయంత్రం సత్సంగానికి అందరూ తయారుచేసిన పూలమాలలు బాబా, గురుదేవులకు అలంకరించారు. ఒక్క నేను చేసిన పూలమాలని తప్ప. నేను తయారుచేసిన పూలమాల వేస్తారేమోనని మర్నాడు వరకు ఎదురుచూస్తూ ఉన్నాను. కాని దానిని ఎక్కడా బాబాకు గాని, గురుదేవులకు గాని అలంకరించలేదు. ఇలా జరిగేసరికి ఏదో బాధ, నన్ను నేను మార్చుకునేదానికి చేసిన ప్రయత్నం ఫలించదేమోననే భయం, రకరకాల ఆలోచనలు మొదలయ్యాయి. పన్నెండు గంటలపాటు బాబా నామం చేసుకుంటూ చేసిన వర్క్ ఇలా వృథా అయిందని బాధ. ఆ రోజు అంతా దాని గురించే ఆలోచిస్తూ ఉన్నాను. నేను తయారుచేసిన పూలమాల బాబాకు, గురువుగారికి అలంకరించలేదే అనే బాధవున్నా, మరొక ప్రక్క అది అందరూ చేసిన పూలమాలల్లా అందంగా లేదని



తెలుసు. తర్వాత రోజు అంకుల్ దగ్గరకు వెళ్ళి, నేను ఈరోజు కూడా పూలమాల తయారుచేస్తాను, నాకు నేర్పించండి అని అడిగి జాగ్రత్తగా మాలకట్టాను. అదృష్టవశాత్తూ ఆ రోజు నేను చేసిన మాల గురువుగారికి అలంకరించబడింది. ఆ రోజు నుండి రోజూ పూలమాల తయారుచేయడానికి వెళ్తున్నాను. మొదటిరోజు చేసిన దానికంటే రెండవరోజు మరింత అందంగా వచ్చింది. మూడవరోజు అంతకంటే అందంగా వచ్చింది. ఇలా గురుదేవులకు రోజూ పూలమాల తయారుచేసి వేసుకునే భాగ్యం కలిగింది. ఇక్కడ జరిగిన మూడురోజులు గమనించుకుంటే నియమాన్ని పాటించడానికి ఏది అవసరమో దాన్ని నాకు గురువుగారు తెలియజేశారు. దోషరహితంగా పరిపూర్ణంగా ఒక పని చేయడమెలాగో నేర్పించారు.

మొదటిరోజు తయారుచేసిన మాల గురుదేవులకు వేసివుంటే నాలో ఆ బాధ, తపన కలిగివుండేవి కాదేమో. పూలమాల వేయకపోవడం వలన ఇంకా అందంగా తయారుచేయాలి అనే పట్టుదలతో తర్వాత రోజు నుండి పూలమాలని అందంగా కట్టడానికి ప్రయత్నించాను. ఒక పనిని పరిపూర్ణంగా చేస్తే, లేదా చేయడానికి ప్రయత్నిస్తే దాని వలన కలిగే ఆనందం నేను అనుభవించాను. ఆ ఆనందమే ఆ పనిని నియమంగా చేయడానికి కారణం అవుతుందని తెలుసుకున్నాను. అయితే నేను పన్నెండు గంటలపాటు పూజ్యగురుదేవుల సన్నిధిలో గడపాలని అనుకున్నప్పుడు గురుదేవులే పూలమాలలు కట్టే పని ఇచ్చారనేది నా అనుభవం.

గురుదేవుల పాత వీడియో ఏదైనా చూసినప్పుడు అందులో అందరూ గురువుగారికి పూలమాలలు వేస్తుంటే ఇప్పుడు వచ్చిన నాకు ఆ అదృష్టంలేదు అని అనుకునేదాన్ని. గురుదేవులు మహాసమాధి చెందినప్పుడు ఆయన దర్శనార్థం వెళ్ళినప్పుడు మొదటిసారిగా, చివరిసారిగా గురువుగారికి పూలమాల వేద్దామనుకొన్నాను. కాని నాకు సంతృప్తి కలిగించే విధంగా ఒక అందమైన మాల ఎక్కడా దొరకలేదు. చివరకు ఏదో ఒక పూలమాల తీసుకుని వచ్చి గురుదేవులకు వేస్తూ, నాచేతులతో పూలమాల చేసి మీకు ఒక్కసారైనా వేయలేకపోయాను అని బాధపడ్డాను. ఆ లోటుని గురువుగారు ఇలా తీర్చారు.

“కోరికలు తీర్చుటలో లేదు నిదానము. కోరికలు తీర్చి దిద్దుటయే శ్రీసాయి విధానము” అని చెప్పారు గురుదేవులు. ఆ ‘తీర్చిదిద్దట’మంటే – గురుదేవులు మనల్ని తీర్చిదిద్దే విధానము, ఈ అనుభవం ద్వారా మరొక్కసారి అనుభవమయింది.

గురుదేవులు ఇక లేరు అనే ఆలోచనే లేదు. వారు ఎల్లప్పుడూ మనల్ని బాబాకు మరింతగా దగ్గర చేస్తున్నారని, గురుదేవుల రక్షణ మనకు ఎప్పటికీ ఉంటుందని నా అనుభవం.

## అపారమైన ప్రేమ

బాబ్, యు.ఎస్.ఎ.

మా అమ్మాయి నేమీకి గురువుగారి సమాధికి సంబంధించి కొన్ని కలలు వచ్చాయి. మా అమ్మాయికి 10 సం॥లు. నేమీకి మొదట వచ్చిన కలలో, తనను స్కూల్ ఆఫీస్‌కి పిలిచారు. అక్కడ నేమీ వాళ్ళ అమ్మమ్మ, నాన్న ఉన్నారు. వాళ్ళని చూడగానే ఏమి జరిగిందో తెలియదు కానీ ఏదో విషాదసంఘటన జరిగినట్లు నేమీకి అనిపించింది. ఇంచుమించుగా గురువుగారు మహాసమాధి చెందే సమయంలో గురువుగారికి ఆరోగ్యం బాగాలేదని, సమాధి చెందుతారని నేమీకి కల వచ్చింది.

గురువుగారు సమాధి చెందిన తరువాత నేమీకి వచ్చిన ఇంకొక స్వప్నంలో– నేమీ ఒక ఆకులాగా ఉన్నది. ఒక మంత్రగత్తె తనని పట్టుకుని తన ఆధీనంలో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపించింది. భారతీయులు చాలామంది ఆ మంత్రగత్తెను



ఆరాధిస్తున్నారు. వాళ్ళందరూ ఆమె ఆధీనంలో ఉన్నారు కానీ నేమీని మాత్రం ఆమె పట్టుకోలేకపోయింది. నేమీని ఆ మంత్రగత్తె తరుముతుండగా, ఆకురూపంలో వున్న నేమీ ఒక నదిలో పడింది. పడగానే మనిషిగా మారి ఈత కొట్టడం ప్రారంభించింది. ఒడ్డున తన స్నేహితురాలు వసంతని మరియు సంగీతం టీచరు మిస్ గ్రూబెన్‌ను చూసింది. తను నదిలోనుంచి బయటకు రాగానే భారతదేశంలో ఏదో ఒక ప్రదేశంలో ఉన్నట్లనిపించింది. అక్కడ చుట్టూ చాలా ఇళ్ళు తెలుపురంగులో వున్నాయి. ఆ సమయంలో గురువుగారు వచ్చి తనని పొదివి పట్టుకోగా, తన తల గురువుగారి చేతుల్లో వాల్చింది. అప్పుడు తనలో ప్రేమవాహిని పరవళ్ళు త్రొక్కినట్లు నేమీకి అనిపించింది. గురువుగారు తనని చాలాసేపు అలా పట్టుకునే వున్నారు. వాళ్ళిద్దరూ అలాగే హొటల్ దాకా నడుస్తూ వెళ్ళారు. గురువుగారికి ఆరోగ్యం బాగాలేనందున నడిచేటప్పుడు గురువుగారికి నేమీ ఆసరా ఇచ్చింది. గురువుగారు ఉన్న హొటల్ ఒక్కటే ఊదారంగులో ఉంది. మిగతావన్నీ తెలుపురంగులో ఉన్నాయి. వాళ్ళు ఊదా రంగులో ఉన్న హొటల్‌కి చేరుకోగా అక్కడ నేను (బాబ్), శృతి మరియు అమ్మగారు ఎదురుచూస్తున్నారు. నేను (బాబ్) సహాయం చేయగా గురువుగారు మెట్లు ఎక్కి తమ గదికి వెళ్ళారు.

ఈ కలలన్నీ విశ్లేషించుకొంటే గురువుగారు సమాధి చెందే ముందు వారి అపారప్రేమను చవిచూపించి, తన రక్షణలోనే నేమీ ఉన్నదని తెలిపి, సమాధి చెందుతున్నట్లు ముందుగానే సూచనప్రాయంగా తెలియజేసారనే భావన కలిగింది.

## అద్భుతవాణి

### పి. దొరస్వామిరెడ్డి, చిత్తూరు.

నవంబరు 13, 2010 శనివారము మధ్యాహ్నం నేను లంచ్ తరువాత బయటకు వెళ్ళే సమయానికి నా భార్య హేమలత హాల్‌లోనే నేలమీద పడుకుని నిద్రపోతూవుంది. నేను నిద్ర డిస్టర్బ్ చెయ్యడం ఎందుకని ఆమెను లేపకుండా తలుపును ఊరకే మూసివెళ్ళాను. పనిమీద బయట ఉండగా నాకు ఫోన్ వచ్చింది. ఇంటి దగ్గరనుండి కాబట్టి ఫోన్ తీసాను. వేరే ఎవరైనా అయివుంటే ఫోన్ కట్ చేసి వుండేవాడిని. నా భార్య 'బా' అంటూ భోరున ఏడుస్తోంది. (నన్ను ఆమె 'బా' అని సంబోధిస్తుంది). నాకు ఏమైందో అర్థంకాలేదు. రకరకాల అనుమానాలంతా మనసులో మెదులుతూ వున్నాయి. నేను ఏమయిందో చెప్పమని టెన్షన్‌గా అడుగుతూ వున్నాను. ఆమె, 'మనకు ఇంక గురువుగారు ఎట్లా?' అని భోరున ఏడుస్తూ, నీవు మన్మోహన్‌కి ఫోన్ చెయ్యి అని చెప్పింది. నేను వెంటనే వస్తున్నానని చెప్పి, మన్మోహన్‌కి ఫోన్ చేసాను కానీ ఫోన్ కలవలేదు. కొంతమంది గురుబంధువులకి ఫోన్ చేయగా గురువుగారు జర్మనీలో మహాసమాధి చెందారని, వారిని శిరిడీకి తీసుకుని వస్తున్నారని తెలిసింది. నేను కంట తడిపెట్టుకుంటూ వేగంగా ఇంటికి వచ్చాను. త్వరగా రెండవ అంతస్తులో వున్న మా ఇంటికి వెళ్ళాను. నా భార్య బయట వరండాలో ఊడుస్తూ వుంది. నేను నా మనసులో ప్రక్క ఇంటివాళ్ళు ఆమెను ఓదార్చారేమో అని అనుకుంటూ, 'మన్మోహన్‌కి ఫోన్ చేస్తే కలవడం లేదని' ఆమెతో చెబుతూ నేరుగా పూజగది లోనికి వెళ్ళి గురువుగారి ఫోటోను పట్టుకుని భోరున ఏడ్చేసాను. వరండాలో వున్న నా భార్య పరుగెత్తుకువచ్చి నన్ను ఓదార్చడానికి ప్రయత్నించింది. కొంతసేపటికి మన్మోహన్ ఫోన్ చేసి విషయము చెప్పి పిల్లలను అందరినీ తీసుకుని తొందరగా శిరిడీ వచ్చేయండి అని చెప్పారు. మేము కొంతమంది గురుబంధువులకు, గురువుగారిని గూర్చి తెలిసినవాళ్ళకు ఫోన్ చేసి చెప్పాము. ఈలోగా చెన్నై నుంచి గురుబంధువులు రెండు బస్సులలో శిరిడీ బయలుదేరుతున్నారని తెలిసింది. ఆ బస్సుల కోసం వేలూరులో వెయిట్ చేస్తూ గురువుగారిని తలచుకుంటూ వారి అద్భుతాలను గురించి చర్చించుకుంటున్నాము.



ఇంతలో మాటల సందర్భంలో నా భార్య "మా వారు మన్మోహన్‌కి ఫోన్ చేస్తే కలవడం లేదని చెప్తూ ఇంట్లోని పూజగది లోనికి వెళ్ళి ఏడుస్తూ ఉన్నారు. మా వారికి గురువుగారి విషయం ఎవరు చెప్పారు?" అని కోమలగారిని అడిగింది. నేను నా భార్యతో, 'నీవే కదా నాకు ఏడుస్తూ ఫోన్ చేసి చెప్పింది' అన్నాను. ఆమె 'లేదు, నేను మీకు ఫోన్ చేయలేదు' అంది. ఇక మా ఆశ్చర్యానికి అవధులులేవు. నా శరీరము కంపించిపోయింది. నాకు ఫోన్ చేసి నా భార్య స్వరంతో మాట్లాడింది ఎవరో అర్థంకాలేదు. ఈ అనుభవమును గుర్తుంచుకుని గురువుగారి పాదాలు పట్టుకుంటే చాలు అనుకొన్నాము.

## స్వప్నదర్శనం

సుచిత్రాదేవి, హైదరాబాద్.

గురువుగారు జర్మనీకి వెళ్ళి ఉండగా వచ్చిన కల యిది. కలలో- గురువుగారు మంచంపై కూర్చునివున్నారు. నేను వెళ్ళి వారి పాదాలవద్ద కూర్చుని, ఏదో మాట్లాడుతుండగా మధ్యలో గురువుగారు లేచి ముందుగదిలోకో ఏమో వెళ్ళబోయారు. నేను వెనుకనే లేచి "సారీ అన్నా, నన్ను క్షమించు" అంటూ బ్రతిమాలుకోగా మళ్ళీ వచ్చి మంచంపై కూర్చున్నారు. నేను వారి రెండుపాదాలు పట్టుకుని నమస్కారం చేసుకొంటూ నా తలపై పెట్టుకున్నాను. ఆ పాదాల అరికాళ్ళు మృదువుగా, చాలా శుభ్రంగా అప్పుడే కడిగి తుడిచినట్లున్నాయి. నేను మనసులో "ఆహా, అన్న అరికాళ్ళు ఎంత బాగున్నాయి. కొద్దిగా కూడా దుమ్ము, మట్టి లేకుండా ఎంత తెల్లగా వున్నాయో" అనుకున్నాను. ఆ తర్వాత ప్రక్కకు వస్తే అమ్మగారు "సుచీ" అని పిలిచి ఏదో ఆప్యాయంగా చెప్పారు. శ్రుతిపాపేది? అని నేను అడిగితే, "అక్కడ ఎవరితోనో మాట్లాడుతుంది చూడు" అన్నారు. నేను వెళ్ళి పాపని దగ్గరకు తీసుకుని ఏదో మాట్లాడాను. ఈవిధంగా స్వప్నదర్శనమిచ్చి నన్ను ఆశీర్వదించారు.

## మరువలేని అనుభవం

కె. సుజాత, బోధన్ సత్సంగం, నిజామాబాద్ జిల్లా.

గురువుగారు బాబాలో ఐక్యమయ్యారని తెలిసి గురువుగారిని కడసారి దర్శించుకోవాలని శిరిడీ వెళ్ళాను. ఆ సమయంలో నేను ఎప్పటికీ మర్చిపోలేనటువంటి ప్రత్యేకమైన అనుభవం ప్రసాదించమని గురువుగారిని ప్రార్థించాను.

నవంబర్ 18, 2010 రాత్రి సమాధి ఎత్తు పెంచుతూ నిర్మాణం తలపెట్టారు. అందరం సాయినామం చెప్పుకుంటూ పని మొదలుపెట్టాము. నేను, ఇద్దరు మేస్త్రీలు, ఇంకొక సత్సంగ సభ్యుడు సంతోష్ కలిసి ప్లాస్టరింగ్ పనిచేస్తున్నాం. ఇంకా కొంతమంది మగవాళ్ళు కూడా ఆ పని చేస్తున్నారు. ఆడవాళ్ళు మాత్రం ఎవ్వరూ ఆ ప్లాస్టరింగ్ పనిలో నాతోపాటు పాల్గొనలేదు. నేను మాత్రం మేస్త్రీలతో కలిసి పనిచేశాను. చాలా పనులు ఒకరి తర్వాత ఒకరు చేస్తున్నారు. కాని, నేను చేస్తున్న పనికి మాత్రం ఎవరూ అడ్డు చెప్పలేదు, ఎవరూ షేర్ చేసుకోవడానికి ప్రయత్నించలేదు. ఆ పని రాత్రి 9.30గం.ల నుండి తెల్లవారుఝాము 5గం.ల దాకా జరిగింది. అంతసేపూ ఏమాత్రం అలసట అంటూ లేకుండా ఎంతో ఉత్సాహంగా చేస్తూనే వున్నాము. అన్ని



గంటలు ఎలా పనిచేసామో ఇప్పటికీ నమ్మశక్యంగా లేదు. ఇంతకు ముందెప్పుడు నాకు ప్లాస్టరింగ్ పని చేసిన అనుభవం లేదు. అయినా ఆ పనిని అంతసేపు అలా చేయగలగడం కేవలం గురువుగారి అనుగ్రహాశీస్సుల వలనే సాధ్యమయింది.

మరుసటిరోజు శుక్రవారం మధ్యాహ్నం అమ్మగారు సత్సంగహాల్‌కి వస్తున్నారని తెలిసింది. సత్సంగహాలులో అందరం కూర్చున్నాం. నా ప్రక్కన గురుబంధువులు 'రాత్రి మీరు సిమెంటుపని ఎంతో చక్కగా చేశారు, ఆశ్చర్యంగా అనిపించింది. మీరు మేస్త్రీ తాలూకానేమో అని అందుకే అంతబాగా వర్క్ చేస్తున్నారని అనుకుంటున్నాం. మీవారు ఏం చేస్తారు' అని అడిగారు. నాకు భలే ఆనందం వేసింది. ఆ పనిలో ఏమీ ప్రావీణ్యం లేకపోయినా దానిని అంత బాగా చేసే సామర్థ్యాన్ని గురువుగారే అనుగ్రహించారు. ఆ మహాత్ముని సమాధి నిర్మాణంలో పాలుపంచుకొని, ప్లాస్టరింగ్ పని చేసుకొనే భాగ్యాన్ని ప్రసాదించి, నాకు మరిచిపోలేని ప్రత్యేకమైన అనుభవం ఇచ్చారు. సమాధి అనంతరం కూడా మన ప్రార్థనలకు ప్రతిస్పందిస్తున్నారు. గురువుగారు శరీరానికే పరిమితమై లేరు.

## మనం ఆనందంగా ఉంటే ఆయన ఆనందిస్తారు

సాయికవి, నార్త్‌కరోలినా, యు.ఎస్.ఎ.

గురువుగారు నాకు సాక్షాత్తూ సాయిబాబానే. ఆ సాయిమావులి ఎంతో ప్రేమతో మనల్ని రక్షించి ఆనందజీవనం అందించడానికే గురువుగారి రూపంలో భువికి దిగి వచ్చారు. అటువంటి గురువుగారు దొరికిన నేను చాలా అదృష్టవంతురాలిని. ఎవరైనా ఇంతకంటే ఏమి కోరుకుంటారు?

గురువుగారు జర్మనీలో మహాసమాధి చెందారని తెలిసింది. ఇది నా జీవితంలో జరిగిన అత్యంత బాధాకరమైన విషయం. అటువంటి దురదృష్టమైన దినం తరువాత ఏమి చేయాలో తెలియని డిప్రెషన్‌లోకి వెళ్ళాను. గురువుగారితో నాకున్న అనుబంధం అలాంటిది. ప్రతిక్షణము నేను పడుతున్న బాధ చెప్పనలవి కాదు. గురువుగారు అంతకు ముందు నాకు చాలాసార్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా సంతోషంగా ఉండమని, అలా ఉంటే ఆయనకు సంతోషంగా ఉంటుందని చెప్పారు. ఇప్పుడింక నేను ఆనందంగా ఎలా ఉండగలను?

గురువుగారిని చూడాలని శిరిడీ చేరాను. జీవితంలో బాధలతో మనశ్శాంతి లేని నాకు గురువుగారు ఎంతో ప్రేమతో, ప్రీతితో శాంతిని ప్రసాదించారు. మానసిక సంఘర్షణ, బాధ నుండి ఆనందంగా ఉంటే ఎలా బయటపడతామో నేర్పించారు. ఎప్పుడూ ఆనందంగా ఉంటే మిగతాది నేను చూసుకుంటాను అని చెప్పేవారు. గురువుగారు నాతోనే ఉన్నారని నా మనస్సు చెప్తుంది. కానీ ఆయన దేహాన్ని సమాధి చేయడం కళ్ళారా చూసిన తర్వాత నేను డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయాను. ఈసారి నాకు ఎప్పుడూ కలిగే మనశ్శాంతి కలుగలేదు. అప్పుడు నేను ఆనందంగా లేకపోతే పరిపూర్ణమైన వ్యక్తిగా లేనని, ఆనందంగా ఉండటమనేది నా ఉనికికి ఎంత ముఖ్యమో తెలుసుకున్నాను. అది ఆయన అనుగ్రహమే. అంత బాధలోనూ ఎలాగో నార్త్‌కరోలినా లోని మా 'సాయినివాస్'కి చేరుకున్నాను.

డిసెంబర్13న ఆయన నాతోనే ఉన్నారనే విషయం నాకు తెలిసేట్లు చేయమని గురువుగారిని ప్రార్థిస్తూ వున్నాను. అది ఒక భావనగా కాకుండా నాకు భౌతికంగా నిదర్శనమిచ్చి, ఆ ప్రేమను పరిపూర్ణంగా అనుభూతి చెందేట్లు చేయమని ప్రార్థించాను. ఆ గురువారం డా॥ అన్నవరపు అనే అయన దగ్గర నుండి పోస్ట్‌లో రెండు పార్శిల్స్ వచ్చాయి. అవి నాకే పంపించారో



లేక ఇంకెవరికో తెలియక శ్రీనివాస్ అనే గురుబంధువుకు ఫోన్ చేసి అడిగాను. అవి నాకే అని చెప్తూ, పెద్ద పాకెట్ చాలా అందంగా ఉంది, విప్పి చూడు అని చెప్పాడు. విప్పి చూస్తే ఒక పెద్ద సాయిబాబా ఫోటో ఆల్బమ్. ఒక గంటసేపు ఆ ఆల్బమ్ చూస్తూ బాబా అనుగ్రహాంబుధిలో ఓలలాడాను. ఆ అనుభవం అతి మధురం, అతిశయం. తరువాత రోజు డల్లాస్ నుండి సూర్యప్రకాశ్ ఫోన్ చేసి, నీకు రెండు పార్శిల్స్ వచ్చాయా? అని అడిగాడు. డా॥ అన్నవరపు అనే ఆయన తనని ఎవరైనా బాబా భక్తులు తెలుసా అని అడగగానే ముందు నేను గుర్తు వచ్చి, ఆయనకు నా పేరు, అడ్రస్ ఇచ్చాడట. ఆయన పంపించారు అవి. అలా చెప్పగానే బాబాని తలుచుకుని ఆనందాతిశయంతో ఏడ్చేశాను.

## నా దగ్గరే ఉన్నావు

పి. రామకృష్ణ, చెన్నై.

మా నాన్నగారు 2002లో మరణించారు. గురువుగారే సర్వమై మా కుటుంబాన్ని కాపాడుతూ, ఏ లోటూ లేకుండా అనుగ్రహించారు. మహాసమాధి అనంతరం కూడా అనుగ్రహిస్తూనే ఉన్నారు.

గురువుగారు ఎప్పుడు దర్శనం ఇచ్చినా నేనేమీ చెప్పుకొనేవాడిని కాదు. మా ఇంట్లోవాళ్ళు ఏమైనా గురువుగారికి చెప్పమని చెప్పినా, 'గురువుగారికి అన్నీ తెలుసు. మనకు ఏది ఎప్పుడు కావాలో అప్పుడు ఇస్తారు. అడిగినా, అడగకపోయినా ఇస్తారు' అని చెప్పేవాడిని. గురువుగారిని 'నేను ఎప్పుడూ మీ దగ్గరే ఉండాలి. నేను ఆనందంగా ఉండాలి' అని మాత్రం అడిగేవాడిని.

నవంబర్ 2010లో నాకు గురువుగారితో వ్యక్తిగతంగా మాట్లాడే మహద్భాగ్యం కలిగింది. ఆ సమయంలో కూడా నేను అదే అడిగాను. అప్పుడు గురువుగారు *"నా దగ్గరే ఉన్నావు కదరా, ఇంట్లో పిల్లవాడిలా ఉన్నావు, నా దగ్గరే ఉంటావు"* అని అభయమిచ్చారు. గురువుగారు అలా చెప్పినప్పుడు చెప్పలేనంత ఆనందమేసింది.

తరువాత కొద్దిరోజులకు నేను ఎప్పుడూ ఊహించని వార్త విన్నాను. అది 'గురువుగారు మనకిక లేరు' అని. మా దైవం, తండ్రి, సర్వం ఆయనే అనుకున్న గురువుగారు మహాసమాధి చెందారని తెలియగానే నేను తట్టుకోలేకపోయాను.

గురువుగారు భౌతికంగా ఉన్న చివరి నిమిషం వరకు గురువుగారు ఏదో ఒక మిషమీద దగ్గరగా ఉంచుకొన్నారు. గురువుగారి పవిత్ర పార్థివదేహాన్ని శిరిడీ తీసుకువచ్చిన తరువాత ఆ రోజు సాయంత్రం నుండి గురువుగారి దగ్గరే ఉన్నాను. గురువుగారిని దర్శించుకోవడానికి వచ్చిన గురుబంధువులు గురువుగారికి సమర్పించిన పూలమాలలు తీసి శుభ్రం చేస్తూ అక్కడే ఉండిపోయాను. అలా ఆ సమయంలో గురువుగారిని దగ్గరగా ఎక్కువసేపు చూసుకొనే అవకాశం కలిగింది. మరుసటి రోజు మధ్యాహ్నం 11.30 గంటలు కావస్తుందనగా, సమాధి కార్యక్రమానికి ఏర్పాట్లు చేయడానికి గురువుగారి చుట్టూ ప్రదేశాన్ని ఖాళీ చేయించి అందరిని బయటకు పంపివేస్తున్నారు. నేను గురువుగారిని అక్కడే మీదగ్గరే ఉంచుకోమని పదేపదే ప్రార్థించాను. ఒక గురుబంధువు వచ్చి పెద్దవాళ్ళను కూడా పంపించేశారు. కాని నన్ను మాత్రం ఎవరూ వెళ్ళమని చెప్పలేదు. అక్కడ నేను, గురువుగారి అమ్మ, నాన్న, వారి బంధువులు కొంతమంది ఉన్నాము. గురువుగారికి మంగళ స్నానం చేయించడానికి అన్నీ సిద్ధం చేశారు. అమ్మగారు, శృతిపాప వచ్చారు. గురువుగారిని పేటిక నుండి బయటకు తీసే ముందు అమ్మగారు గురువుగారి మీద ఉన్న పూలని గురుబంధువులకు ఇచ్చారు. అప్పుడు అమ్మగారి ప్రక్కన ఉండే అవకాశం రావడంతో నాకు కూడా ఓ పువ్వు ఇచ్చారు. దానిని గురువుగారి అనుగ్రహంగా, పవిత్ర ప్రసాదంగా భావించాను. గురువుగారికి మంగళస్నానం



చేయించారు. అప్పుడు గురువుగారిని తాకే అవకాశం నాకు కలిగింది. కార్యక్రమం చివరివరకు నేను అక్కడే ఉన్నాను. గురువుగారిని సత్సంగహాలు దగ్గర నుండి సమాధి స్థలానికి తీసుకురావాలి. అప్పుడు పెద్దవాళ్ళందరూ గురువుగారిని వాళ్ళ చేతులమీదకు తీసుకొన్నారు. అలాగే గురువుగారి ఎడమవైపుగా వీపుని నా చేతుల మీదకు తీసుకొనే అవకాశం నాకు కలిగింది. అలా గురువుగారిని నా చేతుల మీద నుండి నా ఛాతీ వరకు పెట్టుకొన్నాను. అందరం సమాధి స్థలం దగ్గరకు తీసుకొని వచ్చాము. ఆ సమయంలో గురువుగారిని నా హృదయానికి దగ్గరగా పట్టుకొని చూసే మహద్భాగ్యం కలిగింది.

నేను ఎప్పుడూ గురువుగారిని కోరుకొనేది 'వారి దగ్గరే ఉండాలి' అని. నన్ను చివరివరకు వారి సాన్నిధ్యంలోనే ఉంచుకొన్నారు. గురువుగారు 'ఎప్పుడూ ఎల్లప్పుడూ నాతోనే ఉంటావు' అని ఇచ్చిన అభయానికి చివరి నిమిషంలో కూడా మళ్ళీ నిదర్శనమిచ్చారు. అన్నీ గురువుగారు చెప్పిన ప్రకారమే జరిగాయి. ఇది నేను మరువలేని అనుభవం.

## సర్వత్రా ఉన్నాను

టి. సాయిమురళి, వెంకటగిరి.

మా ఊరిలో నూతన మందిర నిర్మాణానికి సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ ఆశీస్సులకై ప్రార్థించాము. అమ్మగారి ద్వారా గురువుగారు ఊదీని ప్రసాదించారు. ఊదీ తీసుకొని అక్టోబర్ 28వ తేదీన భూమిపూజ కార్యక్రమం జరిపాము. గురువుగారు మహాసమాధి చెందారని తెలిసి శిరిడీ వెళ్ళి గురువుగారిని దర్శించుకొని వచ్చాము. శిరిడీ నుండి వచ్చిన తర్వాత మందిర నిర్మాణం మొదలుపెడదామా లేదా కొంతకాలం ఆపుదామా అని సందిగ్ధంలో పడ్డాము.

నవంబర్ 21న గురువుగారు స్పష్టంగా కలలో కనపడి, *"ఏమి నేను లేననుకున్నావా? చెప్పిన పని చేయడం నేర్చుకో! వెంటనే మందిరం పని మొదలుపెట్టు, నేను ఎక్కడకీ వెళ్ళలేదు, సర్వత్రా ఉన్నాను జాగ్రత్త!"* అన్నారు. వెంటనే నవంబర్ 22వ తేదీ నుండి మందిర నిర్మాణం మొదలుపెట్టాము. గురువుగారి ఆశీస్సుల వలన నిర్మాణం నిరాటంకంగా జరుగుతోంది. శిరిడీలో సాయిపథం సత్సంగమందిరం ఎలా ఉంటుందో అలాగే ఈ మందిర నిర్మాణం జరుగుతున్నది.

## సమాధి మాట్లాడుతుంది

బి. సువర్చల, తెనాలి.

నేను ప్రతి సంవత్సరం విజయదశమికి లేదా మే 27 (గురువుగారి పెళ్ళిరోజు)కి శిరిడీ వెళ్తుంటాను. నేను శిరిడీకి వెళ్ళే ముందు ప్రతిసారి స్వప్నంలో గురువుగారి దర్శనమయ్యేది. ఈసారి అక్టోబర్ 15 (2010 విజయదశమి)న శిరిడీ వెళ్ళడానికి నిర్ణయించుకొన్నాము. ఆ ప్రయాణానికి సుమారు 20రోజుల ముందు గురువుగారు స్వప్నంలో దర్శనమిచ్చారు. ఆ కలలో– గురువుగారు ఒక పేటికలో పడుకొని ఉన్నారు. దానికి పైన అద్దం లేదు. వారి పాదాలు బయటకు కనబడుతున్నాయి. గురువుగారు ఇందులో ఉన్నారేంటని బాధపడుతున్నాను. దానికి వారు అందులో నుండి అస్పష్టంగా ఏదో మాట్లాడుతున్నారు.



కాని ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదు. తెల్లవారి ఆ కల గుర్తుకువచ్చి చాలా బాధపడ్డాను. నా పిచ్చి కలకు నన్ను నేను తిట్టుకున్నాను. ఎవరికైనా ఇలాంటి కల గురించి ఎలా చెప్తాం? తలచుకొంటేనే బాధగా వున్న విషయాన్ని ఇతరులు మాత్రం ఎలా వింటారు? అని అనుకొని మాఇంటి ఓనర్‌కి మాత్రం చెప్పాను. ఇంకెవరికీ చెప్పే సాహసం చేయలేదు. నాకు ఇంతకు ముందు వచ్చిన కలలు నిజమైనా దీనిని మాత్రం నమ్మలేదు. 'నేను శిరిడీ వెళుతున్నాను కదా. శిరిడీలో ఉండేది బాబా సమాధే కదా. బాబా అంటే నాకు గురువుగారే కదా. అందుకే గురువుగారు బాబాలా ఇలా సమాధి రూపంలో దర్శనమిస్తూ తామిద్దరూ ఒక్కటేనని నాకు చెప్పారు' అని నాకు నేను నచ్చజెప్పుకొన్నాను.

దసరాకు శిరిడీ వెళ్ళివచ్చాము. నవంబర్ 10న మళ్ళీ ఒక కల వచ్చింది. ఈసారి కలలో నల్లని బాబా విగ్రహాన్ని ఒక అరుగుమీద పడుకోబెడుతున్నారు. అదే సమాధి అనే భావన కలిగింది. నేను, మరికొందరం దాని చుట్టూ నిలబడి వున్నాము. ఇంతలోనే మళ్ళీ– మాకు ఆప్తులైన బంధువు చనిపోయినట్లు, వారి శరీరం అక్కడ పడుకోబెట్టినట్లు, చుట్టూ పువ్వులతో అలంకరించినట్లు, బంధువులందరూ ఏడుస్తున్నట్లు కలలో కనిపించింది. నేను కలలోనే విపరీతంగా బాధపడుతున్నాను. తెల్లవారిన తర్వాత కూడా కల తాలూకు బాధ నన్ను వేధిస్తూనే ఉంది. ఇంతలో శ్రీబాబూజీ మహాసమాధి చెందారన్న పిడుగు లాంటి వార్త తెలిసింది. హడావుడిగా శిరిడీ ప్రయాణమయ్యాము. ఈ సందర్భంగా ఇలా ప్రయాణించవలసి వస్తుందని ఎన్నడూ ఊహించలేదు. నవంబర్ 16న రాత్రి సుమారు 8గంటల సమయంలో వారి పార్థివదేహాన్ని నేను దర్శించుకొన్నాను. గురువుగారు సమాధి చెందటానికి సుమారు ఒక 40రోజులు ముందుగానే అలా కలలో కనిపించారు. గురువుగారిని అయిదుసార్లు దర్శనం చేసుకొన్నాను. తనివితీరలేదు. వదలి రాబుద్ధి కాలేదు. కానీ తప్పదు. నాకిప్పుడు అర్థంకానిది ఒకటే. గురువుగారు నన్ను గుర్తుపెట్టుకొని ముందుగానే విషయం నాకు కూడా చెప్పారని ఆనందపడనా? లేక గురువుగారు ప్రసాదించిన స్వప్నాన్ని తెలుసుకోలేకపోయినందుకు బాధపడనా? తెలుసుకొన్నా మనమేం చేయగలిగేవాళ్ళం? కలలో బాక్స్‌లో ఉన్న గురువుగారు మాట్లాడటం గురించి మాత్రం ఒక విషయం చెప్పాలని ఉంది. కలలో అలా కనిపించడం ద్వారా సమాధి నుండి కూడా గురువుగారు మాట్లాడతారని చెప్పకనే చెప్పారని అనిపిస్తోంది. గురువుగారు మన హృదయాల్లో స్థిరనివాసులై ఉండి, మనతో మాట్లాడాలని ప్రార్థిస్తున్నాను.

## మనతో ఉండి కాపాడుతున్నారు

ఎ. సిద్ధార్థ, చెన్నై.

గురువుగారు సమాధి చెందారన్న విషయం తెలిసిన వెంటనే నేను విపరీతంగా ఏడుస్తూ మమ్మీతో, 'ఇంక మనం గురువుగారు లేకుండా ఎలా బ్రతుకుతాము? చెన్నైలో ఎలా ఉండగలము? మనల్ని ఎవరు చూసుకొంటారు?' అని అడిగాను. మమ్మీ ఎంత ఓదార్చినా నాకు ఏడుపు ఆగటం లేదు. చాలాసేపటికి డాడీ వచ్చి, 'గురువుగారు ఎక్కడికీ వెళ్ళరు. మనతోనే ఎప్పటిలాగానే ఉంటారు' అని చెప్పిన తరువాత నేను కొంత ఊరట పొందాను. తరువాత శిరిడీ వెళ్ళి గురువుగారి సమాధి దర్శనం చేసుకొని, మాకు పరీక్షలు ఉండటంతో మా అక్క స్నేహిత, నేను చెన్నైకి వచ్చేశాము. మమ్మీ, డాడీ శిరిడీలోనే వున్నారు. నాకు ఎప్పుడూ పరీక్షలకు ముందు టెన్షన్‌కి గొంతుకి ఇన్‌ఫెక్షన్, జ్వరం వచ్చి మూడు రోజుల వరకు తగ్గదు. అలాగే ఈసారి కూడా జ్వరం వచ్చింది. నేను మమ్మీకి ఫోన్ చేసినప్పుడు మమ్మీ గురువుగారి సమాధి దగ్గరకు ప్రదక్షిణాలు



చేయటానికి వచ్చాను అని చెప్పింది. అప్పుడు నేను 'మమ్మీ, నాకు జ్వరం తగ్గిపోవాలి' అని గురువుగారిని ప్రార్థించమని చెప్పాను. మమ్మీ అలాగే ప్రార్థించుకుని ప్రదక్షిణలు చేసిందట. అప్పుడు సమయం రాత్రి 9గం॥. మరుసటిరోజు ఉదయం లేచేసరికి జ్వరం పూర్తిగా తగ్గిపోయి స్కూల్‌కి వెళ్ళి పరీక్ష కూడా వ్రాయగలిగాను. గురువుగారు మనతోనే ఉండి మనలను రక్షిస్తున్నారని నాకు అనుభవమైంది.

## మళ్ళీ మళ్ళీ దర్శించాలనిపించే సుందరరూపం

రవికుమార్, హైదరాబాద్.

గురువుగారు దేహత్యాగము చేశారని తెలిసి నమ్మలేకపోయాను. అప్పటిదాకా నేను గురువుగారిని దర్శించుకోలేదు. కనీసం చివరిసారి ఇప్పుడైనా గురువుగారి దర్శనం చేసుకోవాలి అని బలంగా మనస్సులో అనిపించింది. అప్పుడే జాబ్‌లో చేరిన నేను, అప్పటికి వేతనంరాక, నావద్ద డబ్బులు లేక ఎలా అని ఆలోచిస్తూ వున్నాను. జాబ్ అనే మొదటి కోరిక తీర్చిన గురువుగారు డబ్బులు అప్పుచేయకుండా శిరిడీ వచ్చేలా చేసి తమ దర్శనభాగ్యము కల్పించారు.

గురువుగారు మహాసమాధి చెందుతారనగా ముందురోజు నా ఫ్రెండ్ శివ నిజామాబాద్ నుండి హైదరాబాద్ వచ్చి, 13వ తేదీ నిజామాబాద్ సత్సంగ వార్షికోత్సవం ఉందని తిరిగి అదే రోజు నిజామాబాద్ బయలుదేరాడు. వెళ్ళే ముందు తనది, భాను అనే ఫ్రెండ్‌ది బస్ పాస్‌లు రెన్యువల్ చేయించమని పాస్‌లు మరియు డబ్బులు 500రూ. ఇచ్చాడు. బస్ పాస్ రెన్యువల్ కోసం రెండుసార్లు కౌంటర్ వద్దకు వెళ్ళగా అక్కడ పెద్ద 'క్యూ' ఉండటంతో కుదరలేదు. మూడవసారి వెళ్ళినప్పుడు 'ఆన్‌లైన్ ప్రాబ్లెమ్' వచ్చి పాస్ రెన్యువల్ చేయలేకపోయాను.

ఆఫీస్‌లో కొద్దిసేపు వుండి టీ త్రాగడానికి హొటల్‌కు వెళ్ళాను. అక్కడ ఆ రోజు సాక్షి దినపత్రికలో గురువుగారి మహాసమాధి విషయం తెలుపుతున్న ఫోటో వేసిన పేజీ హొటల్‌లో నేను కూర్చునే సీటుకు ఎదురుగా పెట్టి ఉండడం చూసి పేపర్ తీసుకొని చదివాను. దాంతో గురువుగారిని చూడాలి అనే కోరిక ఇంకా బలమయింది. టీ త్రాగి బయటకు రాగానే శివ శిరిడీ నుంచి ఫోన్ చేసి, గురువుగారి సుందరరూపాన్ని భౌతికంగా చూడాలి. నువ్వు ఎలాగైనా సరే వీలు కల్పించుకొని తొందరగా రమ్మన్నాడు. దానితో మనసు ఆగలేదు. సాయంత్రం అజంతా ఎక్స్‌ప్రెస్‌కు బయలుదేరాను. డబ్బులు ఎలా అనుకుంటున్నారా? బస్ పాస్ రెన్యువల్ చేయమని ఇచ్చిన డబ్బులు ఎలాగూ వున్నవి కదా. రెన్యువల్‌కు వెళ్ళిన ప్రతిసారీ ఏదో కారణమువల్ల తిరిగి రావడము పని కాకపోవడము ఇవి అంతా గురువుగారు నన్ను శిరిడీ తీసుకురావడానికే అనుకొని వాటితో పాటు 100రూ॥లు కలుపుకుని శిరిడీ బయలుదేరాను.

నవంబర్ 15, 2010 ఉదయం శిరిడీ వచ్చాను. అప్పటికి గురువుగారు శిరిడీ రాలేదు. మొదటిసారి గురువుగారిని చూడబోయే నాకు, తిరిగి ఎప్పటికీ చూడటానికి వీలులేని విధముగా సమాధి కార్యక్రమాలు జరగడం చూసి బాధపడినాను. గురువుగారు వచ్చిన తరువాత శిరిడీ పొలిమేరకు వెళ్ళి గురువుగారికి స్వాగతం పలికి, బాబా నామస్మరణతో బాబా మందిరానికి ప్రదక్షిణ చేయించుకుంటూ సాయిపథం తీసుకువచ్చాము. గురువుగారిని ఎప్పుడెప్పుడు దర్శించుకొందామా అని నేను 'క్యూ'లో నిలబడి, గురువుగారి వద్దకు వెళ్ళి తృప్తిగా గురువుగారిని మొదటిసారి చూడడం జరిగింది. అయినా 'మళ్ళీ మళ్ళీ దర్శించాలనిపించే' సుందరరూపం మన గురుదేవులది. అలా 'క్యూ'లో తెల్లవారేసరికి నాలుగుసార్లు దర్శనం చేసుకున్నాను.



గురువుగారు అంతకుమునుపు వున్నవిధంగానే ఇప్పటికీ, ఎప్పటికీ ఉంటారు అనేదే నా నమ్మకం. ఎందుకంటే మునుపు లేని విధముగా గురువుగారు నాతో మాట్లాడుతున్నట్లు, నాకు మార్గము చూపుతున్నట్లు నాకు అనుభవమై, నా మనస్సుకు స్పష్టత ఏర్పడుతున్నది. సదా మన మంచిని కోరుకునే గురువుగారు చూపిన శుభ్రమార్గంలో నడవాలి అనేది నా ఆశ.

## తక్షణ రక్షణ

ఎమ్. వరలక్ష్మి, తెనాలి.

శ్రీబాబూజీ మహాసమాధి చెందారని తెలిసి నేను, ఇంకా కొంతమంది గురుబంధువులు కలిసి శిరిడీ బయలుదేరాము. ఆ రోజు సాయంత్రం 5.30 గం.లకు కొచ్చిన్ నుండి మన్మాడ్ వెళ్ళే ట్రైన్ ఎక్కబోతుండగా ట్రైన్‌కు, గట్టుకు మధ్యన పట్టాల మీద నిలబడిపోయాను. ట్రైన్‌కు ఉండే మెట్లు నా వెనకాల గట్టిగా రాసుకుంటూ ట్రైన్ వెళ్ళింది. నేను గట్టిగా “బాబా, బాబా” అని అరచాను. మనస్సులో గురువుగారిని స్మరించుకున్నాను. ఎవరో ట్రైన్ ఆపారు. గురుబంధువులు నన్ను పైకి తీసారు. నన్ను పెద్ద ఆపద నుండి గురువుగారే రక్షించారనిపించింది. అక్కడ పోలీసు నన్ను 108 (ఎమర్జెన్సీ)కి తీసుకువెళ్ళమన్నారు. నేను గురువుగారిని చివరిసారిగా దర్శించుకోవాలని శిరిడీ పంపమన్నాను. నన్ను ట్రైన్‌లో పడుకోబెట్టారు. నాకు ఏమయిందోనని అందరూ ఆతృతగా వున్నారు. రాత్రంతా ట్రైన్‌లో అలానే పడుకొని ఉదయం నాగర్‌సోల్ వచ్చిన తరువాత లేచి కూర్చోగలిగాను. నాతో వున్న వారు శిరిడీలో నన్ను డాక్టరుగారికి చూపించారు. డాక్టరు చూసి నా బోన్స్‌కు ఏమీ కాలేదు అని చెప్పి మందులు రాసిచ్చారు. అక్కడక్కడ రెండు మూడు గాయాలు అయ్యాయి. నేను పైనుండి క్రిందికి పడడంవలన నా కాళ్ళు బాగా నొప్పులుగా వున్నాయి. అసలు నడవలేకపోయాను. నన్ను గురువుగారి దర్శనానికి కుర్చీలో తీసుకువెళ్ళారు. అక్కడ నేను అడుగుపెట్టగానే కాళ్ళు వాటంతటవే స్వాధీనంలోకి వచ్చి లేచి నడవగలిగాను. గురువుగారి ముఖంలో ఏదో కదలిక. సజీవంగా చూస్తున్న అనుభూతి కల్గింది.

## శిష్యురాలిగా స్వీకరించారు

సి. సరిత, హైదరాబాద్.

నాకు సత్సంగంలో బాబాను చూస్తూ నామం చెప్పడం చాలా ఇష్టం. శరత్‌బాబూజీగారు అంటే గౌరవం ఉండేదిగాని ఆయనను అంతగా తలుచుకునేదాన్ని కాదు. మా ఫ్రెండ్‌కు శరత్‌బాబూజీగారంటే చాలా ఇష్టం. తను ఎప్పుడు ఆయన దర్శనానికి వెళ్ళినా తన ఫీలింగ్స్ నాకు చెప్పేది. నేను తనను, ‘శరత్‌బాబూజీగారి దర్శనం బాగా అయ్యిందా’ అని అడిగేదాన్ని. ఆయనను ఎప్పుడూ పేరుతోనే పిలిచేదాన్ని. ఆయన మహాసమాధి చెందారు అని తెలిసి చాలా బాధేసింది. ఏడ్చాను కూడా. దాని తర్వాత క్రమం తప్పకుండా సత్సంగానికి వెళ్ళాను. డిసెంబర్ 16, ఆ రోజు గురువారం. తెల్లవారుఝామున 4.00గం.కు నాకు ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో, నేను సత్సంగానికి వెళ్ళాను. అక్కడ నామం చెప్పడం అయిపోయిన తర్వాత, ఆరతి ఇవ్వడానికి శరత్‌బాబూజీగారు వచ్చారు. ఆరతి ఇవ్వడం అయ్యాక ఆయన నన్ను పిలుచుకుని రమ్మని ఎవరినో పంపారు. నేను



చాలా షాక్ అయ్యాను. అంత గొప్ప వ్యక్తితో మాట్లాడటానికి చాలా భయం వేసింది. అలాగే వెళ్ళాను. బాబూజీగారిని 'సర్' అని సంబోధించాను. అప్పుడు ఆయన నావైపు చూసి *"నన్ను సర్ అని పిలవకు, గురువుగారు అని పిలువు. అదే నాకు ఇష్టం"* అని అన్నారు. నేను మళ్ళీ 'అలాగే సర్' అన్నాను. *"అలా పిలవకు అని చెప్పాగా! గురువుగారు అనే పిలువు"* అని చెప్పారు. తర్వాత నా గురించి అడిగారు. ఎవరిద్వారా సత్సంగానికి వచ్చావన్నారు. నేను మా ఫ్రెండ్ పరమేశ్వరి ద్వారా వచ్చానని చెప్పాను. అప్పుడు వేరే వారితో ప్రసాదం తెప్పించి, ఆయన స్వహస్తాలతో నాకు ప్రసాదం ఇచ్చారు. నేను సంతోషంగా తీసుకున్నాను. ఈ స్వప్నం ద్వారా ఆయన నన్ను తన శిష్యురాలిగా స్వీకరించారనే భావన నాకు కలిగింది. ఆయనే– "నేనే నీ గురువున"ని అలా చెప్పకనే చెప్పడం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. అప్పటినుండి గురువుగారని పిలవడం మొదలుపెట్టాను. కానీ నాకు బాబా అంటేనే ఎక్కువ ఇష్టం. నేను నిద్ర లేవగానే బాబాను చూస్తాను. ప్రతిరోజూలాగే 23 డిసెంబర్, గురువారం తెల్లవారుఝామున లేవగానే బాబాను చూద్దామని రోజూ చూసే వైపు చూశాను. కాని ఆ రోజు నాకు బాబా ప్లేస్‌లో గురువుగారు చిరునవ్వుతో ప్రశాంతరూపంతో దర్శనం ఇచ్చారు. నేను అది స్వప్నం అనుకుని మళ్ళీ కళ్ళు నులుముకుని చూసాను. కానీ అక్కడ గురువుగారి రూపం స్పష్టంగా కనిపించింది. అరనిమిషం వరకు బాబా స్థానంలో గురువుగారు దర్శనమిచ్చారు. గురువుగారికి, బాబాకు తేడాలేదనే ఆ అనుభూతితో కళ్ళు సజలమయ్యాయి. నాకు ఇప్పుడు ఒక్కటే బాధ, గురువుగారు సశరీరులై ఉన్నప్పుడు నేను దర్శనం చేసుకోలేకపోయానే అని. కాని ఇప్పటికైనా గురువుగారు నన్ను తన దగ్గరకు తీసుకున్నందుకు ఆనందపడుతున్నాను. ఈ ఆనందాన్ని జీవితాంతం ఇస్తారని ఆశిస్తున్నాను.

## సద్గురు లీలానుగ్రహం

పి. భానుమూర్తి, బోధన్.

నవంబరు15, 2010 తేదీన నా పెళ్ళి ముహూర్తము నిర్ణయించారు. ఎలాగైనా తాళిబొట్టును గురువుగారి ఆశీస్సులు, హస్తస్పర్శతో తీసుకోవాలి అనే కోరిక నాలో ఉంది. గురువుగారు ఎక్కడ వున్నా తాళి తీసుకొని గురువుగారి వద్దకు వెళ్ళాలని అక్టోబరు నెల చివరలో అనుకొంటుండగా, అదే సమయంలో గురువుగారు శిరిడీ వచ్చారని తెలియగానే వెంటనే నేను తాళి తీసుకొని శిరిడీ బయలుదేరాను.

శిరిడీలో అమ్మగారికి నా వివాహము గురించి చెప్పి, గురువుగారి ఆశీస్సులకై తాళిబొట్టు అమ్మగారికి ఇచ్చాను. తరువాత రోజు సాయంత్రం సత్సంగం అయిన తర్వాత నేను ఇచ్చిన తాళిబొట్టును గురువుగారి ఆశీస్సులతో అమ్మగారు నా చేతిలో పెట్టారు. అమ్మగారి పాదదర్శనము మరియు ఆశీస్సులు తీసుకున్నాను. తర్వాత రోజు రాత్రి గురువుగారు చెన్నై బయలుదేరేటప్పుడు దర్శనం చేసుకునే భాగ్యం లభించింది. గురువుగారికి నా పెళ్ళి విషయం చెప్పాను.

గురువుగారు నవంబరు 13వ తేదీన మహాసమాధి చెందారు. అది నాకు చాలా బాధ కలిగించింది. నా పెళ్ళి వాయిదా వేయండి అని ఇంట్లో అడిగాను. ఇంట్లో వాళ్ళు ఒప్పుకోలేదు. నవంబరు 15, 2010న నా పెళ్ళి జరిగింది. అదే రోజు రాత్రి నేను, నా భార్య, చెల్లి, బావ, మరో ముగ్గురు ఫ్రెండ్స్‌తో కలసి శిరిడీ బయలుదేరాను. గురువుగారిని చివరిసారి శిరిడీలో మేము మంగళవారం నవంబర్ 16, 2010 రాత్రి దర్శనం చేసుకున్నాము. పెళ్ళికి ముందు, తరువాత కూడా గురువుగారి ఆశీస్సులు తీసుకోవాలన్న నా కోరిక ఈ విధంగా నెరవేరింది. ఇంటి వద్ద వివాహ విందు నవంబర్ 17న ఏర్పాటు చేసారు. కనీసం



దానినైనా వాయిదా వేయమని అడిగాను. మా బంధువులు దానికీ ఒప్పుకోలేదు. అందుకని గురువుగారి దర్శనము చేసుకొని అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి బయలుదేరాము.

ఇంటివద్ద వివాహ విందు ఆరుబయట స్థలములో ఏర్పాటు చేయడం జరిగింది. కాని ఉదయం నుండి ఆకాశం మేఘావృతం అయివుంది. పరిస్థితి గమనించిన మా నాన్నగారు ఒకవేళ వర్షం పడి ఏదైనా ఆటంకం ఏర్పడినా ఫంక్షన్ కోసం ఇంటికి దగ్గరలో వున్న ఒక హాల్ మాట్లాడి వుంచారు.

మేము అనుకున్న దానికంటే ఎక్కువ జనం వచ్చారు. భోజనము అందరికీ సరిపోవాలి, ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదు, ఎలాగా అని మేము ఆలోచిస్తుండగా, శిరిడీ నుండి గురుబంధువు ఒకరు ఫోన్ చేసారు. నేను అతనితో 'వర్షం ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా ఉండాలి, విందుకు ఏర్పాటు చేసిన పదార్థాలు అందరికీ సరిపోయే విధంగా ఉండాలని గురువుగారిని ప్రార్థించ'మని చెప్పాను. సరిగ్గా మా అమ్మ మా ఇంట్లో బాబా, గురువుగారికి నైవేద్యం పెట్టే సమయంలోనే అతను ఫోన్ చేసాడు. విందు మొదలై సక్రమంగా జరుగుచుండగా మేము అనుకున్న దానికన్నా మరో 150 మందికి పైగా బంధుమిత్రులు రావడం చూసి మరల వంట చేసారు. కానీ ముందుగా వండిన పదార్థాలే అందరికీ సరిపోయాయి. తరువాత వంట చేసిన పదార్థాల నుండి ఒక్క స్పూన్ కూడా తీయకుండా విందు ఆనందంగా పూర్తి అయింది. ఇది అంతా గురువుగారి అనుగ్రహమే.

గురువుగారు భౌతికంగా మనతో లేకపోయినా వారి మాటలు, ఆ అందమైన నవ్వు, నడుస్తూ వస్తున్నప్పుడు ఆ రాజసం, ఆ దర్శనాలు– మా మనస్సులో, కళ్ళలో ఎప్పటికీ చెరగిపోని మధురస్మృతులు. మా జీవితాంతం వారి ఆశయాలకు అనుగుణంగా నడచుకోవాలని వారి పాదాల చెంత ప్రార్థిస్తున్నాము.

## మహాత్ములకు మరణమెక్కడిది?

సురేష్‌రాజు, బోస్టన్, యు.ఎస్.ఎ.

మాకు గురువుగారిని ఫోటోలలో, వీడియోలలో చూడడమే తప్ప వారిని ప్రత్యక్షంగా దర్శించుకొనే అవకాశం కలుగలేదు. 2010, జూలై నెలలో ఇండియా వచ్చినప్పుడు కూడా గురువుగారిని చూసే అవకాశం రాలేదు. కానీ ఎప్పటికయినా దర్శనం ఇస్తారులే అని ఒక ఆశ. అక్టోబర్ 2010లో ఒకరోజు గురువుగారి ఫోటో దగ్గర కూర్చుని వున్నప్పుడు, "నేనేమైనా తప్పు చేశానా? కనీసము స్వప్నదర్శనాలు కూడా ఇవ్వడం లేదు" అనే తలంపు కలిగింది. తరువాత ఒకరోజు గురువుగారు మహాసమాధి చెందుతున్నట్లుగా స్వప్నం వచ్చింది. ఆ స్వప్నదర్శనంలో గురువుగారు కారులో ప్రయాణిస్తున్నారు. వారి గుండె భాగంలో ఎవరో గుచ్చుతున్నారు. గురువుగారు వాటిని లెక్కచేయక మళ్ళీ ముందుకు సాగుతూవున్నారు. ఆ అస్పష్టరూపాలు అలా గుండెల్లో గుచ్చడము, గురువుగారు తిరిగి మామూలుగా ముందుకు పయనం సాగించడమూ ఇలా ఒక సైక్లిక్ ప్రాసెస్‌లాగా మళ్ళీమళ్ళీ జరుగుతూనే వుంది. "మహాత్ములకి మరణమెక్కడిది?" అంటూ ఆ స్వప్నదర్శనం ముగిసింది. ఇంతలో మెలకువ వచ్చింది. ఇలాంటి స్వప్నదర్శనం ఇచ్చేకంటే అసలు ఇవ్వకపోయినా సంతోషంగా ఉండేవాణ్ణి కదా అని గురువుగారిని ప్రార్థించాను.

ఆ తరువాత నవంబర్ 11, 2010న సచ్చరిత్ర పారాయణ చేస్తూ వున్నాను. ఇంతలో సుమారు 11గం॥ల ప్రాంతంలో నా భార్య పద్మజ వచ్చి 'గురువుగారు జర్మనీలో వున్నారట' అని చెప్పింది. మిగతా అందరి గురుబంధువులలాగే నేను కూడా నవంబర్ 13 ఉదయం "గురువుగారు మహాసమాధి చెందారు" అన్న వార్త విన్నాను. గురువుగారు మహాసమాధి చెందారట



అని ఒకే వాక్యము మాత్రమే నా భార్య పద్మజకు చెప్పాను. గురువుగారిని ఒక్కసారి కూడా దర్శనం చేసుకోకుండానే ఇలా అయ్యిందేమిటి? అని బాధపడుతూ వున్నాను. నాకు గురువుగారి దర్శనానికి శిరిడీ వెళ్ళాలి అని వుంది. కానీ ఆ సంవత్సరానికి నాకున్న సెలవురోజులు అన్నీ అప్పటికే జూలైలో ఇండియా వచ్చినపుడు ఉపయోగించుకోవడం జరిగింది. నేను గురువుగారిని ప్రార్థిస్తూ, ఈడ్చుకొచ్చి ఆ దేవుని (బాబా) పాదాల దగ్గర పడవేసినందుకు సంతోషించాలా? లేక ఈ దేవుని (గురువుగారి) పాదాలు తాకే అవకాశము లేకుండా ఇలా అయినందుకు బాధపడాలా?! ఇండియా వచ్చినపుడు నాకు మీ దర్శనభాగ్యము కలగలేదు. మీరు నాకెందుకు ఇలా చేసారు? నాకేమీ అర్థంకావడంలేదు. నాకు ఇప్పుడు శిరిడీ రావాలని వుంది. నాకు సెలవులు కూడా లేవు. నాకు మీరు దర్శనం ఇవ్వదలిస్తే మీరే నన్ను శిరిడీకి రమ్మని చెప్పండి. దానికి గుర్తు ఏమిటంటే, నేను 'గురువుగారు మహాసమాధి చెందారట' అని ఒకే ఒక వాక్యము ఇంతకు ముందే పద్మజతో చెప్పి వున్నాను. ఇక ఈ విషయము గురించి నేను ఏమీ మాట్లాడను. ఎటువంటి డిస్కషన్స్ లేకుండా 'నువ్వు శిరిడీ వెళ్ళు' అన్నమాట ఒక్కటే పద్మజ నాకు చెప్పాలి. అది కూడా ఏ పది గంటల తరువాతనో కాకుండా కొన్ని నిమిషాలలో చెప్పాలి. అదే నాకు మీరు మాతో వున్నారు, వుంటారు అనడానికి గుర్తు. నేను ఇలా అనుకొని అలా తిరిగానో లేదో, కొన్ని నిమిషాలు కాదు, కొన్ని సెకండ్స్‌లోనే పద్మజ "నువ్వు వెళ్ళు, నువ్వు వెళ్ళొచ్చు కదా గురువుగారిని చూడటానికి" అని అంది. ఆవిధంగా ఆయన అప్పుడు ఇప్పుడు మనతో వున్నారు అని తెలియచేసారు. అంతే ఇంక ఆలోచించడానికేముంది, శిరిడీ ప్రయాణమయ్యాను.

## అడిగినవన్నీ నెరవేర్చే వేల్పు

ప్రాతఃదర్శనం ప్రసాద్, తెనాలి.

పూజ్య గురుదేవులు మహాసమాధి చెందారన్న పిడుగులాంటి వార్త విన్న వెంటనే ఇంట్లో అందరమూ మరునాడు బయలుదేరి శిరిడీ చేరుకున్నాము. మా రెండవ అబ్బాయి సాయి రవికిరణ్‌కి కాలేజీలో ఎమ్.సి.ఎ. ఇంటర్నల్ ఎగ్జామ్స్ జరుగుతూ వున్నందువల్ల మాతో శిరిడీ రాలేకపోయాడు. మేము గురువుగారిని దర్శించుకొని సమాధి సేవలో పాల్గొన్నాము. గురుదేవులు వేదిక మీద కూర్చుని ఉండగా బాబా నామం చెప్పాలని నా చిరకాల కోరిక. అది తీరలేదే అని చాలా బాధపడ్డాను. చివరలో గురుదేవుల పార్థివదేహాన్ని పేటిక నుండి బయటకు తీసి, మంగళస్నానం చేయించి, సమాధిలోకి తీసుకొని వెళ్ళే సమయంలో సుమారు 15ని॥లకు పైగా నామాన్ని చెప్పే భాగ్యాన్ని గురువుగారు నాపై కరుణతో అనుగ్రహించారు. గురుదేవుల్ని ప్రార్థిస్తే తీరని కోరిక అంటూ ఉండదని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

గురుబంధువులు గురువుగారిని పేటిక నుండి బయటకు తీసి ప్రక్కన పడుకోబెట్టినపుడు గురుదేవుల దేహంపైవున్న పూలు అమ్మగారు తీసి నామం జరిగేవైపు విసిరినారు. అందులో నాలుగైదు పూలు నామీద పడ్డాయి. అవి గురుదేవులు ప్రసాదించిన ఆశీస్సులుగా భావించి వాటిని దాచుకున్నాను.

గురువుగారిని మా చిన్నబ్బాయికి కూడా మీ దర్శనభాగ్యం కల్పించమని వేడుకున్నాను. మా అబ్బాయి కాలేజి వారికి గురుదేవుల విషయం చెప్పగా, గురువుగారి ఆశీస్సులతో మా అబ్బాయికి మాత్రం ఒకేరోజు రెండు పరీక్షలు పెట్టి శిరిడీకి పంపించారు. 16వ తేదీ రాత్రికి వచ్చి గురుదేవుల్ని తనివితీరా దర్శించుకొని సమాధి కార్యక్రమంలో పాల్గొని, మరుసటి రాత్రి తిరిగి గుంటూరు వెళ్ళాడు. రెండురోజుల తర్వాత కాలేజీలో జరిగిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వారు నిర్వహించిన క్యాంపస్



ఇంటర్వ్యూలో సెలక్టయ్యాడు. అది కేవలం గురువుగారు పెట్టిన భిక్ష. ఇలా అడిగినవి, అడగనివి ఎన్నో కోర్కెలు, సమస్యలు తీరుస్తూ వస్తున్నారు గురుదేవులు.

గురువుగారి రక్షణ మరింతగా అనుభవమైన ఇంకొక సంఘటన. నవంబర్ 25, 2010 రాత్రి పన్నెండు గంటలకు తెనాలి నుండి మా వదినగారికి చాలా సీరియస్‌గా ఉందని కబురు పంపి, నన్ను బయలుదేరి రమ్మన్నారు. నేను ఆ రాత్రి వేరే ఊర్లో నామం జరుగుతుంటే అక్కడికి వెళ్ళాను. నేను ఇంటికి వెళ్ళలేదు. నామం జరుగుతుండగా గురుదేవుల్ని హృదయపూర్వకంగా ఆమె గురించి 'పిల్లలు తండ్రిలేని వాళ్ళు. తల్లినైనా ఉంచండి, డాక్టర్లు తెల్లవారితేగాని ఏ సంగతీ చెప్పలేమన్నారు. మీరే ఆమె ప్రాణాలు కాపాడాలి' అని వేడుకున్నాను. మరుసటిరోజుకి ప్రాణాపాయం తప్పింది. కేవలం గురుదేవులే ఆమెను రక్షించారు.

## దేహత్యాగం ముందే సూచన

రవిశంకర్, తెనాలి.

పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీగారు 2010 అక్టోబర్ మాసంలో మద్రాసులో వారి దర్శనభాగ్యాన్ని అక్కడ ఉన్నవారందరికీ ప్రసాదించారని విన్నాను. నేను కూడా వెళ్ళి గురుదేవుల దర్శనం చేసుకోవాలని అనుకొన్నాను. ఆర్తితో వారి దగ్గరకి బయలుదేరాను. కానీ పూజ్యగురుదేవులు అక్కడ లేరని జర్మనీ బయలుదేరారని సమాచారమందింది. గురువుగారి దర్శనభాగ్యం కలుగలేదని నేను ఎంతగానో నిరాశచెందాను.

12వ తేది తెల్లవారుఝామున నాకు స్వప్నంలో పూజ్యశ్రీసాయినాథుని శరత్‌బాబూజీగారు దేహత్యాగం చేసినట్లు అనిపించింది. నాకు 13వ తేదీ సాయంత్రం శరత్‌బాబూజీగారు దేహత్యాగం చేసారని సమాచారం అందింది. అది విని నేను ఎంతగానో బాధపడ్డాను. నాకు స్వప్నంలో కనిపించిన శరత్‌బాబూజీగారి రూపం, సాయియానాలో వారి పార్థివదేహాన్ని ఉంచినపుడు కనపడిన రూపం రెండూ ఒకేలా కనిపించాయి. గురువుగారిని అలా చూసి ఎంతో వేదన చెందాను.

## అనుదినం నిదర్శనం

కె. రేణుక, బోధన్.

గురుదేవులు మహాసమాధి చెందిన రోజు నుండి ఈరోజు వరకు నా బాధ వర్ణనాతీతం. మా నాన్నగారు చనిపోయి ఆరునెలలు కూడా కాలేదు. ఇంతలోనే అన్నీ తానై నన్ను ధైర్యంగా ముందుకు నడిపిస్తున్న నా గురుదేవులు మహాసమాధి చెందారన్న వార్త విన్న నేను శోకసముద్రంలో మునిగిపోయాను. గురువుగారి సమాధి దర్శనము చేసుకొని, సాయియానాలో బాబా, గురువుగారి చిత్రపటాలవైపు చూస్తుంటే గురువుగారి దర్శనం ఇక భౌతికంగా లభించదని నా మనసంతా వేదన.

ఒకరోజు తెల్లవారుఝామున గురువుగారు ఒక క్షణకాలం దర్శనమిచ్చి మాయమయ్యారు. తరువాత ఆ విషయం మరచిపోయాను. అదే రోజు రాత్రి బాబా మందిరానికి వెళ్ళాను. అక్కడ శివ అన్నయ్య బాబా, గురువుగారి లాకెట్టు ఒకటి



చూపించారు. అందులో ఒకవైపు బాబా, మరోవైపు గురువుగారు ఉన్నారు. నా కలలో చిరునవ్వుతో కనిపించిన గురువుగారి రూపం, ఈ లాకెట్టులో ఉన్న రూపం ఒకటే కావడం విశేషం. గురువుగారి తలపైన పూలరెక్కలు కూడా వున్నాయి.

ఇంకోరోజు గురువుగారి సమాధి దర్శించాలని కోరిక కల్గింది. కానీ ఇంట్లో పరిస్థితులు అనుకూలించక శిరిడీ వెళ్ళలేకపోయాను. సత్సంగ హాలులో 'గురువుగారూ! మీ సమాధి దర్శించలేకపోతున్నాను. అనుగ్రహించండి' అని ప్రార్థించాను. మరుసటి రోజు అంటే, సరిగ్గా నవంబరు 26వ తేదీ తెల్లవారుఝామున అమ్మగారు గురువుగారి సమాధికి హారతి ఇస్తూ కలలో దర్శనమిచ్చారు. కలలో గురువుగారి సమాధిపై ఒక క్లాత్ కూడా కప్పి ఉంచారు. ఇలా నాకు ప్రతిక్షణం గురువుగారు 'నేను నీతోనే వున్నాను, ఎక్కడికీ వెళ్ళలేదు' అని దర్శన, నిదర్శనములనిస్తూ, నన్ను కంటికి రెప్పలా కాపాడుతూ, అన్నివేళలా తోడునీడగా ఉంటూ, నా ప్రతీ పనిలో చేయిపట్టుకొని తండ్రిలా ముందుకు తీసుకువెళుతూ, నాకు ఆనందాన్ని ప్రసాదిస్తున్నారు.

## ప్రార్థన మన్నించారు

పవన్, చెన్నై.

గురువుగారి సమాధి అనంతరం ఒకరోజు నేను బాబాను, గురువుగారిని జీతం పెరగాలని ప్రార్థించాను. నాకు అప్పుడు జీతం 480 యు.ఎస్.డాలర్లు. జనవరి 25వ తేదీ మా మేనేజర్ నన్ను పిలిచి, నీకు జీతం పెంచుతున్నాము. ఎంత ఎక్స్‌పెక్ట్ చేస్తున్నావు? అని అడిగారు. మామూలుగా 20% పెరుగుతుంది కాబట్టి అదే చెప్పాను. కానీ నాకు 70% పెరిగింది. ఇప్పుడు నా జీతం 800 యు.ఎస్.డాలర్లు. ఇది నిజంగా నమ్మశక్యం కావడం లేదు. ఇది కేవలం బాబా, గురువుగారి అనుగ్రహమే.

నేను బాబాకి, గురువుగారికి జీతం పెరగాలని ప్రార్థించాను కానీ ఇంత కావాలి అని అడగలేదు. కానీ నాకు 70% పెంచారు. నాకు చాలా ఆనందంగా ఉంది. నా ప్రార్థన మన్నించి సమాధానమిచ్చారు.

## అనుగ్రహ వీక్షణం

కళ్యాణచక్రవర్తి, తిరుపతి.

నా జీవితంలోని ప్రతిక్షణాన్ని ఒక అనుభవంగా భావిస్తాను. ఒకప్పుడు ప్రతి చిన్న పనికీ టెన్షన్, భయం ఉండేది. ఏ పని చేయాలన్నా ఏదో చేయాలి, చేయాలి అని ఆలోచించకుండా తొందరపాటుగా చేసేవాడిని. నామీద నాకు నమ్మకం ఉండేదికాదు. ఇప్పుడు ఆ భయము కాని, టెన్షన్‌గాని ఏమి లేవు. ఆ మార్పు కేవలం బాబా, గురువుగారి అనుగ్రహాశీస్సుల వలనే వచ్చింది.

గురువుగారు మహాసమాధి చెందిన అనంతరం ఒక గురువారం డిసెంబర్ 2, 2010 తెల్లవారుఝామున నాకు ఒక కల వచ్చింది. అందులో గురుదేవులు దర్శనమిచ్చారు. ఆ కలలో, "నేను మా ఆఫీసు తలుపు తీసుకుని బయటకు వచ్చాను. గురుదేవులు నా ముందు అలా నిలుచొని నా ముఖం వైపు దృష్టి సారించారు. ఆ చూపుతో నాకు ధైర్యాన్నిచ్చారు. "నీకెందుకు నేనున్నా" అని అభయమిస్తూ చూస్తున్నట్లు నాకు అనిపించింది. దాంతో నా ఆనందానికి అవధులు లేవు.



అదే రోజు రాత్రి నా రూమ్‌లో నేను ఒక్కడినే సత్సంగం చేసుకున్నాను. దీపం వెలిగించి సత్సంగం చేసుకుని, భోజనం చేద్దాం అని బయటకు వెళ్ళాను. నేను రూమ్‌లోకి వచ్చి చూస్తే మా రూమ్‌మేట్ ఆ రూమ్‌లో ఫ్యాన్ ఫుల్ స్పీడ్‌లో పెట్టుకొని పడుకొని వున్నాడు. ఫ్యాన్ అంత స్పీడ్‌లో తిరుగుతున్నా ఆ దీపం అలాగే వెలుగుతూ వుంది. ఆ క్షణం నాకు కళ్ళనిండా నీళ్ళు వచ్చాయి. అప్పుడు నాకనిపించింది– అందరు 'గాలిలో దీపం పెట్టి దేవుడా కాపాడు అంటే ఎలా' అంటుంటారు. కాని మన గురుదేవులు గాలిలో దీపం పెట్టినా దానిని కాపాడతానని ఋజువు చేసారు. గాలిలో దీపం వంటి మన జీవితాలను ఆరిపోకుండా బాబా, గురువుగారు కాపాడుతున్నారు. నా లైఫ్ కూడా ఆ గాలిలో దీపం లాంటిదే. బాబా, గురువుగారి అనుగ్రహం ఒక రక్షణ కవచంలాగా ఉండి నన్ను నిరంతరం కాపాడుతోంది.

## సాయి'ధన్య'మైన జీవితం

రజిత, నార్త్‌కరోలినా, యు.ఎస్.ఎ.

గురువుగారు మహాసమాధి చెందిన విషయం తెలిసి చెప్పలేనంతగా బాధపడ్డాము. మాకు ఉన్న వీసా ప్రాబ్లెమ్స్‌వల్ల, నేను, నా భర్త గురువుగారిని కడసారిగా దర్శించుకోవడానికి ఇండియా వెళ్ళలేకపోయాము. మా అమ్మ, నాన్న గురువుగారిని దర్శించుకోవడానికి శిరిడీ వెళ్ళివున్నారు. నవంబర్ 16 మంగళవారం ఉదయం గురువుగారి పవిత్ర దేహాన్ని శిరిడీకి తీసుకుని వస్తున్నారని మా అమ్మా, నాన్న ద్వారా తెలిసింది. ఆ రోజు 11 గంటల నుండి గురువుగారి కోసం ఎదురుచూస్తూ అంతా శిరిడీ ఊరి బయట వేచి వున్నారని చెప్పారు. ఆ సమయంలో ఇక్కడ నాలుగు సంవత్సరాల మా పాప (డాక్టర్స్ పిల్లలు పుట్టరని చెప్పిన తరువాత గురువుగారి అనుగ్రహంతో పుట్టింది) సాయిధన్యకు 101 డిగ్రీలతో జ్వరం మొదలయింది. నైట్ అయ్యేసరికి 103 డిగ్రీలకు చేరింది. అప్పటికి గురువుగారు ఇంకా శిరిడీ రాలేదు. నా పరిస్థితి ఎలా వుందంటే – అటు లాప్‌టాప్‌లో లైవ్ టెలికాస్ట్ చూస్తూ చాలా ఏడుస్తున్నాను, ఇటు పాప వాంతులు చేసుకుని, ఏడుస్తూ వుంది. మా ఆయన కూడా అప్పుడు మా దగ్గర లేరు. నేను లైవ్ టెలికాస్ట్ కూడా చూడలేకపోతున్నాను. పాపకు మెడిసిన్ వేసాను కానీ మళ్ళీ వాంతయింది. జ్వరం కూడా అలాగే వుంది. నేను ఇప్పుడు ఎవరికి చెప్పుకోవాలి, గురువుగారు ఇచ్చిన బిడ్డను ఇప్పుడు ఎవరు కాపాడుతారు? అనిపించి ఒక్కసారిగా దుఃఖం వచ్చింది. ఆ బాధను మాటల్లో వర్ణించలేను. పాప నిద్రపోవాలని, జ్వరం తగ్గాలని బాబా, గురువుగారికి నమస్కారం చేసుకున్నాను.

మా అమ్మా, నాన్నలకు ఫోన్ చేసి 'పాపకు బాగాలేదు. బాబా, గురువుగారిని ప్రార్థించమని' చెప్పాను. మాకు అప్పుడు అర్ధరాత్రి. గురువుగారు ఇంకా శిరిడీ రాలేదు, వారంతా శిరిడీ బయట వెయిట్ చేస్తున్నారు. ఇంకా జ్వరం ఎక్కువైతే నేను ఎమర్జెన్సీకి తీసుకువెళ్ళాలి. అప్పుడు లైవ్ చూడడం కుదరదు. బాబా, గురువుగారి మీద భారం వేసి హాల్‌లోనే అలా లైవ్ చూస్తూ కూర్చునే వున్నాను. గురువుగారు సమాధి చెందారని తెలిసిన దగ్గర నుండి సరిగా నిద్రలేదు. దాంతో గురువుగారి గురించి, పాప గురించి ఆలోచిస్తూ – పాప ప్రక్కన అలా లైవ్ చూస్తూనే నిద్రపోయాను. అప్పుడు గురువుగారు స్వప్నదర్శనం ఇచ్చారు.

ఆ స్వప్నంలో– మనకు దర్శనం ఎలా ఇస్తారో అలాంటి డ్రెస్‌లోనే గురువుగారు వెల్లకిలా పడుకుని వున్నారు. ఎవరో తెలియదు ఒక పాప గురువుగారి మీద అంటే పొట్టమీద సడెన్‌గా వెళ్ళి కూర్చుంది. నేను 'ధన్యా, వద్దు. గురూజీ తాతయ్యకి అబ్బు అయింది (ఆరోగ్యం బాగాలేదని పిల్లలకు చెప్పడానికి వాడే పదాలలో ఒకటి). వద్దు ఇక్కడకు రా' అని గట్టిగా అరిచాను.



అప్పుడు గురువుగారు సడెన్‌గా కళ్ళు తెరచి నవ్వుతూ, సాయిధన్యను (మొదట కనపడిన పాప బదులు సాయిధన్య ఉంది) అలా పడుకునే కాళ్ళమీద కూర్చోబెట్టుకుని ఆడిస్తూ వున్నారు. నేను సడెన్‌గా కళ్ళు తెరిచాను. అప్పుడు రాత్రి 2 గంటలు దాటి ఉండవచ్చు, నేను టైమ్ చూడలేదు. స్వప్నదర్శనం అయిన వెంటనే కళ్ళు తెరిచి– ఇంక ఎక్కడ వున్నారు మీరు అని లైవ్ చూస్తూ చాలాసేపు ఏడ్చాను. తర్వాత సాయిధన్యకు టెంపరేచర్ చూసాను. చల్లగా వుంది. పాపను గురువుగారే కాపాడారనిపించింది. ఇంక పాపకి మెడిసిన్ ఏమీ వెయ్యలేదు. అలా లైవ్ చూస్తూ వున్నాను. గురువుగారు మా వెన్నంటే ఉన్నారని, పాపను సంరక్షిస్తున్నారని, ఆ విషయం అలా స్వప్నదర్శనమిచ్చి తెలిపారని– నాకు తర్వాత ఆలోచిస్తే కానీ తెలియలేదు. ఇంకో విషయమేమిటంటే– గురువుగారు హాస్పిటల్ నుండి వస్తున్నారు కదా, హాస్పిటల్ వాళ్ళు వేసిన డ్రెస్‌లో వుంటారేమో! ఆ డ్రెస్‌లో గురువుగారిని చూడలేము– అని నేను ముందు ఊహించుకున్నాను. కానీ గురువుగారు వచ్చాక లైవ్‌లో చూస్తుంటే– నాకు వచ్చిన స్వప్నదర్శనంలో ఎలా ఉన్నారో అలానే ఉన్నారు. చాలా ఆశ్చర్యపోయాను. ఉదయాన్నే పాపను తీసుకొని డాక్టర్ దగ్గరకు వెళ్ళాను. డాక్టర్ అన్ని పరీక్షలు చేసి, ఏమీ లేదు, 'షి ఈజ్ నార్మల్ నౌ' అని చెప్పింది. మరలా జ్వరం రాలేదు.

గురువుగారు మనకిక లేరని అభద్రతతో ఉన్న నాకు ఆ తండ్రి ప్రేమతో, "నేను మీతోనే ఉన్నాను, పాపను రక్షిస్తూనే ఉన్నాను, భయపడవద్దని" అనుభవం ప్రసాదించి నా వేదనను పోగొట్టారు.

## ఇతరుల బాధ స్వీకరించా

శ్యామల, కర్నూలు.

ఎన్నో బాధలు, కష్టాలతో క్రుంగిపోయి, జీవితంపై పూర్తిగా ఆశ వదులుకొన్న నేను హోమియోపతి వైద్యులు డా॥ రాజశేఖర్ గారి ద్వారా గురువుగారి సన్నిధికి చేరాను. తరువాత నేను సత్సంగానికి వెళ్ళడం మొదలుపెట్టాను. గురువుగారి సన్నిధికి చేరి 18 నెలలు గడిచాయి. ఆ క్షణం నుండి నా జీవితంలో ఆయన రక్షణ అనుభవమౌతూనే వున్నది. గురువుగారు మహాసమాధి చెందారని తెలిసి, గురువుగారు ఇక మనకు లేరని చాలా బాధపడ్డాను. గురువుగారి ఆఖరి దర్శనం చేసుకోవాలని అనుకున్నాను. అనివార్యకారణాల వలన వెళ్ళలేకపోయాను. దాంతో నాలోని బాధ రెట్టింపు అయింది. ఈ జన్మ వృథా అని చాలా బాధపడ్డాను.

నవంబర్ 16 మంగళవారం రాత్రి ఒక ఆశ్చర్యకరమైన అనుభవం నాకు కలిగింది. అది ఏమంటే ఆ రాత్రి నేను బాధపడుతూ పడుకున్నప్పుడు 11.40గం.లకు నాకు ఒక ఫోన్ కాల్ వచ్చింది. కాల్ ఎత్తగా 'స్వప్నవా?' అని అడిగారు. కాదు అని ఫోన్ కట్ చేసాను. తరువాత నేను పడుకొన్నాను. అప్పుడు నాకు ఒక కల వచ్చింది. ఆ కలలో మా చిన్నపాపకు ఆరోగ్యం బాగోలేక డా॥ రాజశేఖర్‌గారి క్లినిక్‌కు వెళ్ళాను. అక్కడ ఒక తెల్ల స్టూల్‌పై గురువుగారు కూర్చున్నారు. 'మీరు ఎందుకు ఇక్కడికి వచ్చారు?' అన్నాను. గురువుగారు తన పాదాలను చూపించారు. ఆ రెండు పాదాలు పుండ్లు పడి రక్తం కారుతున్నాయి. నేను గురువుగారితో 'మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు? ముంబైకి వెళ్ళవచ్చు కదా' అన్నాను. దానికి గురువుగారు 'రాజును చూడడానికి వచ్చానని డా॥ రాజశేఖర్‌గారిని చూపిస్తూ చెప్పారు. 'మరి మీ పుండ్లు ఎలా తగ్గుతాయి?' అని అడిగాను. "*నావి అయితే తగ్గేవి తల్లీ! అవి వేరే వాళ్ళవి. నేను స్వీకరించాను*" అని గురువుగారు అన్నారు. నేను 'గురువుగారూ' అంటూ కళ్ళు తెరచి చూసాను సమయం 5.40గం. అయింది.



రాత్రి వచ్చిన ఫోన్ కాల్ కోసం సెల్ చెక్ చేసాను. ఫోన్‌లో నెంబర్ లేదు. స్వప్నంలో వస్తానని గురువుగారు నాకు ముందుగానే ఫోన్ ద్వారా తెలిపారు. దానితో గురువుగారు ఎక్కడికీ వెళ్ళలేదు మనతోనే ఉన్న అనుభూతి కలిగింది. ఆ క్షణం నుండే నా మనసులోని బాధ అంతా ఒక్కసారిగా తొలగిపోయింది. 'నా చివరి శ్వాసవరకు గురువుగారు నా వెన్నంటే ఉంటారు' అన్న విశ్వాసం కలిగింది.

## సమాధి నుండే సమాధానం

అద్దంకి పద్మావతి, తెనాలి.

గురువుగారు మహాసమాధి చెందడానికి వారంరోజుల ముందు నాకొక కల వచ్చింది. ఆ కలలో గురువుగారు దేహత్యాగం చేసినట్లుగా దర్శనమయింది. చాలా బాధవేసింది. ఆ విషయం ఎవరికీ చెప్పలేదు. గురువుగారి దర్శనం ఇలా ఎందుకైందని మథనపడుతూ గురువుగారు ఆరోగ్యంగా ఉండాలని బాబాను ప్రార్థించాను. ఆ తరువాత గురువుగారు మహాసమాధి అయ్యారని తెలిసి చెప్పలేనంతగా బాధ కలిగింది. అప్పుడు మా ఇంట్లో వారికి గురువుగారు తమ దేహత్యాగాన్ని కలలో ముందే నాకు తెలియజేసారని చెప్పాను. గురువుగారు మహాసమాధి చెందే విషయం ఆయన ముందుగానే సూచించారని గురుబంధువులు చెప్పుకొంటుండగా తెలిసింది.

నవంబర్ 24, 2010న గురువుగారు స్వప్నదర్శనం ఇచ్చారు. అందరం లైన్లో నిలుచొని ఎలా దర్శనం చేసుకొంటామో అలా దర్శనం అయింది. గురువుగారు సశరీరులుగా ఉన్నప్పుడు స్థిరాస్తి ఇప్పించమని ప్రార్థించాను. దానికి ఆ రోజు స్వప్నదర్శనంలో స్థలం వెంటనే కొనమని చెప్పారు. ఆ విధంగా కలలో గురువుగారు చెప్పిన వెంటనే స్థలం కొన్నాము. గురువుగారు సమాధి చెందిన తర్వాత కూడా మన కోరికలకు, సమస్యలకు సమాధి నుండే సమాధానం ఇస్తున్నారు.

## సద్గురు దర్శనం

కె.ఎస్. రామదాసు, విజయవాడ.

నేను 2010లో గురుపౌర్ణమికి, విజయదశమికి శిరిడీ వెళ్ళినా కూడా గురువుగారు వచ్చేవరకు ఉండలేక పోయినందువల్ల వారి దర్శనభాగ్యం కలుగలేదు. అది నాకు మనస్సులో బాధ కలిగిస్తూ వున్నది. నవంబర్ 13, 2010న గురుదేవులు మహాసమాధి చెందారని తెలిసి కొంతమంది గురుబంధువులతో కలిసి శిరిడీకి వెళ్ళాము. మరుసటిరోజు బాబా దర్శనానికి వెళ్ళి సమాధి మందిరంలో అడుగుపెట్టిన నాకు బాబా ముఖంలో గురువుగారు చిరునవ్వుతో దర్శనమిచ్చారు. అప్పుడు నేను 'సంవత్సరం నుండి నాకు మీ దర్శనభాగ్యం కలుగలేదు. ఈరోజు మీ దర్శనాన్ని బాబాలో చూచే భాగ్యం నాకు కలిగించారా గురువుగారూ' అనుకొన్నాను. గురువుగారు బాబాలో లీనమైనారనే అనుభూతి కలిగింది.



## నవ్వుతో బాధంతా మటుమాయం

**మాధవి, తెనాలి.**

నవంబర్ 13, శనివారం సాయంత్రం బజారుకు వెళ్ళిన నేను గురుబంధువు కిరణ్‌గారి ద్వారా బాబూజీగారు దేహత్యాగం చేశారు అనే వార్త విని విపరీతంగా బాధపడ్డాను. ఇంటికి వెళ్ళి మావారికి ఈ విషయం చెప్పి ఏడుస్తూ పడుకున్నాను. బాబా నామం చేసుకుంటూ ఇలా జరిగింది ఏమిటని బాధపడ్డాను. ఆ రాత్రి కలలో గురువుగారు దర్శనమిచ్చారు. మరుసటి రోజు మాకు డాక్టర్ దగ్గర అపాయింట్‌మెంట్ ఉండటంతో మేము నర్సరావుపేట వెళ్తున్నాం. బస్సులో కూడా ఈ విషయమే తలుచుకుంటూ బాధపడుతూ కూర్చున్నాను. కళ్ళు మూసుకోగానే ఒక్కసారి గురువుగారు చాలా ఆనందంగా నవ్వుతూ కనిపించారు. ఆ దర్శనంతో అప్పటిదాకా పడుతున్న బాధ అంతా ఒక్కసారి తగ్గి మనసంతా తేలికగా అయిపోయింది. ఇప్పటికీ, ఎప్పటికీ కూడా ఆయన మనతోనే ఉంటారని నా మనసుకి అనిపించింది. బాబా నామం ఎక్కడ వుంటే ఆయన అక్కడే వుంటారు ఎప్పటికీ.

## కలలో జరిగినదంతా నేను చెప్పకుండానే చెప్పారు

**ఎస్.సిహెచ్.బి.కె. గుప్తా, హైదరాబాద్.**

1992 లేదా 1993లో అనుకుంటాను. అప్పట్లో నేను గురువుగారి దగ్గరకని శిరిడీ వస్తూ పోతూ వుండేవాడిని. కొన్ని సందర్భాలలో శిరిడీలోనే నెల, రెండునెలలు ఉండేవాడిని. పాత సాయిపథం పది గదులలో గురువుగారు 5,6 నెంబరు గదుల్లో ఉంటుండేవారు. ఆ రోజుల్లో గురువుగారి దర్శనం ప్రతి రాత్రి చేసుకొనే అవకాశం ఉండేది. గురువుగారు నన్ను ఏదో ఒక పనిమీద బాబాను సశరీరులుగా చూసినవాళ్ళను కలవడానికి, లోకల్‌గా కొన్ని విషయాలు అడిగి తెలుసుకోవడానికి పంపేవారు. నేను శిరిడీలో ఉన్న రోజుల్లో చేతనయినంతవరకు ఆ పనులు నిర్వర్తిస్తుండేవాడిని.

ఆ సమయంలో ఒకరోజున నాకొక కలవచ్చింది. ఆ కల చాలా స్పష్టంగా వుంది. ఆ కలలో గురువుగారు సమాధి చెందినట్లు కనిపించింది. అందరం బాబా నామం చేస్తున్నాము. కలలో నేను బాగా లీనమైపోవడంవల్ల, నాకు తెలియకుండానే బాధతో ఏడుస్తూ, భయంతో వణికిపోయాను. ఆ కల విషయాలు గురువుగారికి చెబుదామని రోజంతా వేచి వుండి దర్శనాలయిన తర్వాత నేను ఒక్కడినే గురువుగారి దగ్గరకు వెళ్ళి, 'సార్! నాకు రాత్రి ఓ భయంకరమైన కల వచ్చింది. చెప్పాలన్నా ధైర్యం చాలడంలేదు. చెప్పకుండా ఉండలేకపోతున్నాను' అని అక్కడే కూర్చున్నాను. గురువుగారు బాగా నవ్వుతూ *"ఏంటి గుప్తాగారూ! మీకొచ్చిన కలలో నేను చచ్చిపోయానా? సమాధి కూడా కట్టారా? మీరంతా భజన చేస్తున్నారా?"* అని నా కలలో జరిగినదంతా నేను చెప్పకుండానే చెప్పడంతో నా తల తిరిగిపోయింది. 'ఏంటి సార్, ఇట్లా కల రావడం ఏమిటి? నేను చెప్పకుండానే నాకొచ్చిన కల మీరు చెప్పడం ఏమిటి? ఏమాత్రం అర్థం కావడంలేదు! ఇట్లాగైతే ఎట్లాసార్, అసలు ఎందుకు రావాలి సార్ ఈ కల' అని ధారాపాతంగా ఏడుస్తూ కూర్చున్నాను. గురువుగారు *"ఏం భయపడకండి. అలా కల రావడం మంచిదే!"* అని నన్ను ఓదార్చారు. నాకు మాత్రం– ఏమిటబ్బా ఇలా కల వచ్చిందని కొన్నాళ్ళవరకు భయంభయంగా ఉండేది. మన దురదృష్టం కొద్దీ ఆనాటి ఆ కలను ఈనాడు నవంబర్ 13న గురువుగారు నిజం చేసారనిపిస్తుంది. గురువుగారు ప్రత్యక్షంగా మన ఎదుట



లేకపోయినా– వారితో గడిపిన మధుర క్షణాలను, వారు ప్రసాదించిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఆలోచిస్తే– ఆయన సర్వత్రా ఉన్నారని, సదా మనతో ఉంటారని దృఢవిశ్వాసం కలుగుతుంది.

## రక్షణ

కార్లోస్ గిల్, స్పెయిన్.

గురువుగారి పవిత్రదేహాన్ని సమాధి చేసే సమయంలో, సమాధి నుండి కూడా ఆయనిచ్చిన రక్షణ నాకు అనుభవమయింది. ఆ సమయంలో సమాధి దగ్గర ముందు నిలబడి వున్నాను. గురువుగారిని కడసారి చూసే ఆ సమయంలో ఒక్క క్షణమైనా కోల్పోవడం నాకు ఇష్టంలేదు. అందరూ బాధతో, భక్తితో, భావావేశంతో గురువుగారిని దర్శించుకోవాలనే తాపత్రయంతో నెట్టుకుంటుండగా నేను పట్టుతప్పబోయాను. అప్పుడు నా రెండు చెవిమెషీన్లు క్రింద పడిపోయాయి. అదృష్టవశాత్తూ ఒకటి నా చేతిలో పడింది. రెండవది క్రింద పడింది. అన్ని వందలమంది త్రొక్కిసలాడుతున్న ఆ ప్రదేశంలో అది ఖచ్చితంగా విరిగిపోయి ఉంటుందని అనుకొన్నాను. ఆ చెవిమెషీన్లు చాలా సున్నితమైనవి మరియు ఖరీదైనవి. నేను పదినిముషాల తరువాత కొంచెం దూరంలో నిలబడి ఉండగా, ఆ త్రొక్కిసలాటలో అందరి పాదాలమధ్య నా చెవిమెషీన్ కనిపించింది. అది విరిగిపోకుండా మంచిస్థితిలోనే దొరికింది. ఇది నిజంగా ఆశ్చర్యం, అద్భుతం.

## సర్వవ్యాపకత, రక్షణ

కిరణ్, శాన్ డియాగో, యు.ఎస్.ఎ.

మా జీవితమంతా గురువుగారి అనుగ్రహప్రసాదమే. అందులో ఇది ఒక మధురమైన జ్ఞాపకం. గురువుగారు సమాధి చెందిన తరువాత ఆయన ఎప్పుడూ మాతోనే ఉన్నారనే భావన మరింతగా హృదయగతమైంది. కారు డ్రైవ్ చేసేటప్పుడు గురువుగారు నాతోనే ఉన్నారు, నా ప్రక్కనే కూర్చుని ఉన్నారు అనే భావనతో నా కారులో ప్రక్క సీటు ఖాళీగా ఉంచటానికి ప్రయత్నిస్తాను.

